సామాజిక, రాజకీయ పక్షపత్రిక

10 నవంబర్ 2017
పేజీలు : 36
వెల : 10/-

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల



## టీఆర్ఎస్ వ్యతిరేక ఉద్యమాలను ఉధృతం చేద్దాం!

### రాష్ట్ర కార్యవర్గం పిలుపు



# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:27 | సంచిక:24 | 10 నవంబర్ 2017


ఈ సంచికలో...


- సత్యసిద్ధాంతం, చిత్తశుద్ధి తెలుగు నాట గెలుపొందాలి! ... 03
- ఉక్కుమనిషికి ఘన నివాళులు ... 04
- టీఆర్ఎస్ వ్యతిరేక ఉద్యమాలను ఉధృతం చేద్దాం! ... 07
- అధ్యక్షోపన్యాసం ... 08
- 'ప్రగతి' భవన్ ఎవరి కోసం? ... 11
- నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి! ... 14
- నకారాత్మక రాజకీయాలకు స్వస్తి పలకాలి ... 18
- శరీరము, మనస్సు, బుద్ధి, ఆత్మల సమగ్రత్వం మనిషి! ... 20
- కేరళలో మత మార్పిడి కుంభకోణం? ... 21
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 100వ ర్యాంకు ... 22
- పిల్లలతో పాటు పెద్దలూ ఆడాలి ... 23
- గుజరాత్, హిమాచల్ ఎన్నికల ఫలితాల తరువాత కాంగ్రెస్ మారుతుందా? ... 24
- కశ్మీర్‌లో మధ్యవర్తిగా దినేశ్వర్ శర్మ: పరిష్కారం దిశగా ముందడుగు ... 25
- హామీలు తుంగలో తొక్కడం కాంగ్రెస్ నైజం ... 26
- ఉత్త ప్రకటనలే..! నియామకాలేవి..? ... 27
- కొత్త సచివాలయంపై కేసీఆర్ మొండిపట్టు ... 28
- అక్రమార్కుల కోసం షబ్బీర్ అలీ మధ్యవర్తిత్వం ... 29
- బీద, బడుగు వర్గాల బతుకులను ఛిద్రం చేస్తున్న మద్యం మహమ్మారి ... 30
- కమీషన్ కాకతీయే! తేల్చిచెప్పిన కాగ్ ... 33



మీ వార్తలు, సంబంధిత ఫోటోలు (ఫోటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా) మెయిల్‌ద్వారా కూడా జనసందేశ్‌కు క్షణాల్లో పంపించవచ్చు. మీరు పంపవలసిన చిరునామా (ఈ-మెయిల్): janasandesh@yahoo.co.in

janasandeshmag@gmail.com

Phone No :040 24650866



Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU**
on behalf of Bharateeya Janata Party and
Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads, Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan,
Opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.


# సంపాదకీయం

## సత్య సిద్ధాంతం, చిత్తశుద్ధి తెలుగు నాట గెలుపొందాలి!

వ్యాపారానుకూల దేశాల జాబితాలో భారత్ స్థానం ఏకంగా 30స్థానాలు పైకి ఎగబాకడం దేశంలో కొందరికి అసూయను, కొందరికి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఎవరేమనుకున్నా ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ సంస్థలు ఇచ్చిన రేటింగ్ విశ్వసనీయమైనది కావడంతో భారత్‌లో పెట్టుబడులు పెట్టే కంపెనీల విలువ వేగంగా వృద్ధి జెందుతున్నది.

భారత్ ప్రగతి పథంలో సాగుతున్నదని విశ్వాసం కలిగితేనే విదేశీ మదుపర్లు పెట్టుబడులతో వస్తారు. అందివచ్చిన పెట్టుబడుల ఆసరాతో దేశాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టించడానికి దేశప్రజలు కలిసికట్టుగా కృషి సాగిస్తేనే లాభాల పంట పండి మదుపర్లకు, దేశ ప్రజలకు లబ్ధి చేకూరేది.

మైనారిటీలను బుజ్జగించకుండా, ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడకుండా ప్రగతి సాధనకు అవసరమైన ప్రజా మద్దతు మోదీ ప్రభుత్వానికి ఎలా లభించిందనేది అసూయపరులకు అంతుచిక్కని కోటి డాలర్ల ప్రశ్న.

పెద్దనోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైపోయిందని డొల్ల మేధావుల మాటలు నమ్మి పిల్లి శాపనార్థాలు పెట్టాం కదా పారలేదమని కాంగ్రెస్, కమ్యూనిస్టు తదితర పార్టీలు మధనపడిపోతున్నాయి. జీయస్టీ చిక్కులతో దేశప్రజలు ఆగ్రహంతో ఉన్నారని మీడియాలో తిష్ట వేసిన నకిలీ విశ్లేషకుల రాతలకు, వ్యాఖ్యలకు భిన్నంగా అంతర్జాతీయ సంస్థలు రేటింగ్ ఉందేంటన్న ప్రశ్నకు కుహనా పండితులు కక్కలేక మింగలేక అల్లాడి పోతున్నారు.

వాస్తవానికి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నుండి ఆరంభమై వేర్వేరు నేతల నేతృత్వంలో ఆరు దశాబ్దాలకు పైగా సాగిన పాలనలో కూడా ప్రగతి పథంలో భారత్ ముందుకు సాగుతూనే వచ్చింది. అయితే పురోగమన వేగం, వృద్ధిరేటుల్లో మోదీ పాలనలో అనూహ్యమైన మార్పు సంభవించింది.

ఇదెలా సాధ్యమైందో అర్థం కాకనే రాజకీయ పండితులు, మేధావులు సైతం తలలు పట్టుకుంటున్నారు. ఆదర్శ పాలకుల దృక్పథం గురించిన అవగాహన రాహిత్యమే పరిశీలకులు, విశ్లేషకులు, వ్యాఖ్యాతలలో నెలకొన్న గందరగోళానికి అసలు కారణం. స్వతంత్ర భారత పాలకుల్లో నెలకొన్న ఈ లోపాన్ని అర్ధశతాబ్దికి పూర్వమే పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కనిపెట్టారు. 'ఏ ఒక్క విషయంలోనైనా దేశ ప్రజల ఏకగ్రీవ ఆమోదం సాధ్యం కాకపోయినా, ఏ దేశంలో నైనా ప్రజల సాధారణ కోరిక అనేది ఉంటుంది. ఈ ప్రజాబాహుళ్య వాంఛితాన్ని పాలకులు పునాదిగా చేసుకున్నట్లయితే దేశం సరైన దిశగా సాగుతోందని, దాని కృషిలో తన ఆకాంక్షలు ప్రతిఫలిస్తున్నాయని సామాన్యుడు సైతం భావిస్తాడు.' అని చక్కని పరిష్కారాన్ని కూడా ఆయన రాజకీయరంగానికి అందించారు. దీనదయాళ్‌జీ సూచించిన పరిష్కార మార్గాన్ని చిత్తశుద్ధితో ప్రధాని మోదీ అమలు చేసి ప్రజా మద్దతు పొందగలిగారు. అది సత్య సిద్ధాంతం అని రుజువైంది.

మోదీ ప్రభుత్వం ఏ పని తలపెట్టినా దాన్ని ఆ నాటికి చేరువలో ఉన్న ఏదో ఒక ఎన్నిక, ఎన్నికలతో ముడి పెట్టి విశ్లేషించడం, వ్యాఖ్యానించడం మాత్రమే తెలిసిన మన డొల్ల మేధావులకు అసలు సత్యం అవగతం కాలేదు. అర్ధ సత్యాలను, అసత్యాలను ఆధారం చేసుకుని వండి వార్చిన కుహనా మేధావుల విశ్లేషణ, వ్యాఖ్యలను నమ్మి మీడియా దారి తప్పింది. కానీ ప్రధాని చిత్తశుద్ధిని పసిగట్టిన ప్రజలు దారి తప్పలేదు. దేశ ప్రగతిని దారి తప్పనివ్వలేదు.

తెలుగు రాష్ట్రాల్లో కూడా పాలకుల తీరు, నేతల దృక్పథంలో దీనదయాళ్‌జీ సూత్రీకరణ ప్రకారం లోపం ఉన్నదని గమనించే 60 సంవత్సరాలకు కాంగ్రెస్‌కు చెప్పిన పాఠాన్ని తెలుగు ప్రజలు ఇక్కడి పాలకులకు 60నెలల్లోనే చెపుతారని అమిత్ షా తదితర బిజెపి అఖిల భారత నేతలు అంచనా వేసి, 2019 ఎన్నికల నాటికి అధికారం అందుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని బిజెపి శ్రేణులకు పదే పదే పిలుపునిస్తున్నారు. సత్యసిద్ధాంతం చిత్తశుద్ధి తోడై తెలుగునాట గెలుపొందాలి!

సంస్మరణ

# ఉక్కుమనిషికి ఘన నివాళులు



అక్టోబర్ 31న ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి ఉత్సవాలను బిజెపి ఘనంగా నిర్వహించింది. హైదరాబాద్ లోని అసెంబ్లీ సమీపంలోని సర్దార్ పటేల్ విగ్రహానికి బిజెపి రాష్ట్ర నేతలు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. భారత ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన జాతీయ ఐక్యతా పరుగు 'రన్ ఫర్ యూనిటీ'లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు పటేల్ సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా డా॥ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. కులాలు, మతాలు, భాషలు వేరైనా భారతీయులమనే భావనతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని 'సబ్‌కా సాత్-సబ్‌కా వికాస్' లక్ష్యంతో పరిపాలన అందిస్తున్నారని అన్నారు. యువత దేశభక్తి భావనతో, అన్నింటి కంటే దేశమే ముఖ్యమనే అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

సర్దార్ పటేల్ తన చతురతతో దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారత్‌లో విలీనం చేశారని తెలిపారు. ముస్లిం రాజుల పరిపాలనలో ఉన్న హైదరాబాద్, జూనాగఢ్ సంస్థానాలు భారత్‌లో విలీనం కాబోమని, ప్రత్యేక దేశాలుగానే ఉంటామని మొండికేశాయని, అయితే సర్దార్ సాహసోపేతంగా హైదరాబాద్ సంస్థానంపై పోలీసు చర్య ద్వారా తెలంగాణ ప్రాంతం విమోచన పొంది భారత్‌లో అంతర్భాగమైందని అన్నారు. అప్పటివరకు హైదరాబాద్ సంస్థానం పాకిస్థాన్‌కు అనుబంధంగా కానీ, ప్రత్యేక దేశంగా కానీ కొనసాగుతుందని ప్రకటించి, నిజాం తన ప్రైవేట్ సైన్యం రజాకార్ల ద్వారా హిందువులపై అరాచకాలకు, అత్యాచారాలకు, దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడ్డారని అన్నారు. సమైక్య పాలనలో ఉన్న పార్టీలు, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వం, రజాకార్ల వారసత్వ పార్టీ అయిన మజ్లిస్ ఒత్తిడికి తలొగ్గి నిజాం అరాచక చరిత్రను వెలుగులోకి రాకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. దేశమంతా ఆగస్టు 15, 1947లో స్వేచ్ఛావాయువులు పీలిస్తే, తెలంగాణ ప్రాంతానికి 13 నెలల సుదీర్ఘ పోరాటం, అనేక మంది త్యాగాల ద్వారా సెప్టెంబర్ 17, 1948న స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో టీఆర్ఎస్ పార్టీ విమోచన దినోత్సవాన్ని ప్రధానంగా ప్రస్తావించి, నేడు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపకుండా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని విమర్శించారు. సర్దార్ పటేల్‌కు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉందని, వారిని గౌరవించాల్సిన బాధ్యతను టీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు.

దేశంలో పటిష్టమైన పాలనా యంత్రాంగం ఉండాలని భారతీయ సర్వీస్ పాలనను సర్దార్ పటేల్ ప్రారంభించారన్నారు. శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు రాజ్యాంగానికి లోబడి పనిచేస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ మన్ననలు పొందుతుందంటే దానికి పటేల్ కృషే కారణమని అన్నారు. పటేల్ సేవలు, చరిత్ర నేటి తరానికి, రాబోయే తరాలకు తెలియజెప్పాల్సిన అవసరముందని అభిప్రాయబడ్డారు.

స్వాతంత్ర్య ఉద్యమం అనంతరం నెహ్రూ కుటుంబానికే ఖ్యాతి లభించే విధంగా చరిత్రను కాంగ్రెస్ వక్రీకరించిదని దుయ్యబట్టారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అనేకమంది త్యాగాలు, బలిదానాలు చేశారనీ, జాతీయవాదులుగా, దేశభక్తులుగా వారి చరిత్రను మనం భావి తరాలకు తెలియజెప్పాల్సిన అవసరముందని డా॥ లక్ష్మణ్ స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎంపీ బండారు దత్తాత్రేయ, బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి, శాసనమండలి పక్షనేత ఎన్.రాంచందర్ రావు, ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**-జనసందేశ్ ప్రతినిధి**



మనం చేస్తున్నది పేదరికంపై పోరాటం. వారి లోపల దాగున్న ప్రతిభను జాగృతంచేసి విజయం సాధిద్దాం.

వర్తమానం

# బిజెపిలో పెద్ద సంఖ్యలో చేరికలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పథకాలు నచ్చి బిజెపిలో చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన ఎన్ఆర్ఐ పటేల్ రవిశంకర్, పటేల్ విజయ్ కుమార్, సంఘ సేవకురాలు అరుణతో పాటు వివిధ పార్టీలకు చెందిన 2వేల మంది నేతలు, కార్యకర్తలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ సమక్షంలో అక్టోబర్ 25న బిజెపిలో చేరారు.

ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. "టీఆర్ఎస్.. కుటుంబ, అవినీతి పాలనకు ప్రతీక. కాంగ్రెస్ కూడా వంశపారంపర్య కుటుంబ పాలన, కుంభకోణాలకు నిలయం. ఈ విషయాల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ కూటములు దొందూదొందే"అని విమర్శించారు. టీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. ప్రజల ఆకాంక్షలు బిజెపితోనే నెరవేరుతాయన్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ రెండూ అవినీతి కూటములేనని ఆరోపించారు. కొందరు రాజకీయ పబ్బం గడుపుకొనేందుకే పార్టీలు మారుతున్నారని ఎద్దేవా చేశారు.

"హైదరాబాద్ పాతబస్తీలోకి మెట్రో రాకుండా మజ్లిస్ అడ్డుకుంటుంటే టీఆర్ఎస్ ఏం చేయడం లేదు. ఆ రెండు పార్టీలు తోడుదొంగలు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేస్తానని చెప్పి నరకకూపంగా మార్చారు. ఓవైపు మజ్లిస్‌ను, మరోవైపు తెలంగాణ ద్రోహుల్ని కుడి, ఎడమ భుజాలుగా



కేసీఆర్ చేసుకున్నారు" అంటూ లక్ష్మణ్ ధ్వజమెత్తారు. సీనియర్ నేత బద్దం బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో వికారాబాద్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బిజెపి విజయం ఖాయమన్నారు. ఎన్ఆర్ఐ రవిశంకర్ మాట్లాడుతూ.. మోదీ ప్రధాని అయ్యాక అమెరికాలో భారతీయులకు గౌరవం పెరిగిందన్నారు.

అక్టోబర్ 26న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం, డా॥ లక్ష్మణ్ సమక్షంలో ఓల్డ్ అల్వాల్‌కు చెందిన సాయి పెద్దసంఖ్యలో ఉన్న అనుచరులతో బిజెపిలో చేరారు.

**-జనసందేశ్ ప్రతినిధి**

# కేసీఆర్ ప్రభుత్వానికి జబ్బు పట్టింది

తెలంగాణలో ప్రభుత్వానికి జబ్బు పట్టిందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే ఆ జబ్బును వదిలిస్తారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రంగాపురంలోని అసంపూర్తి నిమ్స్ భవనం ముందు బిజెపి జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామ్‌సుందర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన 'నిమ్స్‌పై ప్రజా పంచాయితీ' కార్యక్రమానికి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఎయిమ్స్ ఆసుపత్రిని మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ స్థలం కేటాయించలేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో నిమ్స్‌పై ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. అంతకు ముందు నిమ్స్ ఆసుపత్రి భవనంలో తిరిగి పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బీబీనగర్ రంగాపురంలోని నిమ్స్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యసేవలు ప్రారంభమైతే హైదరాబాద్‌లోని కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు మూతబడుతాయనే టీఆర్ఎస్ ప్రభుత్వం, మంత్రులు నిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారని పీవీ శ్యాంసుందర్ రావు విమర్శించారు. కేంద్రం ఎయిమ్స్‌ను ఇస్తామని స్పష్టమైన ప్రకటన చేసినా ప్రభుత్వం స్థలం కేటాయించకుండా జాప్యం చేస్తోందని




దుయ్యబట్టారు. బీబీనగర్ నిమ్స్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యసేవలు ప్రారంభించే వరకు ఉద్యమిస్తామని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా॥ మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు ధనుంజయ, శ్రీధర్, జగన్మోహన్‌రెడ్డి, నర్సింగరావు, సత్తయ్య, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

**-జనసందేశ్ ప్రతినిధి**

# రాష్ట్రానికి మరో సైనిక్ స్కూల్




మోదీ ప్రభుత్వం తెలంగాణకు రెండో సైనిక్ స్కూల్ మంజూరు చేసింది. ఇప్పటికే వరంగల్ సమీపంలో ఒకటి ఏర్పాటు కానుండగా.. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో మరో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు రక్షణ శాఖ అంగీకారం తెలిపింది. వెనకబడిన మహబూబ్‌నగర్ ప్రాంతంలో నాణ్యమైన విద్య అందించేందుకు సైనిక్ స్కూల్ అవసరం ఉందని రాష్ట్ర బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రక్షణ మంత్రిత్వ శాఖ సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ ధన్యవాదాలు తెలిపారు. ■

# పల్లెపల్లెకూ ఇంటర్నెట్



ఇంటర్నెట్ సేవలను దేశంలోని ప్రతి గ్రామానికి అందించేందుకు మోదీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. అన్ని గ్రామ పంచాయతీలకూ వైఫై అనుసంధానతను కల్పించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకు రూ.3,700 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ ఏడాది ముగిసేలోగా లక్ష గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలను ప్రారంభించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2019 చివరి నాటికి దేశంలోని గ్రామపంచాయతీలన్నింటికీ ఈ సేవలను విస్తరించనున్నారు. సెకన్‌కు ఒక గిగాబిట్ (జీబీపీఎస్) వేగంతో ఈ సేవలు పనిచేయనున్నాయి. అంటే ఒక సినిమా నిడివి ఉండే వీడియోను రెండు సెకన్లలో డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలు కలుగుతుంది. ఈ ప్రాజెక్టును భారత్‌నెట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలతో కలిపి చేపట్టనున్నారు. ఆ తర్వాత మిగతా హాట్‌స్పాట్‌లనూ వీటికి అనుసంధానించనున్నారు. కొత్త టెలికాం విధానంలో భాగంగా.. 2022 వరకు దేశంలోని 70 కోట్ల మందికి నిరంతర ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తేవాలని కేంద్రం ప్రణాళికలు రచించుకుంది. ప్రస్తుతం 30 కోట్ల మంది ఈ సదుపాయాన్ని పొందుతున్నారు. ■

# దెబ్బతిన్న పంటల సందర్శన



బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగం జనార్ధన్ రెడ్డి నేతృత్వంలోని బిజెపి బృందం నవంబర్ 1న రంగారెడ్డి జిల్లా సదాశివపేట, నందికంది, ముబారక్‌పూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను సందర్శించింది. రైతులతో నేరుగా మాట్లాడి పరిస్థితిని సమీక్షించింది. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందేలా కృషి చేస్తామని నాగం జనార్ధన్ రెడ్డి బాధిత రైతులకు హామీ ఇచ్చారు. ఈ బృందంలో మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.సుగుణాకర్ రావు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ శ్రీవర్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నందీశ్వర్ గౌడ్, పాపన్న తదితరులు ఉన్నారు. ■

# గల్ఫ్ బాధితుల పోరుబాట



ఉత్తర తెలంగాణ గల్ఫ్ బాధితుల కోసం బిజెపి పోరుబాట పట్టింది. నవంబర్ 11న మధ్యాహ్నం 2 గంటలకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని జంబి హనుమాన్ గ్రౌండ్స్‌లో నిరసన సభను నిర్వహించనుంది. మృతి చెందిన గల్ఫ్ వలసదారుల కుటుంబాలకు 6 లక్షల పరిహారం ఇవ్వాలని, గల్ఫ్ వెళ్ళొచ్చిన వారికి రుణసదుపాయం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించి గల్ఫ్ బాధితులను ఆదుకోవాలని, ఏజెంట్ల మోసానికి గురైనవారికి తిరిగి డబ్బు ఇప్పించాలని తదితర డిమాండ్ల సాధనకై బిజెపి ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో "ఉత్తర తెలంగాణ గల్ఫ్ బాధితుల కోసం బిజెపి పోరుబాట" వాల్ పోస్టర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ ఆవిష్కరించారు. ■



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. – దీన్‌దయాళ్జీ





# టీఆర్‌ఎస్ వ్యతిరేక ఉద్యమాలను ఉధృతం చేద్దాం!

## రాష్ట్ర కార్యవర్గం పిలుపు

• భువన



టీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోనే ఎండగట్టేందుకు ఉద్యమాలను మరింత ఉధృతం చేద్దామని బిజెపి శ్రేణులకు రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌పై పోరాడుతూనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ సమగ్రాభివృద్ధికి చేపడుతోన్న విప్లవాత్మక చర్యలతో సమకూరే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించింది. నోట్లరద్దు, జీఎస్టీపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని తెలిపింది. మరోవైపు బూత్ స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలని ఆదేశించింది. అక్టోబర్ 28, 29న మంచిర్యాల వేదికగా రెండు రోజుల పాటు సాగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు శ్రేణులకు నూతనోత్సాహాన్ని నింపాయి.

రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ అధ్యక్షోపన్యాసం దిశానిర్దేశం చేయగా... సమారోప్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్ ప్రసంగం స్ఫూర్తి నింపింది. కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి తదితర రాష్ట్ర నాయకుల ప్రసంగాలు ఉత్తేజితులను చేశాయి. మంచిర్యాల వేదికగా జరిగిన ఈ సమావేశాలు టీఆర్‌ఎస్‌కు అసలైన ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో బిజెపి బలోపేతమవడానికి, 2019 ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకునేందుకు శ్రేణులకు కావాల్సిన ఆత్మవిశ్వాసం, పోరాడే సామర్థం, గెలుపుపై నమ్మకాన్ని కలిగించాయి.



**(అక్టోబర్ 29న రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను ప్రారంభించిన అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ అధ్యక్షోపన్యాసం చేశారు. గంటకు పైగా సాగిన సుదీర్ఘ ప్రసంగంలో రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న అనేక అంశాలను ప్రస్తావించారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఇతోధికంగా అందిస్తున్న సాయాన్ని వివరించారు. టీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ఉధృతం చేసేలా శ్రేణులను సమాయత్తం చేశారు. డా॥ లక్ష్మణ్ ప్రసంగ పాఠం జనసందేశ్ పాఠకుల కోసం)**

**మిత్రులారా! నమస్కారములు.**

1980లో పార్టీ ఆవిర్భావం తర్వాత బొగ్గు గనులకు కేంద్రమైన మంచిర్యాలలో 1982లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం మొదటిసారిగా జరగగా, మళ్లీ 35 సంవత్సరాల తర్వాత ఇక్కడే జరుపుకోవడం సంతోషకరం. అభివృద్ధి చెందుతున్న పట్టణాలలో మంచిర్యాల ఒకటి. హైదరాబాద్-దిల్లీ ప్రధాన రైల్వే లైన్‌తో పాటు జాతీయ రహదారితో అనుసంధానం కలిగి ఉన్న మంచిర్యాల జిల్లా భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందడానికి పుష్కలమైన అవకాశాలున్నాయి.



తెలంగాణ రాష్ట్రంతో పాటు టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి మూడున్నర సంవత్సరాలు కావస్తున్నది. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలన తెలంగాణ ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు విరుద్ధంగా సాగుతున్నది. ఏక వ్యక్తి, కుటుంబ, వారసత్వ పాలనతప్ప, ప్రజా పరిపాలన సాగడంలేదు. అవినీతి, కుటుంబ పాలనకు టిఆర్ఎస్ నిలువెత్తు నిదర్శనం. తెలంగాణలో వ్యక్తులు తప్ప పార్టీలు లేరనే అహంకార పూరితమైన ధోరణి రాజ్యమేలు తున్నది. గత 10 సంవత్సరాలు కేంద్రంలో, రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, కుంభకోణాలతో అధికారం వెలుగబెట్టిన మరో కుటుంబ పార్టీ కాంగ్రెస్ తామే ప్రత్యామ్నాయమంటూ చంకలు గుద్దుకోవడం హాస్యాస్పదం. కాంగ్రెస్ ఎన్ని విన్యాసాలు చేసిన ప్రజల మెప్పు పొందడం అసంభవం. వ్యవస్థలు మారాలి తప్ప, వ్యక్తులు పార్టీలు మారినంత మాత్రాన ప్రజలకు ఒరిగేదేమీలేదు. మజ్లీస్ లాంటి మతోన్మాద, అరాచక పార్టీని పెంచి పోషించిన ఈ రెండు పార్టీలకు విధానాలు, వ్యవహారాలలో తేడా ఏమీలేదు. దేశాన్ని, రాష్ట్రాన్ని ముంచి ప్రజాధనాన్ని కొల్లగొట్టిన కాంగ్రెస్ ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరముంది.

భారతీయ జనతా పార్టీ సిద్ధాంతం, వ్యవస్థ, కార్యక్రమాల ఆధారంగా పనిచేసే పార్టీ. రాజకీయ వ్యవస్థలో పార్టీలు తప్ప వ్యక్తులు ముఖ్యంకాదు. కాంగ్రెస్ ముక్త భారత్ నినాదంలో భాగంగా ఇప్పటి వరకు జరిగిన అన్ని రాష్ట్రాల ఎన్నికలలో బిజెపినే ప్రజలు ఆదరించారు. వ్యక్తుల ఆధారంగా నడిచిన అనేక పార్టీలు, ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసి పోయాయి. ముఖ్యమంత్రితో పాటు టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఈ మాత్రం అవగాహన కొరవడటం దురదృష్టకరం.

రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దాడులు నిత్యకృత్యమయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరేళ్లలో ఇసుక మాఫియాను అడ్డుకున్న పాపానికి అమాయక దళితులు పోలీసుల చిత్రహింసలకు గురికావడంతో పాటు జైలుపాలు కావడం అన్యాయం, అక్రమం. అదేవిధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ములుగులో గిరిజనులపై అమానుషంగా దాడులు చేసి, గూడెంల నుంచి ఖాళీ చేయించడం మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది.

దేవుడు దయతలచినా పూజారి వరమివ్వనట్లు కేంద్ర ప్రభుత్వం ఎంతో సులభతరమైన పద్ధతిలో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్ని జిల్లాలలో వర్షాభావం వల్ల నష్టపోయిన పంటలతోపాటు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరముంది.

ఏ ముహూర్తాన ఈ ప్రభుత్వం అధికారాన్ని స్వీకరించిందోగానీ, శుభవార్త వస్తుందనుకున్న నిరుద్యోగులకు తీరని నిరాశే మిగిలింది. తప్పుల తడకలతో నోటిఫికేషన్లు జారీ చేయడం, వివాదాస్పదం కావడం, కోర్టులు నిలుపుదల చేయడం పరిపాటిగా మారింది. ఉద్యోగ నియామకాలు ఆలస్యం చేయడం వల్ల రూపాయికి రూపాయి మిగులుతుందని, రాష్ట్ర ప్రభుత్వం కక్కుర్తి పడటమే దీనికి కారణం. మూడున్నర సంవత్సరాల కాలంలో మూడున్నర వేల మందికి కూడా ఉద్యోగాలు రాకపోవడం విచారకరం.

మద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఆదాయ వనరుగా చూడడం శోచనీయం. ఈ సంవత్సరం మద్యం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం దాదాపు రూ.21 వేల కోట్లుగా అంచనా వేసింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మద్య వినియోగం పెరగడం



నేను, నా దేశం - ఈ రెంటిలో నా దేశమే నాకు ముఖ్యమైనది. - డా॥ బి.ఆర్.అంబేద్కర్



ఆందోళనకరం. ఇది టీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పుకునే విజయాలలో భాగమేమో! మద్యం దుకాణాలు తెరిచి ఉంచే సమయాలను పొడిగించడం, ప్రతి మద్యం షాపునకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లను అనుమతించడం మద్య వినియోగాన్ని ప్రోత్సహించడమే. మద్యానికి బానిసలైన ఎంతోమంది దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ఫలితంగా ఇది ఎన్నో సామాజిక, ఆర్థిక సమస్యలకు దారితీస్తూ వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రాధాన్యతనివ్వాలే తప్ప, వారి ప్రాణాలను పణంగాపెట్టి ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి కాదు.

లంచం అడిగితే చెప్పుతో కొట్టమని ముఖ్యమంత్రి మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉంది. ఒకవైపు అవినీతిని వ్యవస్థీకృతం చేస్తూ, ఉద్యోగులను ఉద్దేశించి ఆ విధంగా మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయికి ఏమాత్రం తగదు. మంత్రులు, అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధుల అవినీతి అక్రమాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై అధికార పార్టీ నాయకులే చేసిన అవినీతి అరోపణలు, మిషన్ కాకతీయలో అక్రమాలు జరిగాయని కాగ్ ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి. అదేవిధంగా చెలరేగిపోతున్న డ్రగ్స్, ఇసుక, భూ మాఫియాలను ఉక్కుపాదంతో అణిచివేయాలి.

టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మైనారిటీల సంతుష్టీకరణ పతాక స్థాయికి చేరింది. మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో 10% రిజర్వేషన్, ముస్లింల కోసం ఇండస్ట్రియల్ పార్క్, ఐటి కారిడార్, కేవలం హైదరాబాద్ పార్లమెంట్‌కే (మజ్లీస్ ఎంపి) రూ. 40 కోట్లు నిధులు కేటాయించడం ఓటుబ్యాంకు రాజకీయాలే. దీనిలో భాగంగానే నల్లగొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలలో హిందూ సంస్థలు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించడం, భౌతిక దాడులకు పాల్పడటం, చిత్రహింసలకు గురిచేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అణిచివేత చర్యలకు పాల్పడటాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తోంది.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సెప్టెంబర్ 1 నుండి 7 వరకు 18 జిల్లాలు, 103 పట్టణాలు, గ్రామాల మీదుగా 3500 కి.మీ మేర చేపట్టిన తెలంగాణ విమోచన యాత్రలో పాల్గొని సెప్టెంబర్ 17న నిజామాబాద్‌లో కేంద్ర హోంశాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్న బహిరంగ సభకు విశేష స్పందన లభించిన విషయం తెలిసిందే. యాత్రతోపాటు బహిరంగ సభ విజయానికి కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలందరికీ అభినందనలు.

రాష్ట్రంలో కెజి టు పిజి విద్య ఎటుపోయిందో గానీ, విద్య మరింతగా కార్పొరేట్ సంస్థల కబంద హస్తాల్లోకి వెళ్లింది. లక్షలాది రూపాయల ఫీజులు భరించలేక తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండగా, బలవం తపు చదువులు తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ సంఘటనలు ఎన్నో కుటుంబాలలో తీరని విషాదాన్ని నింపుతున్నాయి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. కార్పొరేట్ ఆస్పత్రులు ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నా చోద్యం చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ సౌకర్యాలు మెరుగుపర్చడంలో విఫలమవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేస్తామని, గొప్పలు పలికిన ప్రభుత్వం, రాజధానిలోని రోడ్లపైనున్న గుంతలను కూడా పూడ్చలేని దుస్థితిలో ఉండి ప్రజల విశ్వసనీయతను కోల్పోయింది. ప్రజలు, వాహనదారులు పడుతున్న బాధలు వర్ణణాతీతం. వర్షం వస్తేచాలు ట్రాఫిక్ రద్దీతో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు సాయంత్రానికి ఇంటికి వెళ్లే అవకాశంలేక రోడ్లపైనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లో ఎన్నో అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్న ఈ తరుణంలో రోడ్ల పరిస్థితి నగరానికి అప్రతిష్ట కలిగించే విధంగా ఉన్నది. చిన్నపాటి వర్షం వస్తేచాలు నగరంలో మోకాలు లోతు నీళ్లు పారుతున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పేదలు నిద్రలేని రాత్రులు గడపటం పరిపాటిగా మారింది.

రాష్ట్ర ప్రభుత్వ మూర్ఖత్వం వల్ల మెట్రో రైల్ ప్రాజెక్టు సంవత్సరన్నర ఆలస్యం అయిన సంగతి అందరికీ తెలిసిందే. మెట్రో, ఎంఎంటిఎస్ (రెండవ దశ) రూపంలో కేంద్ర ప్రభుత్వం త్వరలో హైదరాబాద్ నగరానికి కానుకలుగా ఇవ్వబోతున్నది. ఎంఎంటిఎస్ రెండవ దశలో రూ. 850 కోట్ల వ్యయానికిగాను రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద చెల్లించాల్సిన రూ. 566 కోట్లులో కేవలం రూ. 50 కోట్లు మాత్రమే చెల్లించినా, కేంద్ర ప్రభుత్వం తన వాటా ఖర్చు రూ. 285 కోట్లే అయినప్పటికీ, ఇప్పటికే రూ. 500 కోట్లు వెచ్చించింది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు పూర్తి చేయడానికి తన వాటా నిధులు తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ రంగాలలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వివిధ వర్గాల ప్రజల ప్రశంసలను చూరగొంటున్నది. డోక్లాంలో చైనా సైనికులను తిరుగుటపా పట్టించడంలో ప్రభుత్వం చూపిన దౌత్యనీతి అద్భుతం, అనిర్వచనీయమైనది. అదేవిధంగా వివిధ దేశాలలో తీవ్రవాదుల చేతుల్లో అక్రమంగా

బంధీలుగా ఉన్న భారతీయులను సురక్షితంగా మాతృదేశానికి రప్పించడంలో మోదీ ప్రభుత్వం చూపుతున్న కృషి, చొరవ ఎనలేనిది. చివరకు విదేశీయులను విడిపించడంలోకూడా వివిధ దేశాలు భారతదేశ సహకారాన్ని కోరడం గర్వించదగ్గ విషయం.

సామాజిక చైతన్యానికి నడుం కట్టింది. 'సబ్‌కా సాత్– సబ్‌కా వికాస్' నినాదం స్ఫూర్తిగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి క్రియాశీలక చర్యలు తీసుకుంటోంది. బిసి కమిషన్ రాజ్యాంగబద్ధత కల్పించడమే కాకుండా, ఓబిసిల వర్గీకరణకు సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. బిసిల్లో అత్యంత పేదవారు కూడా లబ్ది పొందాలనే ఉద్దేశ్యంతో వర్గీకరణకు రిటైర్డ్ జస్టిస్ రోహిణి నేతృత్వంలో కమిటీని కూడా వేయడం జరిగింది. అదేవిధంగా ఓబిసి క్రిమిలేయర్ పరిమితిని రూ.6 లక్షల నుండి రూ.8 లక్షలకు పెంచడం ఉద్యోగులు, మధ్య తరగతి వారికి ఎంతో ఊరటనిస్తుంది.

గత మూడున్నర సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించి అమలు చేస్తున్న పథకాలు, ప్రాజెక్టులు దేశాన్ని పురోగమనంలోకి తీసుకెళ్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించి జాతీయ రహదారులు తెలంగాణ ఏర్పడే నాటికి కేవలం 2,400 కి.మీ. ఉండగా, నూతనంగా దాదాపు 3,600 కి.మీ జాతీయ రహదారులుగా మార్చడంతో 6000 కి.మీ.లకు చేరుకోవడంతో దేశంలోనే అత్యధిక నిడివిగల జాతీయ రహదారుల ఉన్న రాష్ట్రాల జాబితా తెలంగాణ చేరడం రాష్ట్ర ప్రజల అదృష్టం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గతంలోనే 90 వేల ఇండ్లను రాష్ట్రానికి మంజూరు చేసిన కేంద్రం, మరో 60 వేల ఇండ్లను కేటాయించడం కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తున్నది. రాష్ట్రంలోని 11 మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన పరిధిలోకి తీసుకుని ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయడానికి'నాబార్డ్' నిధులను అందజేస్తుంది. వరంగల్, మహబూబ్‌నగర్‌లలో రెండు సైనిక పాఠశాలలను మంజూరు చేయడం సంతోషకరం. పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వే లైన్ పూర్తిచేయడంతోపాటు కొత్తపల్లి–మనోహరాబాద్, మెదక్–అక్కన్నపేట లైన్లను పూర్తిచేయడానికి నిధులు కేటాయించడం హర్షణీయం. కాగా గద్వాల–మాచర్ల నూతన రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం శోచనీయం.

రాష్ట్రంలో రెండే వర్గాలు ఉన్నాయి. అవి కెసిఆర్ అనుకూలవర్గం, కెసిఆర్ వ్యతిరేక వర్గం అని కొందరు అంటున్నారు. అవును! రాష్ట్రంలో ఉన్నది రెండే వర్గాలు.. వాస్తవమే. కానీ అవి కెసిఆర్ అనుకూల వర్గం, వ్యతిరేక వర్గం కాదు. అవి అవినీతి, వారసత్వ అనుకూల వర్గం; అవినీతి, వారసత్వ వ్యతిరేక వర్గం. అయితే అవినీతికి, కుటుంబ పాలనకు టిఆర్ఎస్ నిలువెత్తు నిదర్శనమైతే, కాగ్రెస్ మాత్రం

> **రాష్ట్రానికి సంబంధించి జాతీయ రహదారులు తెలంగాణ ఏర్పడే నాటికి కేవలం 2,400 కి.మీ. ఉండగా, నూతనంగా దాదాపు 3,600 కి.మీ జాతీయ రహదారులుగా మార్చడంతో 6000 కి.మీ.లకు చేరుకోవడంతో దేశంలోనే అత్యధిక నిడివిగల జాతీయ రహదారుల ఉన్న రాష్ట్రాల జాబితా తెలంగాణ చేరడం రాష్ట్ర ప్రజల అదృష్టం.**

ఏకంగా అవినీతికే కేరాఫ్ అడ్రస్. రెండింటికి పెద్ద తేడా ఏమీలేదు. మరి అలాంటప్పుడు కెసిఆర్/ టిఆర్ఎస్‌కి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను చూపెట్టడం ఎలా సాధ్యం? ఏ ఫర్ ఆదర్శ్ కుంభకోణం, బి ఫర్ బోఫోర్స్ కుంభకోణం, సి ఫర్ కోల్ కుంభకోణం ఇలా అక్షరానికి ఒక కుంభకోణాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం అవుతుందంటా... ఏమైనా అర్థం ఉందా అసలు? వ్యక్తిగత స్వార్థం కోసం కొందరు తెలంగాణలో జరుగుతున్న ఈ పోరాటాన్ని వ్యక్తుల మధ్య జరిగే పోరాటంగా మారుస్తున్నారు. ఇది వ్యక్తుల పోరాటం కాదు. ఇది వ్యవస్థల పోరాటం. వ్యక్తుల పోరాటం వల్ల తెలంగాణ ప్రజలకు వచ్చే లాభం ఏమీ లేదు. తెల్ల చొక్కా మీద నల్ల మరకలు పడితే తుడిపేద్దాం అనుకుంటాం. కానీ, తెల్ల చొక్కా మీద నల్ల మరకలు పడ్డాయని ఏకంగా నల్ల చొక్కానే ధరిద్దామని కొందరు అనుకుంటున్నారు. దానికి మేము చేసేదేమీ లేదు. అది వాళ్ల ఇష్టం. ఏం వెలగబెట్టింది అని కాంగ్రెస్‌ని భుజానికి ఎత్తుకుంటున్నారు? ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడంతో పాటు కాంగ్రెస్ అనేక తప్పిదాల వల్లనే కదా, తెలంగాణ ఉద్యమం వచ్చింది, కాంగ్రెస్ వల్లనే కదా 1200 మంది ఆత్మ బలిదానం అయింది. చరిత్రను ఎవరూ మర్చిపోలేదు. అలాంటి కాంగ్రెస్‌ను భుజానికి ఎత్తుకుంటే మీ భుజాలు విరుగుతాయి తప్ప పల్లకి మాత్రం ముందుకు పోదు. దేశవ్యాప్తంగా చతికిలపడ్డ కాంగ్రెస్‌కు ఎవరూ లేరు కాబట్టి ఎవరు వచ్చినా పండుగ చేసుకుందామనే ధోరణిలో కాంగ్రెస్ ఉంది.

గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌ల ఎన్నికల తరువాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారబోతున్నాయి. బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్ షా తెలంగాణపై పూర్తి దృష్టి కేంద్రీకరించి మరోసారి మూడు రోజుల పర్యటన జరపనున్నారు. నాలుగైదు పార్లమెంట్ నియోజకవర్గాలను క్లస్టర్‌గా విభజించి జరిగే బహిరంగ సభలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా పాల్గొంటారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జరిగే వివిధ కార్యక్రమాలలో కేంద్ర మంత్రులు విరివిగా పాల్గొంటారు. ఈ స్ఫూర్తితో మరి కొద్ది నెలల్లో జరగబోయే గ్రామ పంచాయితీ, సహకార సంఘాలు, ఆ తరువాత మున్సిపల్, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం కార్యకర్తలందరూ సిద్ధం కావాలని పిలుపునిస్తున్నాం.

అదేవిధంగా టిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, అప్రజాస్వామ్య, నియంతృత్వ వైఖరి, కుటుంబ, వారసత్వ పాలనకు వ్యతిరేకంగా రాజకీయ పోరాటానికి బిజెపి సమరశంఖం పూరిస్తుంది. అన్ని వర్గాలు, శక్తులను ఏకంచేసి పోరాడే సత్తా కేవలం బిజెపికి మాత్రమే ఉంది. ఈ పోరాటంలో బిజెపితో కలిసి రావాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**భారత్ మాతా కీ జై**

**జై భారత్.... జై బిజెపి... జై తెలంగాణ..**

# 'ప్రగతి' భవన్ ఎవరి కోసం?

**అక్టోబర్ 29న జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర రావు రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపై సభ్యుల నుంచి పలు సూచనలు వచ్చాయి. కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ సహా సభ్యులు మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో ఆమోదం పొందిన రాజకీయ తీర్మానం**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. కోటలు దాటిన ప్రభుత్వ హామీలు ఫలితాల దగ్గరికి వచ్చేసరికి గేటుదాటని వైనంచూసి తీవ్ర నిస్పృహ చెందుతున్నారు. ప్రజాస్వామ్య విధానాలను, విలువలను తుంగలో తొక్కి రాచరిక, నిరంకుశ తరహాలో కొనసాగుతున్న ఏలిన వారి పాలనా పద్ధతిని చూసి నివ్వెరపోతున్నారు. పేద, దిగువ మధ్యతరగతి వర్గాలు ఆధారపడే ప్రభుత్వ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైనది. త్రాగు, సాగునీటి రంగాల్లో ప్రగతి ప్రకటనలకే పరిమితమైంది. రాజకీయ అవినీతి నిర్మూలన మాటలకే పరిమితమై వ్యవస్థీకృత అవినీతి సగటు పౌరుని జీవితాన్ని అతలా కుతలం చేస్తున్నది. మ్యానిఫెస్టోలో ఉన్నవేకాదు, లేని అంశాలను కూడా అమలు చేస్తున్నాం అంటున్న ప్రభుత్వ ప్రచార ఆర్భాటం వెనుక ఉన్న అసలైన నిజాలు దిగ్భ్రాంతి కొలుపుతున్నాయి. ప్రగతి భవన్ ఎవరి ప్రగతి కోసం పనిచేస్తున్నదన్న విషయం ప్రశ్నార్థకంగా మారింది.

### నిరంకుశ వైఖరి – నిర్లక్ష్య ధోరణి

రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంకుశ వైఖరి, మంత్రివర్గం వ్యవహరిస్తున్న తీరు తెలంగాణ సమాజాన్ని నివ్వెరపరుస్తున్నది. జవాబు దారీతనం మచ్చుకైనాలేని ముఖ్యమంత్రి పాలనా శైలి, ఉత్సవ విగ్రహాలుగా వ్యవహరిస్తున్న మంత్రుల పద్ధతి రాష్ట్ర ప్రభుత్వం యొక్క బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తున్నది. ముఖ్య మంత్రి సచివాలయానికి రారు, మంత్రులు వచ్చినా అధికారులెవరు పట్టించుకోరు. సంబంధిత మంత్రులతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రి గారే అన్నీ తానై అధికారులతో సమీక్ష జరిపి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. మంత్రులు కేవలం ప్రచార కర్తలుగా మాత్రమే మిగిలిపోతున్నారు. దానితో ఆర్భాటంగా మొదలుపెట్టిన పథకాలన్నీ క్షేత్రస్థాయిలో



నిర్వీర్యమవుతున్నాయి. ముఖ్యమంత్రి స్థాయిని దిగజారుస్తూ ప్రతిపక్షాలపై విరుచుకపడే తీరు, పార్లమెంటరీ సాంప్రదాయాలను తుంగలో తొక్కి ఇష్టారీతిన అసభ్య పదజాలంతో వ్యక్తిగతంగా దూషించే వైఖరిని, ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తున్న తీరును భారతీయ జనతా పార్టీ నిరసిస్తున్నది. ప్రజాస్వామ్య పాలనలో ఇటువంటి పద్ధతులకు స్థానం లేదనే విషయాన్ని బిజెపి గుర్తుచేస్తున్నది. పరిపాలన అంతా ఏకవ్యక్తి కేంద్రీకృతమై ఒక కుటుంబం చేతిలో బందీ కావడాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గం ఖండిస్తున్నది. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, జవాబుదారీ తనంతో కూడిన పథకాల అమలు, రాజకీయ పక్షపాత ధోరణి లేకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యమని బిజెపి రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తున్నది.

### అస్తవ్యస్త ఆర్థిక పరిస్థితి– వ్యవస్థీకృత అవినీతి

నలభై నెలల టిఆర్ఎస్ ప్రభుత్వ పాలన ప్రాధాన్యాల లేమితో, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా అస్తవ్యస్తమైంది. ధనిక రాష్ట్రమైన తెలంగాణ, ముఖ్యమంత్రి పనితీరుతో అప్పుల కుప్పగా మారింది. రూ.12 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో మొదలైన నూతన రాష్ట్ర ప్రయాణం మూడున్నర సంవత్సరాలకు వచ్చేసరికి అనవసర ఆర్భాటాలతో, అవినీతికి ఆస్కార మున్న పలు పథకాల రూపకల్పనతో రూ.2 లక్షల కోట్లకు పైచిలుకు అప్పుతో నడుస్తున్నది. అవినీతి విషయంలో సొంత కొడుకునైనా ఉపేక్షించనని చెప్పిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో అవినీతిని వ్యవస్థీకృతం చేశారు. మిషన్ కాకతీయపై ఇటీవల 'కాగ్' వెలువరించిన నివేదికలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ పథకాలలో అవకాశం మేరకు కమిషన్లు దండుకునే గత పాలకుల సంస్కృతికి ఇంకో అడుగు ముందుకేసి పథక రచనలోనే అంచనాలను ఇబ్బడి ముబ్బడిగా పెంచే హోల్‌సేల్ అవినీతికి తెరలేపారు. ప్రభుత్వ పెద్దల అండతో ఇసుక మాఫియా, భూ మాఫియా తెలంగాణలో స్వైర విహారం చేస్తున్నాయి. అవినీతికి రాజముద్ర వేసిన టిఆర్ఎస్ పాలన అన్ని వ్యవస్థలను అవినీతి కూపంలోకి నెట్టివేస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం ప్రకటించాలని, బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది. అదేవిధంగా అవినీతిపై రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తామని బిజెపి హెచ్చరిస్తున్నది.

### గాడి తప్పిన విద్యారంగం – కోరలు సాచిన నిరుద్యోగం

ఆకాశాన్నంటుతున్న ప్రైవేట్ స్కూళ్ల ఫీజులు, కార్పొరేట్ కళాశాల విశృంఖల వైఖరితో

పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ లోపాన్ని తెలియజేస్తున్నది. హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వ పాఠశాలల మూసివేశారు. బిసి(ఇ) పేరుతో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వం, ఫీజు రీయెంబర్స్‌మెంట్‌లో కూడా బిసిలలోని మైనారిటీ సామాజిక వర్గాలకే ప్రాధాన్యమిస్తూ నిజమైన బిసిలకు అన్యాయం చేస్తున్నది. వెంటనే బిసి విద్యార్థులందరికీ ఎలాంటి వివక్ష లేకుండా ఫీజు రీయెంబర్స్ మెంట్ చేయాలి. గత రెండేళ్లుగా పేరుకు పోయిన ఫీజు బకాయిలు రూ.3,500/- కోట్లను వెంటనే చెల్లించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన నేపథ్యంలో వెలువడిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రకటన నిరుద్యోగుల కడుపు నింపేదిగా లేదు. 30 వేల ఖాళీలకు 8,972 పోస్టులకు మాత్రమే, లొసుగులతో కూడిన నోటికేషన్ ఇచ్చిన ప్రభుత్వం తెలంగాణ యువతను మరోసారి మోసం చేస్తున్నది. లక్ష ఉద్యోగాలిస్తామని ఊరించిన ప్రభుత్వం మూడున్నరేళ్ల కాలంలో 15 వేల ఉద్యోగాల భర్తీకి మాత్రమే పరిమితమైంది. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ఆలోచనను పూర్తిగా విస్మరించి దళితులను దగా చేస్తున్నది. ఇప్పటికైనా, గతంలో ప్రకటించిన విధంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, లేనిపక్షంలో నిరుద్యోగుల పక్షాన నిలిచి పోరుబాట పడతామని బిజెపి హెచ్చరిస్తున్నది.

### మద్యం మహమ్మారి

టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతున్నది. హైకోర్టు ఉత్తర్వులను కూడా తోసిరాజని ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోంది. 2,200 లైసెన్సుడు దుకాణాలు, బార్లతో, 20 వేల బెల్టుషాపులతో మద్యం అమ్మకాల్లో తెలంగాణ, దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. మద్యానికి యువత బానిసైపోతున్నది. హైదరాబాదులో రోజు వేలాదిమంది యువకులు బార్లకు బారులు కడుతున్నారు. మరోవైపు మద్యం కారణంగా గృహహింసతో లక్షలాది కుటుంబాలలో



మహిళలు రోధిస్తున్నారు. త్రాగుడు వల్ల వచ్చే వ్యాధులతో కుటుంబాలు ఛిద్రమై వీధిపాలవు తున్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో సాధారణ కుటుంబాల ఆదాయంలో రూ.35 వేల కోట్లు మద్యం దుకాణాలు దోచుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం రూ.40 వేల కోట్లకు చేరుకుంటుందని అంచనా. సంక్షేమ సమాజంకోసం మద్యపానాన్ని నియంత్రిం చాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

### హామీలు గాలికి – బాధ్యతారాహిత్యం

కోల్‌బెల్ట్ ప్రాంతాన్ని ఉద్యోగ ఉపాధి అవకాశాల కర్మాగారంగా మారుస్తానని, అందుకు భూగర్భ గనులే శరణ్యమని ఘంటాపథంగా చెప్పిన ముఖ్యమంత్రి ఆ ప్రాంతాన్ని బొందలగడ్డగా మార్చేందుకు దృఢనిశ్చయంతో ఉన్నారు. సమైక్య పాలనలో అన్యాయం జరిగిందని చెప్పిన కెసిఆర్, 18 ఓపెన్ కాస్టులను ప్రారంభించేందుకు నిర్ణయించారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పథకాలు మూలనపడ్డాయి. సాగునీటి ప్రాజెక్టులద్వారా ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామన్న ప్రభుత్వం అరిగిపోయిన రికార్డులాగా పదేపదే ఆ విషయాన్ని వల్లె వేస్తున్నప్పటికీ కార్యాచరణలో మాత్రం పూర్తిగా విఫలమైనది. టెండర్లలో అవినీతి, అంచనాల్లో అసహజమైన పెరుగుదల, రీడిజైనింగ్‌ల పేరుతో అవినీతి-ప్రభుత్వ అసమర్థతకు, చిత్తశుద్ధిలేని తనానికి నిదర్శనం. ప్రతిపక్షాలు ప్రశ్నించడంతో ఎదురుదాడికి పాల్పడుతూ ప్రాజెక్టులకు ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయనే ప్రచారం చేస్తూ ప్రభుత్వం తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నది. సరైన డిపిఆర్‌లు, అనుమతులు లేకుండా, ప్రాజెక్టులను చేపట్టడం కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని వృధా చేయడం ప్రభుత్వ బాధ్యత రాహిత్యానికి నిదర్శనం. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తున్నది. పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో అలసత్వాన్ని నిరసిస్తూ పోరుబాట పడతామని బిజెపి హెచ్చరిస్తోంది.

### అధికార దుర్వినియోగం – మత రాజకీయాలు

అధికారం ఉన్నదనే అహంతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచ్‌లను, ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులను టిఆర్ఎస్‌లో చేరాలని ఒత్తిడి చేస్తున్నారు. నిరాకరించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం, భౌతిక దాడులకు పాల్పడటం, నిధులు కేటాయించకుండా వేధింపులకు గురిచేయడం సాధారణమై పోయింది. గ్రామ స్వరాజ్యం గురించి ఉపన్యాసాలు దంచే ముఖ్యమంత్రి



భూ ప్రపంచం మన మాతృభూమి – సమస్త మానవాళీ మన జాతి. – శ్రీ వీర సావర్కార్

పంచాయితీ రాజ్ వ్యవస్థ మౌలిక స్వరూపాన్నే ఏకపక్షంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల స్ఫూర్తికి విఘాతం కలిగే విధంగా ప్రవర్తిస్తున్నారు. పంచాయితీ రాజ్ చట్టాన్ని సమూలంగా రాజకీయ అవసరాల కోసం మార్చాలనుకుంటున్న టిఆర్ఎస్ ప్రభుత్వ కుట్రను బిజెపి తీవ్రంగా ప్రతిఘటిస్తుంది. కేంద్ర పథకాలన్నిటి పేర్లుమార్చి రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ పద్ధతిని బిజెపి తీవ్రంగా గర్హిస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారాన్ని నిలుపుకోవడానికి మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నది. ఒక వర్గాన్ని, కొన్ని రాజకీయ పార్టీలను సంతృప్తిపరిచేందుకు హిందూ సంస్థలపైన, ఆ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిథులపైనా భౌతికదాడులను ప్రోత్సహిస్తున్నది. దాడులకు పాల్పడుతున్న వ్యక్తులను, శక్తులను టిఆర్ఎస్ ప్రభుత్వం కాపాడుతున్నది. అధికార యంత్రాంగం ద్వారా హిందూ పండుగల నిర్వహణను అడ్డుకుంటున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను నిరసించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఈ అప్రజాస్వామిక దాడులను, చర్యలను బిజెపి రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఆక్షేపిస్తున్నది. సంతుష్టీకరణ రాజకీయాలకు మంగళం పాడాలని, పద్ధతి మార్చుకోవాలని, లేనిఎడల ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని బిజెపి హెచ్చరిస్తోంది.

ఓట్లకోసం, సీట్లకోసం దళితులపై కపట ప్రేమ కురిపిస్తున్న ప్రభుత్వం, నేరేళ్ల ఘటనలో నిందితులను రక్షించే ప్రయత్నం చేయడం, టిఆర్ఎస్ ప్రభుత్వ దళిత వ్యతిరేక విధానాలను తేటతెల్లం చేస్తున్నది. దళితులపై జరుగుతున్న ఈ అకృత్యాలను బిజెపి తీవ్రంగా ఖండిస్తోంది. బాధితులకు అండగా నిలుస్తుంది. ప్రభుత్వ తక్షణమే వారికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

మరోవైపు గతంలో పదేళ్లు అధికారంలో ఉండి, ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా ఈ మూడున్నర ఏళ్లలో ప్రజలలో విశ్వసనీయ సంపాదించలేక పోయింది. కాంగ్రెస్ నాయకులు పదేపదే "మేమే ప్రత్యామ్నాయం" అని వల్లెవేస్తున్న విషయాన్ని ప్రజలు విశ్వసించడం లేదు. ప్రతిపక్ష హోదాను సరిగ్గా పోషించలేని వైనం, అంతర్గత వైషమ్యాలు, కార్యకర్తల్లో నాయకులపట్ల నమ్మకంలేని పరిస్థితి ఆ పార్టీని అధఃపాతాళానికి నెట్టాయి. కాంగ్రెస్ ఎన్నటికీ ఈ రాష్ట్రంలో ప్రత్యామ్నాయం కాలేదన్న పరిస్థితి ప్రజల్లో నెలకొన్నది.

మూడున్నర సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వ పాలన తెలంగాణ ప్రజల పాలిట శాపంగా మారింది. పాలనను గాలికొదిలి అధికారమే పరమావధిగా ఫిరాయింపులను ప్రోత్సహించడం, ధనబలంతో ఎన్నికలను ప్రభావితం చేయడమే నిత్యకృత్యంగా మారింది. మొత్తంగా పాలన కెసిఆర్ కుటుంబ వ్యవహారంగా మారింది. ప్రభుత్వం తెలంగాణ వ్యతిరేక శక్తులకు అడ్డాగా మారింది. ఇటువంటి ప్రజా వ్యతిరేక పాలనను అంతమొందించేందుకు ప్రజల పక్షాన నిలిచి, అన్ని వర్గాలను సమీకరించి ప్రజా ఉద్యమాలకు శ్రీకారంచుట్టి తద్వారా టిఆర్ఎస్ నియంతృత్వ పాలనను అంతమొందించేందుకు, 2019లో ప్రజలు కోరుకుంటున్న బిజెపి ప్రభుత్వాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు ప్రజలు, కార్యకర్తలు సమాయత్తం కావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం పిలుపునిస్తోంది. ■

# తెలంగాణలోనూ బిజెపికి అధికారం ఖాయం

తెలంగాణలోనూ బిజెపి అధికారంలోకి రావడం పెద్ద కష్టమేమీ కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్ ధీమాగా చెప్పారు. 2019 ఎన్నికల్లో యావత్ దేశంతో పాటు తెలంగాణలోనూ పార్టీకి విస్తృతంగా అవకాశాలున్నాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నినాదంతో సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి అనేక చర్యలు తీసుకుంటున్నారనీ, వీటికి ప్రజల నుంచి విశేష మద్దతుందని చెప్పారు. తెలంగాణలోనూ ప్రజలు మోదీ కార్యక్రమాలకు, పథకాలకు మద్దతునిస్తున్నారని అన్నారు.



కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. రాష్ట్రానికి ఎయిమ్స్, గిరిజన విశ్వవిద్యాలయం సహా అనేక జాతీయ సంస్థలను మంజూరు చేసిందని అన్నారు. స్వచ్ఛ భారత్ సహా వివిధ పథకాల కోసం భారీగా నిధులు విడుదల చేసిందని తెలిపారు. రహదారుల అభివృద్ధికి, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కోసం ఇతోధికంగా సాయమందిస్తుందన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అటు జిల్లా అధ్యక్షులు కేంద్ర ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి ఏమేమి చేసింది, ఎన్ని నిధులు అందజేసిందో లెక్కలు తీయాలని, వాటిని ప్రజలకు తెలిపి బిజెపితోనే అభివృద్ధి సాధ్యమన్న సందేశం అందించాలన్నారు.

జీఎస్టీ దేశ ఆర్థికాభివృద్ధికి మేలిమలుపు అని, ఈ బిల్లుకు పార్లమెంటులో అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని అన్నారు. దీనివల్ల మోదీకి, బిజెపికి మంచిపేరు వస్తుందని చెప్పి ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. జీఎస్టీ, నోట్లరద్దుతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. 2022 నాటికి సరికొత్త భారతం నిర్మించాలని ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నారనీ, దీనికి అందరూ సహకరించాలని హన్స్‌రాజ్ కోరారు. ■

సంస్థాగతం

# నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి!

**అక్టోబర్ 29న జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి వ్యవసాయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపై సభ్యుల నుంచి పలు సూచనలు వచ్చాయి. కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.సుగుణాకర్ రావు సహా రాష్ట్ర కార్యవర్గం మద్దతు తెలిపింది. ఈ సమావేశంలో ఆమోదం పొందిన వ్యవసాయ తీర్మానం**

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వరుణ దేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కొన్ని జిల్లాల్లో కురిసినందున రాష్ట్రంలో పునాస కాలంలో రైతులు అధికంగా 19 లక్షల 9 వేల హెక్టార్లలో పత్తిసాగు చేయడం జరిగింది. 7 లక్షల 75 వేల ఎకరాలలో వరి, 4 లక్షల 50 వేల హెక్టార్లలో మొక్కజొన్న, 2 లక్షల 51 వేల హెక్టార్లలో కంది మరియు 89 వేల హెక్టార్లలో పెసర తదితర పంటలు సాగు చేయడం జరిగింది. విత్తనాలు మొలకెత్తిన తర్వాత తీవ్ర వర్షాభావ పరిస్థితి నెలకొన్న కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో కొమరంభీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటలు ఎండిపోయాయి. అక్టోబర్ మొదటి వారంలో కురిసిన అకాల వర్షాల వల్ల చేతికి వచ్చిన పత్తి, వరి, కందులు, మొక్కజొన్న మొదలగు పంటలు దెబ్బతిన్నాయి. 90 వేల హెక్టార్లలో పత్తి, 20 వేల హెక్టార్లలో వరి పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రకృతి కన్నెర్ర చేయడంతో రాష్ట్రంలో తెల్ల బంగారం (పత్తి) పూర్తిగా నల్లబడి దెబ్బతినడం వల్ల రైతులు దిక్కుతోచని స్థితిలో విలవిలలాడుతున్నారు. దెబ్బతిన్న పంట పొలాలు చూసి రైతులు కన్నీరు, మున్నీరవుతున్నారు. పుట్టెడు దుఃఖంతో మనోధైర్యం కోల్పోయిన రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేకపోవడం విచారకరం. రంగు మారిన ధాన్యాన్ని మరియు ఇతర పంటలను రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలని, అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

నకిలీ విత్తనాలను విక్రయించిన విత్తన కంపెనీలపై, డీలర్లపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని, జిల్లాస్థాయిలో ఒక ఐ.ఎ.ఎస్.స్థాయి అధికారితో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేయాలని, నకిలీ విత్తనాల బారినపడి నష్టపోయిన రైతాంగానికి విత్తన కంపెనీల నుండి నష్టపరిహారం చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

రైతులు పునాస కాలంలో వ్యవసాయ పెట్టుబడులకు సరిపోయే విధంగా బ్యాంకులు రుణ సౌకర్యం కల్పించని కారణంగా, ప్రైవేట్ వడ్డీవ్యాపారుల నుండి అధిక వడ్డీలకు అప్పులుతెచ్చి పెట్టుబడులు పెడితే, అకాల వర్షాల వల్ల చేతికి వచ్చే సమయంలో పంటలు పూర్తిగా దెబ్బతినడంతో పెట్టిన పెట్టుబడులురాక, రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా తయారైంది. అతివృష్టి, అనావృష్టి వల్ల వరుస నష్టాలతో కష్టాల్లో ఉన్న అన్నదాతలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. పెట్టిన పెట్టుబడులురాక కష్టాల్లో ఉన్న చిన్న, సన్నకారు, పేద రైతులకు టిఆర్ఎస్ ప్రభుత్వం గత మూడున్నర సంవత్సరాల నుంచి ఏం ఒరగబెట్టిందో బట్టబయలు చేయాలని బిజెపి డిమాండ్ చేస్తున్నది.

రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు, జిల్లా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించడంగానీ, రైతులను పరామర్శించడంగానీ చేయకపోవడం విచారకరం. వెంటనే అధికారులు పంటలు దెబ్బతిన్న ప్రాంతాలలో పర్యటించి, పంటల నష్టాన్ని అంచనావేసి రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

రాష్ట్రంలో 1,19,474 ఎకరాల్లో పత్తి అధికంగాను, మరియు వరి, కంది, మొక్కజొన్న మొదలగు పంటలు తీవ్రంగా నష్టపోయి 21 జిల్లాల్లో 1970 గ్రామాలలో 1,47,000 మంది రైతులకు నష్టం జరిగితే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడం విచారకరం. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వ్యవసాయ ధరల స్థిరీకరణ నిధి కింద 5 వేల కోట్ల రూపాయలు విడుదల చేసి, వివిధ రకాల పంటలకు గిట్టుబాటుధర కల్పించి, కొనుగోలు చేసి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వం పత్తి కొనుగోలుకు ట్రేడర్స్‌ను, మిల్లర్స్‌ను రంగంలోకి దించి కనీస ధర రూ. 4,320/-లకు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని, మధ్య దళారులు రైతుల నిలువుదోపిడీని అరికట్టి ఆదుకోవాలని, పత్తికి క్వింటాల్‌కు రూ.1,000/- రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించాలని, పత్తి రైతులకు వెంటనే గుర్తింపు కార్డులు జారీచేయాలని; వరి ధాన్యాన్ని సివిల్ సప్లయి ద్వారా కొనుగోలు చేయాలని, రంగుమారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, కనీస మద్దతు ధర రూ. 1,590/-తోపాటుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500/- బోనస్ చెల్లించాలని, మార్క్‌ఫెడ్ ద్వారా పెసర్లు, కందులు, ఉలవలు, మొదలగు ధాన్యాలు కొనుగోలు చేయాలని, మొక్కజొన్నకు కనీస మద్దతు ధర రూ.1,425/-తోపాటుగా రూ.500/- బోనస్ ఇవ్వాలని, కందులకు రూ.5450/- కనీస మద్దతు ధరతోపాటు రూ.1,000/- బోనస్ చెల్లించి రైతులను ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

### రైతు ఆత్మహత్యలు

తెలంగాణ రాష్ట్రం వస్తే రైతు ఆత్మహత్యలు ఉండవని, రైతు ఆత్యహత్యలులేని తెలంగాణ తెస్తానని, రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గత మూడున్నర సంవత్సరాల కాలంలో సుమారు నాలుగు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం శోచనీయం. రైతుల ఆత్మహత్యలకు పూర్తి జవాబుదారి రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర ప్రభుత్వమే. ముఖ్యమంత్రి కెసిఆర్ బంగారు తెలంగాణ తెస్తామని, హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి బంగారు తెలంగాణ సంగతి దేవుడెరుగుగానీ, ఆత్మహత్యల

తెలంగాణగా, అప్పుల తెలంగాణగా, బాధల తెలంగాణగా కెసిఆర్ పాలన కొనసాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలు నివారించడంలో, రైతులకు ఆత్మవిశ్వాసం కల్పిచడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. రైతుల ఆత్మహత్య నివారించడానికి నిపుణులతో ఒక అధ్యయన కమిటీని ఏర్పాటుచేసి చర్యలు చేపట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

### ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన

లోపభూయిష్టమైన నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రక్షాళనచేసి 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' పథకాన్ని రైతుల కోసం అతి తక్కువ ప్రీమియంతో (1.50%) రూపొందించారు. ఈ పథకాన్ని అమలు చేసే బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదే. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం సక్రమంగా అమలు చేస్తుంటే మన రాష్ట్రంలో అమలుకు నోచుకోకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తే కేంద్రప్రభుత్వానికి, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి పేరు వస్తుందనే రాజకీయ దురుద్దేశ్యంతో ఈ పథకానికి తూట్లుపొడిచి, సక్రమంగా అమలు చేయని కారణంగా నష్టపోతున్న రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది.

### భూసార పరీక్షలు (సాయిల్ హెల్త్ కార్డు)

కేంద్రంలోని శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న, గుజరాత్ రాష్ట్రంలో నూటికి నూరు శాతం భూసార పరీక్షలు నిర్వహించినట్లుగానే మన రాష్ట్రంలో సకాలంలో భూసార పరీక్షలు నిర్వహించుటకు కేంద్ర ప్రభుత్వం 60% నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులతో ముందుకు సాగాల్సిన ఈ పథకం, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, నిధులు కేటాయించని కారణంగా భూసార పరీక్షలు పూర్తికానందున పంటల దిగుబడులురాక రైతులు నష్టపోతున్నారు. సాక్షాత్తు వ్యవసాయ శాఖామంత్రి ఉన్న నిజామాబాద్ జిల్లాలో 10 లక్షల 32 వేల సాయిల్ హెల్త్‌కార్డులు రైతులకు పంపిణీ చేయాల్సి ఉండగా, నేటికీ రైతులకు అందకజేయకపోవడం రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరికి వెల్లడి చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా భూసార పరీక్షలు నిర్వహించి, రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు వెంటనే అందించాల్సిందిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

### రైతు సమన్వయ సమితులను వెంటనే రద్దుచేయాలి

స్థానిక సంస్థలకు అధికారులు కల్పిస్తూ చేసిన 73వ రాజ్యాంగ సవరణకు తూట్లు పొడుస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో రైతు సమన్వయ సమితులను నామినేట్ చేస్తూ ఆగస్టు 27, 2017న విడుదల చేసిన జివో నెం.39ని వెంటనే రద్దు చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఉపాధి కల్పించే విధంగా, గ్రామాలలో రైతులపై పెత్తనం కల్పించే విధంగా, రాజకీయ దురుద్దేశ్యంతో ఈ రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేయడం వల్ల రైతులలో అభద్రతాభావం నెలకొన్నది. ఈ సమితుల వల్ల స్థానిక సంస్థలన్నీ నిర్వీర్యంచెంది, రాజ్యాంగ వ్యతిరేకంగా, చట్టబద్ధత లేకుండా సర్పంచ్‌లను, ఎంపిటీసిలను, ఎంపిపిలను, జడ్‌పిటీసిలను, జడ్‌పిపిలను ఉత్సవ విగ్రహాలుగా మార్చి స్థానిక సంస్థల ఉనికికే ప్రమాదకరంగా మారే రైతు సమన్వయ సమితులను వెంటనే రద్దుచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై "రైతు పోరుకు" సిద్ధం కావాల్సిందిగా రాష్ట్ర రైతాంగానికి, అన్ని వర్గాల ప్రజలకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గం పిలుపునిస్తోంది. ■

## 2019 ఎన్నికల్లో బిజెపి స్వతంత్రంగా పోటీ

2019 ఎన్నికల్లో బిజెపి పొత్తుల్లేకుండా స్వతంత్రంగా పోటీ చేస్తుందని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి సంశయం అవసరం లేదని తేల్చి చెప్పారు. 2019 ఎన్నికల్లో తెలంగాణలోనూ బిజెపి అధికారంలోకి రావడానికి అన్ని అవకాశాలు న్నాయన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాలో దత్తాత్రేయ ప్రసంగిస్తూ నమ్మకంతో కృషి చేస్తే పార్టీకి తిరుగుండదని కుండబద్దలు కొట్టారు.



బిజెపి కార్యకర్తలపై టీఆర్ఎస్ ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని దత్తాత్రేయ ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా ఉట్కూరు గ్రామంలో బిజెపి సర్పంచ్‌పై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేశారని అన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జరిగిన ఘర్షణలో పోలీసులు ఉట్కూర్ సర్పంచ్ భాస్కర్‌ను అరెస్టు చేసి చితకబాదారని వాపోయారు. చిత్రహింసలకు గురి చేశారని అన్నారు. భాస్కర్‌పై పీడీ చట్టం నమోదు చేసి జైల్లో పెట్టడం దారుణమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం బిజెపి కార్యకర్తలను అరెస్టు చేస్తుందని మండిపడ్డారు.

తమను ఎదురించినవారిపై టీఆర్ఎస్ ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతుందని విమర్శించారు. రాజకీయం అంటేనే యుద్ధం, సమరం అని చెప్పిన దత్తాత్రేయ పార్టీ శ్రేణులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక అంశాలపై ఉద్యమాలు చేయాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఓ గ్రామంలో మహిళలు సంఘటితమై బెల్టు షాపులు మూయించారని, ఆ స్ఫూర్తిని అందుపుచ్చుకోవాలని తెలిపారు. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా గ్రామగ్రామాన ఉద్యమాలు ఉధృతం చేయాలని సూచించారు. అదేవిధంగా మోదీ ప్రభుత్వం చేపడుతోన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజల వద్దకు తీసుకెళ్లాలని దత్తాత్రేయ సూచించారు. ■

# మోదీతో పెరిగిన భారత ప్రతిష్ఠ

మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠ పెరిగిందని బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. డోక్లాం ప్రతిష్టంభనను మోదీ చాకచక్యంతో అద్భుతమైన దౌత్యనీతి ప్రదర్శించి ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. ఈ విషయంలో చైనాను భారత్ దౌత్యపరంగా ఓడించిందని స్పష్టం చేశారు. జాతీయ కార్యవర్గ సమావేశాల గురించి వివరిస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రశంసించారు.



అవినీతి, నల్లధనం నిర్మూలనకు మోదీ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే నోట్లరద్దు, జీఎస్టీ అని తెలిపారు. పెద్దనోట్ల రద్దుతో ఉగ్రదాడులు, చీకటి వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయని అన్నారు. ఆదాయపు పన్ను కట్టేవారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. జీఎస్టీ స్వతంత్ర భారతంలో ప్రవేశపెట్టిన అతిపెద్ద ఆర్థిక సంస్కరణగా అభివర్ణించారు. జీఎస్టీతో ఇప్పుడొస్తున్న ఇబ్బందులు, సమస్యలు తాత్కాలికమేనని ముందుముందు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని స్పష్టం చేశారు. జీఎస్టీపై విపక్షాలు తప్పుడు ప్రచారానికి తెగబడుతున్నాయని మండిపడ్డారు. సమాఖ్య స్ఫూర్తికి పెద్దపీట వేసిన మోదీ ప్రభుత్వం జీఎస్టీ అమలులో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో సహా అన్ని రాష్ట్రాలకు భాగస్వామ్యం కల్పించిందన్నారు.

పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో పన్నులు ఎగ్గొట్టేవారికి, చీకటి వ్యాపారాలు చేసుకునేవారికే నష్టం కలుగుందని అన్నారు. మోదీ వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. కొన్నిచోట్ల కొందరు వ్యాపారులు ఎమ్మార్పీపై జీఎస్టీ వేస్తున్నారని దీనిని అడ్డుకునేందుకు కార్యకర్తలు చొరవ చూపించాలని అన్నారు. జీఎస్టీ సక్రమంగా అమలైై ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చూడాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

మోదీ ప్రభుత్వ చర్యలు జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదం తగ్గించాయని, శాంతిస్థాపనకు దోహదం చేస్తున్నాయని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధికి నరేంద్ర మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని కిషన్ రెడ్డి చెప్పారు. ■

- తొలిరోజు అక్టోబర్ 28న పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పదాధికారులు, జిల్లా, మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.
- రెండో రోజు అక్టోబర్ 29న కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, జిల్లా, మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.
- ఇటీవల మృతి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలకు సంతాపం తెలుపుతూ రాష్ట్ర కార్యదర్శి పాపారావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.
- సంస్థాగత విషయాలపై రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాసులు ప్రసంగించారు.
- జిల్లా, మండల కార్యవర్గ సమావేశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ఆచారి ప్రసంగించారు.
- స్థానిక సంస్థల ఎన్నికల తయారీపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా॥ మనోహర్ రెడ్డి ప్రసంగించారు.
- భవిష్యత్ కార్యక్రమాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి వివరించారు.
- మొదటి రోజు రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ చేపట్టిన తెలంగాణ విమోచన యాత్ర, జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి రాంలాల్‌జీ పర్యటన, పార్లమెంట్ క్లస్టర్స్, అజీవన సహయోగి నిధి, జిల్లావారీ బడ్జెట్ తయారీ – నిధి సేకరణ, జనసందేశ్, సోషల్ మీడియా తదితర అంశాలపై చర్చించారు.
- రెండో రోజు రైతాంగ, దళితుల, నిరుద్యోగ సమస్యలు, మండలాలు, జిల్లా కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు, జిల్లా, మండల కార్యవర్గ సమావేశాలు, సంస్థాగత విషయాలు తదితర అంశాలపై చర్చించారు.
- కొత్తగా పార్టీలో చేరిన ప్రముఖులను వేదికపైకి పిలిచి రాష్ట్ర కార్యవర్గానికి పరిచయం చేశారు.
- రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాసులు జిల్లాల్లో చేపట్టిన పార్టీ కార్యక్రమాల నివేదికను జిల్లా అధ్యక్షుల నుంచి సేకరించారు.
- మంగోలియాలో ప్రపంచ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలుచుకున్న మంచిర్యాల వాసి గోపు శ్రీనివాస్‌ను సత్కరించారు.
- సమావేశం జరిగిన వేదికను అందంగా ముస్తాబు చేశారు. సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ, అంబేద్కర్, స్వామి వివేకనంద తదితర మహాపురుషుల కొటేషన్స్‌ను అతికించారు.
- సమావేశం నేపథ్యంలో బిజెపి జెండాలు, కటౌట్‌లతో మంచిర్యాల కాషాయ రంగులో కనువిందు చేసింది.
- సమావేశానికి వచ్చిన అతిథులకు చక్కని అతిథి మర్యాదలు చేసిన బిజెపి మంచిర్యాల జిల్లా విభాగాన్ని ప్రశంసించారు.



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. – దీన్‌దయాళ్జీ




సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 31న మేడ్చల్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో "రన్ ఫర్ యూనిటీ"



అక్టోబర్ 31న హైదరాబాద్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో స్థానిక బిజెపి నేతల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



అక్టోబర్ 31న హైదరాబాద్ అత్తాపూర్ డివిజన్‌లో స్థానిక బిజెపి నేతల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



అక్టోబర్ 31న కామారెడ్డి జిల్లా బాన్సువాడలో స్థానిక బిజెపి నేతల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



అక్టోబర్ 25న బీజేవైఎం కామారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు బానాల లక్ష్మా రెడ్డి, మురళీధర్ గౌడ్, పడాల అనంత కృష్ణ తదితరులు



గ్రూప్-1లో ఎంపికైన 121 మంది అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న టీఎస్పీఎస్సీని ముట్టడించిన బీజేవైఎం నాయకులు



అక్టోబర్ 25న ఖమ్మం పత్తి మార్కెట్ ను సందర్శించిన కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి, ఖమ్మ జిల్లా అధ్యక్షుడు సన్నె ఉదయ్ ప్రతాప్




అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 25న పెద్దపల్లి కలెక్టరేట్ ముట్టడించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కాశిపేట లింగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖాముఖి

# నకారాత్మక రాజకీయాలకు స్వస్తి పలకాలి



**ఏడుసార్లు గోరఖ్‌పూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికై ఏడు నెలల క్రితం దేశంలో కెల్లా అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన యోగి ఆదిత్యనాథ్ అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఈ ఏడు నెలల కాలంలో ఎన్నో అవరోధాలను అధిగమించిన ఆయన ఒక ఆంగ్ల జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తాజ్‌మహల్‌పై చెలరేగిన వివాదంతో పాటు రామ రాజ్యం, హిందుత్వ, ఉత్తర ప్రదేశ్‌పై ఆయన ప్రణాళికలపై తన అభిప్రాయాలు వెలిబుచ్చారు.**

**ప్ర: గత ఏడు నెలల కాలంలో మీ ప్రభుత్వం ఆస్పత్రుల్లో పిల్లల మరణాలు, గోరక్షకుల పేరిట పెరిగిన దాడులు మొదలుకుని ఇప్పుడు తాజ్‌మహల్ వివాదం వరకు చాలా వివాదాలను ఎదుర్కొంది?**

**జ:** సవాళ్లు నాకేమీ కొత్తకావు. నిజం చెప్పాలంటే ఈ రాష్ట్రంలో ఎదురయ్యే ప్రత్యేక సవాళ్ళను దృష్టిలో పెట్టుకునే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా నన్ను ఇక్కడికి ముఖ్యమంత్రిగా పంపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే నా లక్ష్యం. కనుక ఏ సవాలైనా ఎదుర్కొంటాను. అదే భవిష్యత్ కార్యక్రమం కూడా.

**ప్ర: రాష్ట్రంలో శాంతిభద్రతలు, పరిపాలన పడకేశాయని మీ ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు?**

**జ:** రాష్ట్రం నుంచి అనేకసార్లు పార్లమెంటుకు ఎన్నికైన వ్యక్తిగా ఉత్తర ప్రదేశ్ గురించి నాకు బాగా తెలుసు. ఇక్కడ రాజకీయాల స్వరూప స్వభావాలు నాకు అవగతమే. మా ప్రత్యర్థులకు చేయడానికి పనేమీ లేదు. వాళ్ళు ఇప్పుడు ఒకవిధంగా నిరుద్యోగులు. వారి నుంచి ఇంతకంటే ఇంకా ఏం ఆశిస్తారు? వాళ్ళు చేసేదల్లా కుట్రలు పన్నడం, ప్రభుత్వం చేసే పనులకు అడ్డంకులు కల్పించడం, అర్థంపర్థం లేని వివాదాలు సృష్టించడమే. వాళ్ళు అధికారంలో ఉన్నప్పుడు వాళ్ళు ఏమీ చేయలేదు. కులాలు, మతాలూ, వేరే ఇతర సాకులతో రాష్ట్ర ప్రజలను విభజించారు. బుజ్జగింపు రాజకీయాలు జోరుగా చేశారు. కనుక నాపై వారు కుట్రలు పన్నడం సహజమే. ఇవన్నీ జీవితంలో ఒక భాగమే అని నేను భావిస్తాను. అభివృద్ధి పథం నుంచి నన్ను ఎవరూ తప్పించలేరు. సమాజంలోని అన్ని వర్గాలనూ అభివృద్ధి బాటలో నడిపించడం నా లక్ష్యం. అందుకే నా పాలన ఎజెండా అభివృద్ధి తప్ప మరొకటి కాదు. కేంద్రంలో మోదీజీ చేస్తున్నది కూడా ఇదే.

**ప్ర: గత ఏడు నెలల కాలంలో మీరు సాధించిన ప్రధాన విజయాలేమిటి?**

**జ:** మేము అధికారంలోకి వచ్చేటప్పటికి ప్రజలు పరిపాలన పట్ల నమ్మకం కోల్పోయారు. ప్రజల్లో ఆ నమ్మకాన్ని పునరుద్ధరించడం, సుపరిపాలన, అభివృద్ధి మళ్ళీ రాష్ట్రంలో సాధ్యమే అన్న ఆశను, విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించడమనేది నేను సాధించిన పెద్ద విజయం. 15 ఏళ్ల కాలంలో మొదటిసారిగా ప్రజలు ప్రభుత్వం నుంచి అభివృద్ధిని ఆశిస్తున్నారు. రెండవది, రాష్ట్రంలో గత పాతికేళ్ళుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న విభజించి పాలించే రాజకీయాలకు, సంతుష్టీకరణ విధానాలకు నేను స్వస్తి పలికాను. ఒంటెత్తు ఎజెండాలకు, విభజనాత్మక రాజకీయాలకు ఇక్కడ తావులేదు. రైతుల నుంచి మహిళలు, విద్యార్థుల వరకు సమాజంలోని ప్రతి ఒక్క వర్గం అభివృద్ధి కోసం మేము ఆర్థిక విధానాలను రూపొందించాం. ఇది మా ప్రభుత్వం సాధించిన రెండో ముఖ్య విజయం.

**ప్ర: వివాదాల కారణంగా ఈ విజయాలు మరుగున పడిపోయినట్లు మీరు భావించడం లేదా? ఉదాహరణకు తాజ్‌మహల్‌నే తీసుకోండి.**

**జ:** తాజమహల్‌పై వివాదం ఏమీ లేదు. ఎవరో కొందరు తమకు తోచిన వ్యాఖ్యలు చేసినంత మాత్రాన అది వివాదం కాదు. మీరు గమనిస్తే ఇటువంటి వ్యాఖ్యలు గత 50 ఏళ్ల నుంచి వినిపిస్తూనే వుంటాయి. మున్ముందు కూడా మనం వాటిని వింటాం. అటువంటి వాటిని గోరంతలు కొండంతలు చేయాల్సిన అవసరం లేదు. గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో పిల్ల విషాదకర మరణాలకు కారణం ఆక్సిజన్ కోరతేనని కూడా ఆరోపణలు చేశారు. కానీ వాస్తవం దానికి భిన్నం ఎప్పుడూ ఆక్సిజన్ కొరత లేదు. కొందరు ప్రతి విషయాన్ని ప్రభుత్వానికి వ్యతిరేక ప్రచారానికి వాడుతున్నారు.

అలాగే పర్యాటక శాఖ రామాయణ, కృష్ణ, బౌద్ధ సర్క్యూట్‌లలో జరిగిన కృషిని వివరిస్తూ ఒక పుస్తకం ప్రచురిస్తే అందులో తాజ్‌మహల్‌ను కావాలని చేర్చలేదని కొందరు రాద్ధాంతం సృష్టించారు. తాజ్‌మహల్ ఏమీ మాయం కాలేదు. తాజ్‌మహల్ ఎప్పుడూ రామాయణ, కృష్ణ, బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌లో భాగంగా లేదు. అందులో మా ప్రభుత్వం ప్రమేయం ఏమీ లేదు. కానీ తాజ్‌మహల్‌ను దానికి లింకు చేసి లేనిపోని గొడవ చేశారు. సాంస్కృతిక వారసత్వ (హెరిటేజ్) టూరిజం కింద తాజ్‌మహల్, ఆగ్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.370 కోట్లు కేటాయించింది. మా దృష్టిలో సాంస్కృతిక వారసత్వ పరంగా తాజ్‌మహల్ ఒక ముఖ్యమైన చారిత్రక కట్టడం, పర్యాటక కేంద్రం.

**ప్ర: మీ తాజ్‌మహల్ సందర్శన విమర్శకుల నోళ్ళు మూయించడానికే అనుకోవచ్చా?**

**జ:** అది ఎవరి నోరు మూయించడానికి కాదు. ఒక ముఖ్యమంత్రిగా నేను అయోధ్య, చిత్రకూటం, కాశి, ప్రయాగరాజ్ వంటి ప్రదేశాలతో పాటు ఆగ్రాకు కూడా వెళ్లాను. ఉత్తర ప్రదేశ్‌లో టూరిజాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించవచ్చని, ఇంకా కృషి జరిగితే రాష్ట్రానికి టూరిస్టుల సంఖ్యను పదిరెట్లు పెంచవచ్చని నా నమ్మకం. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. అందుకే మేము హెరిటేజ్ (సాంస్కృతిక వారసత్వ) పర్యాటకాన్ని పెద్దయెత్తున ప్రోత్సహిస్తున్నాం.

**ప్ర: అంటే మేరు తాజ్‌మహల్‌ను భారతీయ సంస్కృతిలో భాగంగా పరిగణిస్తున్నారా?**

**జ:** నేను ఆ చర్చలోకి వెళ్ళదలచుకోలేదు. పర్యాటక రంగానికి సంబంధించినంత వరకు తాజ్‌మహల్ చాలా ముఖ్యమైన ప్రదేశమని మాత్రం నేను చెప్పగలను. నిర్మాణ కౌశలం, ఆకృతి కోణాల నుంచి అది ప్రసిద్ధి చెందిన కట్టడం. నిత్యం 40 వేల నుంచి 50 వేల వరకు టూరిస్టులు ఆగ్రాకు వస్తారు, వారంతా తాజ్‌మహల్ చూస్తారు. వారి భద్రతా, క్షేమం, సౌకర్యాలు కల్పించడం మా నైతిక బాధ్యత. మా ప్రభుత్వం ఆ దిశలో అవసరమైన చర్యలు తీసుకుంటుంది.

**ప్ర: మీరు రామ రాజ్యాన్ని తీసుకొస్తామని చెబుతున్నారు. దీనికి మతపరమైన అర్థాలు ఉన్నాయి కదా?**

**జ:** రామ రాజ్యానికి అర్థం చాలా సరళమైనది. ఎక్కడైతే వివక్షకు, దుఃఖం, దారిద్ర్యం ఉండవో, ప్రజలు ఒకరిపట్ల ఒకరు ప్రేమతో ఉంటారో, ఈర్ష్య అసూయలకు తావుండదో అదే రామరాజ్యం. ఈ కలను నిజం చేయడానికి మేము పాటుపడుతున్నాం. అది ఒక ఆదర్శ రాజ్యం. ప్రజల సంక్షేమం కోసం శ్రమించే రాజ్యం. గాంధీజీ కూడా అటువంటి పాలనను రామరాజ్యంగా అభివర్ణించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్యుత్తుకు నోచుకోని వారికి ఇంట్లో విద్యుత్ దీపం వెలిగితే అది రామరాజ్యమే. పేదలకు పట్టెడన్నం పెట్టడం, దారిద్ర్యాన్ని నిర్మూలించడం, ఉద్యోగాలు కల్పించడం రామరాజ్యమే.

**ప్ర: ఈ రామరాజ్యంలో ముస్లింలకు స్థానం ఉంటుందా?**

**జ:** రామరాజ్యంలో వివక్షకు తావులేదు. కులమతాల పేరిట జరిగిన విభజనల వల్ల ఉత్తరప్రదేశ్ ఇప్పటికే చాలా నష్టపోయింది. ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్ చాలాకాలంగా ఈ నకారాత్మక రాజకీయాలను సాగిస్తున్నాయి. గత 70 ఏళ్లుగా ఇటువంటి రాజకీయాలతోనే దేశాన్ని నాశనం చేశారు. ఇప్పుడు మోదీజీ అభివృద్ధి ఎజెండాతో కృతనిశ్చయంతో ముందుకు వెళ్తున్నందున అటువంటి రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన సమయం వచ్చింది. ఆయన కులమతాలతో ప్రమేయం లేకుండా ప్రజలందరి సంక్షేమానికి విధానాలు రూపొందిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ కూడా మోదీ నిర్దేశించిన బాటలోనే నడుస్తోంది.

**ప్ర: అంటే యోగి ఆదిత్యనాథ్ హిందువులకు ఎంత దగ్గరి మనిషో ముస్లింలకు అంత కావలసిన మనిషేనా?**

**జ:** రాష్ట్రంలోని మొత్తం 22 కోట్ల మంది కోసం పని చేస్తాను. వారి విశ్వాసాలను గౌరవిస్తాను. వారి సంక్షేమానికి అంకిత మయ్యాను. అది నా బాధ్యతా, దాన్ని నేను నెరవేరుస్తాను.

**ప్ర: మీరు ఎందుకు అంత వివాదాస్పద వ్యక్తి అయ్యారు?**

**జ:** నేను వివాదాస్పద వ్యక్తిని కాదు. పౌరుల సంక్షేమం, భద్రతకు కట్టుబడిన ఒక సాధారణ పౌరుడిని.

**ప్ర: మీ విమర్శకులు మిమ్మల్ని అతివాద హిందుత్వవాదిగా వర్ణిస్తారు?**

**జ:** హిందుత్వాన్ని మీరెలా నిర్వచిస్తారన్న దాన్ని బట్టి అది ఆధారపడి ఉంటుంది. హిందుత్వ అనేది ఒక జీవనతత్వం. అది ఒక జీవన కళ. ఒక మతం కాదు. హిందుత్వను మనం ఒక జీవన విధానంగా తీసుకుంటే అది ప్రపపంచంలోనే ఒక అత్యున్నతమైన, శ్రేష్టమైన జీవన విధానమవుతుంది. హిందుత్వం అనేది సంక్షేమ భావన పునాదిగా నిర్మితమైన విధానం. దాన్ని అనుసరిస్తే, అమలు చేస్తే అందరికీ మంచి జరుగుతుంది.

**ప్ర: అయోధ్యలో రామ మందిరం నిర్మాణంపై మీ వైఖరి ఏమిటి?**

**జ:** అది కోర్టులో ఉన్న వ్యవహారం. డిసెంబర్ 5 నుంచి సుప్రీం కోర్టు విచారణ ప్రారంభిస్తుంది. కోర్టు తీర్పు వెలువడే వరకైనా వేచి చూడాలి లేదా రెండు పక్షాలూ పరస్పరం ఒక అవగాహనకు రావాలి.

**ప్ర: గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో పిల్లల మరణాలకు ఆక్సిజన్ కొరత కారణం కాదా?**

**జ:** కానే కాదు. మెదడువాపు వ్యాధి ఆ మరణాలకు కారణం. మెదడువాపు వ్యాధి ప్రబలే అవకాశం ఉన్న 38 జిల్లాల్లో 52 లక్షల మంది పిల్లలకు ఇప్పటికే వ్యాధి టీకాలు వేశాం. తీవ్రమైన మెదడువాపు వ్యాధి కేసుల సంఖ్య చాలావరకు తగ్గిపోయింది. జిల్లా ఆస్పత్రుల్లో పిల్లల వార్డులు ఏర్పాటు చేసి వాటిలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. 2015 నుంచి పిల్లల మరణాల సంఖ్యను గమనిస్తే ఈ ఏడాది అవి తగ్గినట్టు తెలుస్తుంది.

**–జనసందేశ్ ప్రతినిధి**


ప్రతి హిందువూ హిందూ దేశ చరిత్ర చదివి తీరాలి. – మహాత్మాగాంధీ
భావ పరివర్తన చాలదు, హృదయ పరివర్తన కావాలి. – శ్రీ దత్తోపంత్ ఠెంగ్డే

ఏకాత్మత

# శరీరము, మనస్సు, బుద్ధి, ఆత్మల సమగ్రత్వం మనిషి!

● శివరాం

నాగరిక జీవనానికి పునాదిగా ఎంచుకున్న ప్రకృతి ధర్మాలను నీతి, నియమాలు అంటాం. ఇవి కనుగొన్నవే గాని, ఎవరో రూపొందించినవి కావు. చెట్టు కొమ్మ నుండి ఆపిల్ పండు కింద పడగా చూసి ఏదో నియమం ఉందని గ్రహించిన న్యూటన్ దాన్ని కనిపెట్టి లోకానికి వెల్లడించాడు. భూమ్యాకర్షణ సిద్ధాంతాన్ని న్యూటన్ కనుగొన్నాడు గాని రూపొందించ లేదు.

అలాగే మానవ సంబంధాల్లో కొన్ని సూత్రాలు ఉన్నాయి. మనకు కోపం ఉంది. కాని మొత్తం మానవాళి ప్రయోజనం కోసం కోపాన్ని నిగ్రహించుకుంటాం. ఇలాంటి నైతిక నియమాలను కనుగొన్నారు. అసత్యమాడ రాదు. సత్యమునే పలుకుము. ఇదొక నియమం. దీని ప్రయోజనం మనకు జీవితంలో అడుగడుగునా కనిపిస్తుంది. సత్యవంతులను మనం అభినందిస్తాం. అబద్ధాలాడితే మనకూ బాగుండదు. జీవితం సజావుగా నడవదు. అంతా తికమకే.

## ఆధునికత-ప్రాచీనత

ఇలాంటి నియమాలతో మన ధర్మం ఏర్పడుతుంది. స్వతహాగా పిల్లలు అబద్ధం చెప్పరు. తల్లిదండ్రులే తరచూ తమ పిల్లలకు అబద్ధమాడడం నేర్పిస్తారు. ఒక వస్తువును చూసి దాన్నిమ్మని పిల్లలు అడిగితే ఏ కారణం చేతయినా ఆ వస్తువును పిల్లలకు ఇవ్వడం ఇష్టం లేనప్పుడు తల్లిదండ్రులు దాన్ని దాచి మాయమైపోయిందని చెప్తారు. అలా ఒకటి రెండు సార్లు పిల్లల్ని మాయ చేయవచ్చు. కానీ నిజం తెలుసుకున్నాక పిల్లలు అబద్ధ మాడడం నేర్చుకుంటారు. అలా ప్రాకృతికంగా మనిషి సత్యవంతుడనే సత్యాన్ని కనుగొన్నాం. నైతికతకు సంబంధించిన అనేక సూత్రాలను అలానే కనుగొన్నారు. ఎవరో తమకు తోచినట్లు వాటిని రూపొందించలేదు. ఈ సూత్రాలను భారత్‌లో "ధర్మం" జీవన న్యాయ సూత్రాలు, నియమాలు అన్నారు. మానవాళి జీవనంలో శాంతి, సమరసత పురోగతిని కలుగ జేసే ఇలాంటి సూత్రములు అన్నింటినీ "ధర్మం" క్రింద చేర్చారు. ధర్మం యొక్క పటిష్ట పునాదుల మీద



> **అసలు పిచ్చి అంటే ఏమిటి? పిచ్చివానికి అన్ని సౌకర్యాలుండవచ్చు. ఆరోగ్యం ఉండవచ్చు. బంధువులు జాగ్రత్తగా చూస్తుండవచ్చు. కాని మేథో ఆనందం ఉండదు. ఆ బుద్ధిజనిత ఆనందం కూడా అవసరం. వీటన్నింటినీ మనం పరిగణనలోకి తీసుకోవాలి. వ్యక్తి దేహము, మనస్సు, బుద్ధి, ఆత్మ అనే నాలుగింటితో రూపొందుతాడు. ఇవన్నీ సమగ్రమైనవి. వీటిని మనం విడి భాగాలుగా ఆలోచించలేం.**

జీవితాన్ని సంపూర్ణంగా సమగ్రంగా విశ్లేషించుకుని మనం ముందుకు సాగాలి. ప్రకృతిని ధర్మ సూత్రాలకు అనుగుణంగా మలచు కున్నప్పుడు మనకు సంస్కృతి, నాగరికత ఏర్పడినవి. మానవాళి జీవితాన్ని నిలపడానికి, బాగు చేయడానికి సంస్కృతి మనల్ని సశక్తీకరి స్తుంది. ఇక్కడ "ధర్మం" అంటే న్యాయం. ఆంగ్ల భాషలో చెప్పుకునే మతం ఇక్కడ సరైన పదం కాదు.

ఇంతకు ముందే పేర్కొన్నట్లు సంస్కృతికి పునాదిగాను, దాని లక్ష్యము ఆదర్శములుగా అంతర్లీనంగాను, ఉన్నది సమగ్ర జీవనమే. సామూహిక, సాంఘిక జీవనంలో మాత్రమే కాక వ్యక్తివిషయంలో కూడా మనం సమగ్ర జీవనము గురించి ఆలోచన చేశాం. వ్యక్తి అనగానే సహజంగా భౌతిక శరీరము అనే అనుకుంటాం. భౌతిక సదుపాయాలు, సౌఖ్యాలే ఆనందం అని భావిస్తాం. కాని మానసిక ఆందోళన శరీర ఆనందాన్ని పాడు చేస్తుందని మనకు తెలుసు. భౌతిక సుఖాలను అందరూ కోరుకుంటారు. కాని ఒకరిని జైలులో వేసి అక్కడ మంచి భోజనం పెట్టిస్తే అతను సంతోషంగా ఉండగలడా? పసందైన విందు భోజనంతో పాటు పదిరకాల తిట్లు, చివాట్లు కలిపి వడ్డిస్తే దాన్ని ఆనందంగా స్వీకరిస్తారా? మనందరికీ తెలిసిన మహాభారతంలోని ఓ సంఘటన- పాండవుల దూతగా శ్రీకృష్ణ భగవానుడు హస్తినాపురం వెళ్ళి నప్పుడు తన ఆతిథ్యం స్వీకరించమని దుర్యోధనుడు ఆయన్ను ఆహ్వానించాడు. అతని ఆహ్వానాన్ని తిరస్కరించిన కృష్ణుడు విదురుని ఇంటికి వెళ్ళాడు. పూజనీయుడైన వాడు తన ఇంటికి వచ్చాడనే ఆనంద పారవశ్యంలో విదురుని భార్య అరటి పళ్ళు వొలిచి, గుజ్జు పారేస్తూ, తొక్కలు ఆయనకు వడ్డించింది. కృష్ణుడు ఆ అరటి తొక్కలనే ఆనందంగా భుజించాడు. భక్తికలుగు కూడు పట్టెడైనను చాలు అని కదా లోకోక్తి. అందుకే 'ఆదరింపులేని పంచభక్ష్య పరమాణ్ణాల కన్నా ప్రేమ ఆప్యాయతతో పెట్టిన పేదవాడి చద్దిబువ్వ రుచి' అన్నారు. కనుక మానసిక ఆనందాన్నీ గుర్తించాలి. అలాగే మేథో ఆనందం కూడా. ఒకని దేహానికి తగిన సౌకర్యాలు మనస్సును సంతోష పరిచే గుర్తింపు, ప్రేమ, అభిమానాలు, లభించినా మేథో పరమైన తికమకలో పడినప్పుడు అతడు దాదాపు వెర్రివాడయి పోతాడు. అసలు పిచ్చి అంటే ఏమిటి? పిచ్చివానికి అన్ని సౌకర్యాలుండవచ్చు. ఆరోగ్యం ఉండవచ్చు. బంధువులు జాగ్రత్తగా చూస్తుండవచ్చు. కాని మేథో ఆనందం ఉండదు. ఆ బుద్ధిజనిత ఆనందం కూడా అవసరం, ముఖ్యమైనది. వీటన్నింటినీ మనం పరిగణనలోకి తీసుకోవాలి. వ్యక్తి దేహము, మనస్సు, బుద్ధి, ఆత్మ అనే నాలుగింటితో రూపొందుతాడు. ఇవన్నీ సమగ్రమైనవి. వీటిని మనం విడి భాగాలుగా ఆలోచించలేం. ■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. - స్వామి వివేకానంద

జనవాణి

# కేరళలో మత మార్పిడి కుంభకోణం?

● అభినవ్

కేరళలో మతమార్పిడులపై ఇండియా టుడే పత్రిక అధ్యయనంలో భయంకరమైన విషయాలు బయట పడ్డాయి. పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఐఎఫ్) అనే మతతత్వ సంస్థ తమది నయా సామాజిక, స్వచ్ఛంద సంస్థ అని, ఇది వివిధ సంస్థల సమ్మేళనమని, సామాజిక అభ్యున్నతి తమ లక్ష్యం అని చెప్పుకుంటుంది. కాని పిఐఎఫ్ మత మార్పిడుల కుంభకోణం నడుపుతోందని, అంతిమంగా భారత్‌ను ఇస్లామిక్ రాజ్యంగా మార్చడం ఆ సంస్థ లక్ష్యం అని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) భావిస్తోంది.

ఈ సంస్థ సత్య సరణి లేదా మర్కజుల్ హిదాయ అనే విభాగం పేరిట విద్యా సంస్థ, దాతృత్వ సంస్థ ముసుగులో మత మార్పిడులు కొనసాగిస్తోందని ఎన్ఐఎ నివేదికలో తెలియజేసింది. పిఐఫ్ మహిళా విభాగం అధ్యక్షురాలు జైనబాను ఇండియా టుడే పత్రిక విలేకరి మారు వేషంలో ఇంటర్వ్యూ చేశారు. ఇందులో మత మార్పిడికి జరుగుతున్న రహస్యాలు అనేకం బయట పడ్డాయి. మత మార్పిడి అన్న పదం వాడకూడదని, ఎందుకంటే దాని వల్ల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు ఆగ్రహం కలుగుతుందని జైనబా అన్నారు. కాని నిజానికి అది దాతృత్వ సంస్థ ముసుగులో మత మార్పిడులు కొనసాగిస్తోంది. ఆ తర్వాత జైనబా మత మార్పిడులు కొనసాగించే క్రమాన్ని వివరించారు.

సత్య సరణి మత మార్పిడుల ప్రకారం మతం మారిన వారు పూర్తిగా ఆ మతానుయాయులు అయిన తర్వాత తప్ప బయటికి వెళ్లరు కనక ఈ రహస్యం బయట పడే అవకాశం లేదు అని జైనబా అంటారు. ఇలాంటి సంస్థలను ఎలా ఏర్పాటు చేస్తారో కూడా ఆమె వివరించారు. మొదట ఒక స్థలం చూసి ఓ ధర్మ సంస్థ ఏర్పాటు చేస్తారు. అక్కడ నమాజు చేసుకోవడానికి మసీదు, నివాసానికి ఇళ్లు మొదలైన సదుపాయాలన్నీ ఏర్పాటు చేస్తారు. వీటినన్నింటినీ సత్య సరణి కల్పిస్తుంది. ఆ తర్వాత సంఘాలను రిజిస్టర్ చేసుకునే చట్టం ప్రకారం ఆ సంస్థను రిజిస్టర్ చేయిస్తారు. అక్కడ నమాజ్ చేయడం, క్షేత్ర స్థాయిలో ఎలా పని చేయాలి అనే విషయాలతో పాటు ఇస్లాం గురించి బోధిస్తారు. మత మార్పిడి పూర్తి అయిన తర్వాత ఓ సర్టిఫికేట్ కూడా ఇస్తారు.

మతం మారిన తర్వాత పేర్లు మారుస్తారు కనక సర్టిఫికేట్ అవసరం. పేరు మార్చుకున్నప్పుడు ఆ విషయాన్ని గజెట్‌లో ప్రకటించాలి. సర్టిఫికేట్ సంపాదించడానికి రెండు పద్ధతులు అనుసరిస్తామని, ఈ రెండు పద్ధతుల్లో సర్టిఫికేట్లు ఇచ్చేది ఇతర చోట్ల నుంచే అని జైనబా చెప్పారు. ఒక సంస్థ నుంచి ముందు ఒక పత్రం జారీ చేసి ఆ తర్వాత ఆ వ్యక్తి మతం మారినట్టు సర్టిఫికేట్ ఇస్తారు. ప్రమాణ పత్రం (అఫిడవిట్) దాఖలు చేయడం ద్వారా సర్టిఫికేట్ ఇవ్వడం మరో పద్ధతి. కేరళలో కాలికట్‌లోని తెర్బియాతుల్ ఇస్లాం, పొన్నానిలోని మోనుస్థిల్ ఇస్లాం సంస్థలు మాత్రమే మత మార్పిడులు చేస్తాయని జైనబా చెప్పారు. ఈ సంస్థలకు ప్రభుత్వ సర్టిఫికేట్లు ఉన్నాయి. ఈ సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదిస్తుంటాయి.

పిఎఫ్ఐకి హవాలా పద్ధతిలో గల్ఫ్ దేశాల నుంచి నిధులు అందుతాయి. క్రమ పద్ధతిలో విరాళాలు కూడా స్వీకరిస్తుంది. ఇలా మతం మార్చుకున్న వారు ఇస్లామిక్ స్టేట్ కోసం యుద్ధం చేశారని, తీవ్రవాదం పాదుకున్న ప్రాంతాలలో పాల్గొన్నారని, వారిలో కొంత మంది మృతి చెందారని కూడా వార్తలు వచ్చాయి.

పిఎఫ్ఐ సంస్థ దౌర్జన్యకర సంఘటనలను ప్రేరేపించినట్టు, దీని కోసం ఆయుధాలు సమకూర్చుకున్నట్టు కూడా సమాచారం ఉంది. 2010లో ఈ సంస్థకు చెందిన వారే ఒక అధ్యాపకుడి చేయి నరికేశారు. ఆ అధ్యాపకుడు తయారు చేసిన ప్రశ్న పత్రం ఒక మత నాయకుడికి, ఒక మత సంస్థకు వ్యతిరేకంగా ఉందన్న ఆరోపణతో ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. ఈ కేసులో నిందితులందరూ పిఎఫ్ఐ కార్యకర్తలే. ఈ సంస్థకు చెందిన వారే ఇటీవల బెంగళూరుకు చెందిన ఆరెస్సెస్ నాయకుడిని హతమార్చారు. ఈ సంస్థ కన్నూరులో తీవ్రవాద శిక్షణా శిబిరం నడుపుతోంది. ■



ఉప్పల్ బస్ టెర్మినల్ అభివృద్ధి చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతగా మొర పెట్టుకున్నా స్పందన లేకపోవడాన్ని నిరసిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ అక్టోబర్ 30న ఆర్టీసీ బస్సులో అసెంబ్లీకి వెళ్లి ప్రభుత్వంలో చలనం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

వర్తమానం

## మోదీ సంస్కరణలతో భారత్ జోరు

# ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 100వ ర్యాంకు

మోదీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలాలు అందివస్తున్నాయి. వ్యాపారాన్ని సులువుగా నిర్వహించుకోవడానికి గత నాలుగేళ్లుగా అమలు చేసిన సంస్కరణలు ప్రపంచ బ్యాంకు నివేదికలో స్పష్టంగా కనిపించాయి. ప్రపంచవ్యాప్తంగా సులభ వ్యాపార నిర్వహణకు అనువుగా ఉన్న 190 దేశాల జాబితాలో భారత్ ఈ ఏడాది ఒక్కసారిగా 30 స్థానాలు ఎగబాకి తొలిసారి 100వ ర్యాంకు సాధించింది. గత రెండేళ్లుగా 131, 130 స్థానాల్లో ఉన్న భారత్ గణనీయమైన పురోగతి ప్రదర్శించింది. ఇదే జోరు కొనసాగిస్తే వచ్చే అయిదేళ్లలో 50వ ర్యాంకుకు చేరే అవకాశాలున్నాయని స్వయంగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధులే పేర్కొంటున్నారు. ఈ జాబితాలో న్యూజిలాండ్ తొలి స్థానంలో నిలవగా.. ఆ తర్వాతి స్థానాల్లో.. సింగపూర్(2), డెన్మార్క్(3), దక్షిణ కొరియా(4), హాంకాంగ్(5), అమెరికా(6), బ్రిటన్(7) నిలిచాయి. మన పొరుగున ఉన్న చైనా(78), పాకిస్థాన్(147) స్థానాల్లో ఉన్నాయి.

భారత్ తన స్కోరును 4.71 పాయింట్లు పెరుగుపరచుకుని 60.76 పాయింట్లకు చేరడంతో 30 స్థానాలను మెరుగుపరచుకుంది. ఈ స్థాయిలో ర్యాంకును మెరుగుపరచుకున్న అతిపెద్ద దేశం మనదొక్కటే. పన్నులు, లైసెన్సులు, మదుపర్ల రక్షణ, దివాలా తదితర సంస్కరణలు ఇందుకు దోహదం చేశాయని ప్రపంచ బ్యాంకు నివేదిక స్పష్టం చేస్తుంది. వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) అమలు, పెద్ద నోట్ల రద్దు విషయంలో కొన్ని త్రైమాసికాలుగా విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడడం గమనార్హం. 2003 నుంచీ తీసుకురావాలని ప్రయత్నిస్తున్న 37 సంస్కరణల్లో గత నాలుగేళ్లలోనే సగం సంస్కరణలను అమలు పరచడం ఈ ర్యాంకుకు దోహదం చేసిందని ప్రపంచ బ్యాంకు తన 'డూయింగ్ బిజినెస్ 2018: రిఫామింగ్ టు క్రియేట్ జాబ్స్' అనే వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ ర్యాంకింగ్‌ను జీఎస్‌టీ అమలు అనంతర వ్యాపార వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకోలేదు.

'మొత్తం 190 దేశాల్లో భారత్‌కు గతేడాది 130వ ర్యాంకు దక్కింది. కానీ ఈ ఏడాది 'సులువుగా వ్యాపారాన్ని నిర్వహించుకునే' 10 సంస్కరణల్లో ఎనిమిదింటిని భారత్ అమలు చేయడంతో 30 స్థానాలను మెరుగుపరచుకుంది'ని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో వెల్లడించింది. వ్యాపారాన్ని మొదలుపెట్టడానికి అనువుగా భారత్ మారింది. 2016-17లో చాలా మార్పులు కనిపించాయి. అనుమతుల ప్రక్రియను తగ్గించింది. బిల్డింగ్ అనుమతిని పొందడానికి పట్టే సమయం, రుణం సులువుగా లభించడం, మైనారిటీ వాటాదార్ల ప్రయోజనాలను రక్షించడం.. పన్ను చెల్లింపులు సులువుగా చేసుకోవడం, సరిహద్దుల్లో వాణిజ్యం, దివాలా ప్రక్రియను సులువుగా చేయడం వంటి వాటిలో బాగా మెరుగైంది. కొత్త వ్యాపారాన్ని ఏర్పాటు చేయాలంటే 15 ఏళ్ల కిందట 127 రోజుల సమయం పట్టేది. ఇపుడు అది 30 రోజులకు తగ్గింది. ఈ మార్పుల ఫలితమే భారత ర్యాంకు మెరుగుపడింది. ■

## చిన్న పరిశ్రమలకు అవకాశాలు



"వ్యాపార సానుకూల దేశాల జాబితాలో భారత్ స్థానం ఒకేసారి 30 స్థానాలు మెరుగుపడటం, దేశంలో అమలవుతున్న సంస్కరణల ఫలితమే. ఈ చరిత్రాత్మక పరిణామం వల్ల దేశంలోని పారిశ్రామిక వేత్తలకు ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు ఎన్నో అవకాశాలు లభిస్తాయి. ఆయా సంస్థలు వృద్ధి చెందుతాయి. గతేడాది మన దేశ ర్యాంక్ 130. ఏడాది వ్యవధిలో ఒకేసారి 30 స్థానాలు పైకి వెళ్లడం అందరూ గర్వించదగ్గ విషయం. ఈ జాబితాలో ఒకేసారి ఇన్ని స్థానాలు పైకి చేరడం ఇప్పుడే. దేశానికి ర్యాంకు ఇచ్చేందుకు 10 అంశాలను పరిగణనలోకి తీసుకోగా, 6 అంశాల్లో భారత్ స్థానం ఎంతో మెరుగుపడింది. అంతర్జాతీయంగా ఉత్తమ కార్యాచరణ విధానాలకు సమీపంలో ఇవి ఉన్నాయి. ఆర్థికంగా బాగా మెరుగుపడిన మార్కెట్లను పరిగణనలోకి తీసుకుంటే, దక్షిణాసియా దేశాల్లో, బ్రిక్స్ దేశాల్లో భారత్ ఒక్కటే ఈ ఘనత సాధించింది. భారత్ ఏకతాటిపై నిలిచి, పలు రంగాల్లో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే, సమున్నతస్థాయికి ఎదిగాం. వ్యాపార ప్రారంభం, నిర్వహణను సులభతరం చేసేందుకు గత మూడేళ్లుగా దేశంలోని వివిధ రాష్ట్రాలు కూడా సానుకూల దృక్పథంతో పోటీపడుతున్నాయి. పెట్టుబడుల ఆకర్షణ కోసం దేశ, విదేశాల్లోని పెద్ద కంపెనీలను ఆహ్వానించి నిర్వహిస్తున్న సదస్సుల వల్ల, సానుకూల ఫలితాలు వస్తున్నాయి. 'సంస్కరణలు, కార్యాచరణ, రూపాంతరీకరణ' ద్వారా వ్యాపారానుకూల దేశాల జాబితాలో, స్థానాన్ని మరింత మెరుగు పరచుకోవడంతో పాటు, పటిష్ట ఆర్థిక వృద్ధికి కృషి చేద్దాం."

**-నరేంద్ర మోదీ, భారత ప్రధానమంత్రి**

## మోదీ నిబద్ధతకు నిదర్శనం



"ప్రపంచబ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భారత ర్యాంకు మెరుగుపడడానికి కారణం ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే. వివిధ సంస్కరణల అమలు కారణంగా భారతీయుల జీవనశైలిని మెరుగపర్చడంలో మోదీ నిబద్ధతకు ఇది అద్దం పడుతుంది. వ్యాపారానికి మంచి వాతావరణం ఉంటే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వ్యాపారావకాశాలు మెరుగవుతాయి. ముఖ్యంగా చిన్న, మధ్యస్థాయి పరిశ్రమలకు వరంగా మారుతుంది. చాలా ఏళ్లుగా 130వ స్థానంలో ఉన్న భారత్ యూపీఏ హయాంలో 142కు చేరింది. ఇప్పుడు సుపరిపాలనతో పాటు సంస్కరణల కారణంగా భారత ర్యాంకు 100కు చేరింది."

**-అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు**



పరోపకారమే పుణ్యం, పర పీడనమే పాపం. - శ్రీ విద్యా ప్రకాశనందగిరి స్వామి




# పిల్లలతో పాటు పెద్దలూ ఆడాలి

**అక్టోబర్ 29న ఆకాశవాణిలో ప్రసారమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ (మనసులో మాట)లో అనేక అంశాలను ప్రస్తావించారు. ఖాదీ అమ్మకాలు, సైనికుల త్యాగాలు, జీవనశైలి వ్యాధులు, క్రీడా విజయాలపై మోదీ ప్రజలతో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ ప్రసంగంలోని ముఖ్యాంశాలు.**

- గాంధీ జయంతి సమయంలో ఖాదీ, చేనేతలకు వకాల్తా పుచ్చుకున్నందుకు ఈ అక్టోబర్ 17 అంటే ధన్‌తేరస్ రోజున దిల్లీలోని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల భవనంలోని ఖాదీ దుకాణంలో రికార్డ్ స్థాయిలో, దాదాపు రూ.1.2 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయట. ఖాదీ, చేనేత అమ్మకాలూ ఇంత పెద్ద ఎత్తున జరగడమనేది ఆనందకరమైన విషయం. దీపావళి సమయంలో ఖాదీ గిఫ్ట్ కూపన్ల అమ్మకాలలో దాదాపు 680 శాతం వృద్ధి నమోదైంది. ఖాదీ, హస్తకళల అమ్మకాలలో గత ఏడాది కన్నా ఈ సంవత్సరం దాదాపు 90 శాతం వృద్ధి నమోదైంది. ఈ మధ్య అన్ని వయసుల వారూ ఖాదీ, చేనేతలను ఇష్టపడుతున్నారు. దీనివల్ల పేద నేత కుటుంబాలకు ఎంత లాభం చేకూరుతుందో నేను ఊహించగలను. ఇంతకు ముందు "ఖాదీ ఫర్ నేషన్" అనేవారు. నేను "ఖాదీ ఫర్ ఫ్యాషన్" అన్నాను.
- ఈ సారి దీపావళిని జమ్మూ కశ్మీర్‌లోని గురేజ్ సెక్టార్‌లోని భద్రతాదళాలతో జరుపుకోవడం మరచిపోలేని అనుభూతి. దేశ సరిహద్దుల్లో ఎంత కఠిన, విషమ మరిస్థితులను ఎదుర్కొంటూ మన భద్రతా దళాలు దేశాన్ని రక్షిస్తూ ఉంటాయి. ఆ సంఘర్షణకూ, సమర్పణా భావానికీ, త్యాగానికి నేను దేశ ప్రజలందరి తరఫునా మన భద్రతా దళాలలోని ప్రతి సైనికుడినీ గౌరవిస్తాను. మన భద్రతా దళాలలోని సైనికులు కేవలం సరిహద్దుల్లోనే కాక ప్రపంచమంతటా శాంతి స్థాపన చెయ్యడమనే ముఖ్యమైన పాత్రని నిర్వర్తిస్తున్నారన్న సంగతి మనలో చాలామందికి తెలీదు. ఐక్యరాజ్యసమితిలో శాంతి పరిరక్షకులుగా వారు భారతదేశం పేరుని ప్రపంచమంతటా మారుమోగిస్తున్నారు.
- నిస్వార్థంతో మానవసేవ చేసిన మహానుభావులతో మన పుణ్య భూమి నిండి ఉంది. సిస్టర్ నివేదిత కూడా అటువంటి అసాధారణ వ్యక్తులలో ఒకరు. ఆవిడ ఐర్లాండ్‌లో మార్గరెట్ ఎలిజబెత్ నోబుల్ పేరుతో జన్మించింది. స్వామి వివేకానంద ఆవిడకు నివేదిత అనే పేరుని ఇచ్చారు. నివేదిత అంటే పూర్ణ రూపంతో సమర్పణ చేయడం అని అర్థం. తర్వాత ఆవిడ ఆ పేరుని సార్థకం చేసుకున్నారు. నిన్న(అక్టోబర్ 28) సిస్టర్ నివేదిత 150వ జయంతి. ఆవిడ సుఖవంతమైన జీవితాన్ని త్యాగం చేసి, పేదల సేవ కోసం అంకితమైంది. సోదరి నివేదిత భారతీయ సంస్కృతి గౌరవాన్ని పునఃస్థాపితం చేశారు. జాతీయ స్పృహని జాగృతం చేసి ప్రజలను ఏకం చేయడానికి పనిచేశారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు వెళ్లి సనాతన ధర్మం, తత్వశాస్త్రంపై జరుగుతున్న చెడు ప్రచారాలకు వ్యతిరేకంగా గళమెత్తారు.
- ఇదివంకు వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులు ఇప్పుడు పిల్లల్లో కూడా కనబడుతున్నాయి. పిల్లలకు కూడా మధుమేహం వస్తోందని వింటూంటే చాలా ఆశ్చర్యమేస్తుంది. గతంలో ఇలాంటి వ్యాధులు కేవలం ధనవంతులకూ, విలాసంగా జీవించేవారికి మాత్రమే వస్తూండేవి. యువతలో అరుదుగా ఉండేది. మన ఆహార వ్యవహార పద్ధతుల్లో మార్పులు, జీవితంలో తగినంత శారీరక శ్రమ లేకపోవడమే పిన్న వయసులోనే ఇలాంటి వ్యాధులు రావడానికి ముఖ్య కారణం. కుటుంబసభ్యులు అప్రమత్తతతో తమ పిల్లలను మైదానాలలో ఆడుకునే అలవాటు చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. వీలైతే పెద్దలు కూడా పిల్లలతో పాటూ మైదానంలోకి వెళ్ళి ఆడే ప్రయత్నం చెయ్యాలి. పిల్లలను లిఫ్ట్ ఉపయోగించకుండా, మెట్లు అలవాటు చెయ్యాలి. డిన్నర్ తరువాత కుటుంబంలో అందరూ, పిల్లలను తీసుకుని నడకకు వెళ్ళే ప్రయత్నం చెయ్యాలి.
- యువతీయువకులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడానికి, జీవనశైలి రుగ్మత నుండి తమను తాము కాపాడుకోడానికి యోగా ఉపయోగకరంగా ఉంటుంది. పాఠశాల ప్రారంభానికి ముందుగా 30 నిమిషాల యోగా ఎంతో లాభదాయకం. ఇంట్లోనూ యోగా చేయచ్చు. ఏ వయసువారైనా సులువుగా యోగా చేసేయగలరు. ఎవరైనా సులువుగా నేర్చుకోవచ్చు. ఆయుర్వేదాన్నీ, యోగానీ మనం కేవలం వ్యాధినిరోధక మాధ్యమాలుగా మాత్రమే చూడకూడదు. వాటిని మన జీవితంలో భాగం చేసుకోవాలి.
- మన హాకీజట్టు పదేళ్ల తరువాత ఆసియా కప్ చాంపియన్‌షిప్ సాధించింది. ఇంతకుముందు భారతదేశం 2003, 2007లో ఆసియా కప్ ఛాంపియన్ అయ్యింది. బ్యాడ్మింటన్ స్టార్ కిదాంబి శ్రీకాంత్ ఉత్తమమైన ఆటను ప్రదర్శించి డెన్మార్క్ ఓపెన్ గెలుచుకుని ప్రతి భారతీయుడు గర్వపడేలా చేశాడు. ఇండోనేషియా ఓపెన్, ఆస్ట్రేలియా ఓపెన్ తర్వాత ఇది అతని మూడో సూపర్ సిరీస్. భారతదేశ గౌరవాన్ని పెంచినందుకూ యువ హీరోకి అభినందనలు తెలుపుతున్నాను.

**–జనసందేశ్ ప్రతినిధి**




# గుజరాత్, హిమాచల్ ఎన్నికల ఫలితాల తరువాత కాంగ్రెస్ మారుతుందా?

• కర్రావు

గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఎన్నికల నగారా మోగింది. ఎవరు గెలుస్తారన్న విషయంలో ఎవరికీ సందేహం లేదు. ఏ పార్టీ వ్యవస్థాగతంగా నానాటికీ బలపడుతోందో, ఎవరి సంస్థాగత నిర్మాణం ఎలాంటిదో, ప్రజలు ఏం ఆలోచిస్తున్నారో, ఓటర్లు ఏయే విషయాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారో పండితులే కాదు, పామరులకూ తెలుసు.

ఫలితం ముందే తెలిసినా గోదాలోకి తమ వాడిని దింపిన వారు "అదీ దెబ్బ.. అలా ఉండాలి" అంటూ పక్కన నిలుచుని అరుస్తుంటారు. తమ వస్తాదు చావగొడతానంటాడు కానీ లేవలేడన్న సంగతి తెలిసినా వీళ్లంతా జబ్బలు, తొడలు చరిచి చరిచి పుండ్లు చేసుకుంటారు. ప్రస్తుతం ఈ రెండు రాష్ట్రాల్లోనూ జరుగుతున్నది అదే. ఒక వర్గం మీడియా, అవుటాఫ్ వర్క్ కుహనా మేధావులు, కొందరు రిటైర్డ్ రాజకీయ పక్షులు "ఏమో కాంగ్రెస్ కుంటిగుర్రం ఎగరావచ్చు" అని కలలు కంటున్నారు. కానీ వారికి ఏం జరుగుతుందో చాలా బాగా తెలుసు.

గుజరాత్‌లో ఎన్నికలు జరిగే ప్రతిసారీ పాచిపోయిన పాత కథల్నే కాంగ్రెస్ మళ్లీ మళ్లీ చెబుతూ ఉంటుంది. పటేల్ వర్గం బిజెపి నుంచి దూరమైపోతోంది అన్నది ఇలాంటి పాత కథల్లో ఒకటి. ముస్లింలు బిజెపికి ఓటు వేయరు. ఇది రెండో కథ. బీసీలు, ఎస్సీలు బిజెపిని ఓడించేస్తారు. ఇది మూడో కథ. ఈ సారి ఈ కథలకు కొత్త కథ జోడైంది. అదేమిటంటే జీఎస్టీ, నోట్లరద్దుపై వ్యాపార వర్గం బిజెపికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉంది. పాత కథల పరిస్థితి ఏమిటో ఈ కథ పరిస్థితీ అంతే!

వాస్తవం ఏమిటంటే గుజరాత్‌లో కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరకడం లేదు. ముస్లింలు బిజెపి టికెట్ల కోసం పోటీ పడుతున్నారు. పటేల్ వర్గం వెళ్తే గత అసెంబ్లీ ఎన్నికల్లోనే బిజెపికి దూరం వెళ్లి ఉండాలి. ఎందుకంటే కేశూభాయి పటేల్‌ను మించిన పటేల్ నేత ఎవరున్నారు. గుజరాత్‌లో కులాల కుంపటి కాంగ్రెస్ పార్టీ రగిల్చింది. క్షత్రియ (కె), హరిజన్ (హెచ్), ఆదివాసి (ఏ) ముస్లిం (ఎం) ల పేరిట ఖామ్ (**KHAM**) రాజకీయాల కుంపటిని రాజేసింది కాంగ్రెసే. గత పాతికేళ్ల బిజెపి పాలన ఈ కుల రాజకీయాలకు స్వస్తిపలికింది. ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్నది ఎప్పుడో చచ్చిపోయిన కులరాజకీయాల శవపూజ మాత్రమే.

నిజానికి అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ దగ్గర మూడు కార్డులే ఉన్నాయి. ఒకటి కుల కుంపట్ల కార్డు. రెండోది మత మారణహోమం కార్డు. మూడోది ప్రాంతీయ వాదం. గుజరాత్‌లోనూ కాంగ్రెస్ ఈ మూడు కార్డులను ప్లేచేసేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఈ పాతచింతకాయ పచ్చడి మూస ధోరణికి గుజరాత్ స్వస్తి చెప్పి పాతికేళ్లు దాటిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న పంజాబ్, కర్నాటకలను చూస్తే కాంగ్రెస్ మూడు ముక్కల రాజకీయం అర్థమవుతుంది.

**గుజరాత్‌లో కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరకడం లేదు. ముస్లింలు బిజెపి టికెట్ల కోసం పోటీ పడుతున్నారు. పటేల్ వర్గం వెళ్తే గత అసెంబ్లీ ఎన్నికల్లోనే బిజెపికి దూరం వెళ్లి ఉండాలి. ఎందుకంటే కేశూభాయి పటేల్‌ను మించిన పటేల్ నేత ఎవరున్నారు.**

ఇన్నేళ్లుగా పంజాబ్‌లో హిందూ సిక్కు వివాదం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నలుగురు హిందూ నేతలను ఖలిస్థానీలు హత్య చేశారు. లక్ష్యం ఒక్కటే. హిందువులు, సిక్కుల మధ్య అగ్గి రాజేయాలి. కర్నాటకలో లింగాయత్‌లను బిజెపి నుంచి వేరు చేయాలి. దాని కోసం కాంగ్రెస్ పడరాని పాట్లు పడుతోంది. కుల విద్వేషాలను రెచ్చగొడుతోంది. గౌరీ లంకేశ్, కల్బుర్గి వంటి సంఘటనలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో కాకుండా కర్నాటకలోనే ఎందుకు జరుగుతున్నాయన్నది గమనించాలి. గుజరాత్‌లో హార్దిక్, జిగ్నేష్, అల్పేష్ పేరిట కుల చిచ్చు ఎవరు రగిలిస్తున్నారు? వారికి ప్రోత్సాహం ఎవరు ఇస్తున్నారన్నది బహిరంగ రహస్యం. తమ తమ కులాల వారి ఆలోచనా ధోరణి అర్థమైన ఈ నేతల స్వరం కూడా ఇప్పుడు మారుతోందన్నది సుస్పష్టం. కాంగ్రెస్‌కు పటేల్ రిజ్వరేషన్ల విషయంలో హార్దిక్ పటేల్ అల్టిమేటం ఇవ్వడానికి కారణం కూడా ఇదే. తాను కాంగ్రెస్‌తో కుమ్మక్కు కాలేదని అల్పేష్ పదే పదే సంజాయిషీలు ఎందుకు ఇచ్చుకోవాల్సి వస్తోంది?

నిజానికి గుజరాత్ ఎన్నికలు దేశంలో రాజకీయ ఆలోచనా విధానంలో ఏ మేరకు మార్పు వచ్చిందో రుజువు చేయబోతున్నాయి. ఓటు ప్రయోజనాల కన్నా దేశ ప్రయోజనాలకు ప్రజలు పెద్ద పీట వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీల బాలారిష్టాలను దాటి తాము ఆలోచించగలమని ప్రజలు చెప్పబోతున్నారు. కులం, మతం, ప్రాంత విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయానికి సమాధి చేసేంత పరిణితి తమలో ఉందని వారు నిరూపించబోతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తరువాత ఇదే రుజువవుతుంది.

హిమాలయాల పొత్తిళ్లలో పసికూనలా ఉండే హిమాచల్ ప్రదేశ్‌లోనూ ఇదే జరగబోతోంది. కాంగ్రెస్ కుల రాజకీయాల కుంపటిని రాజేసింది. పహాడీలకు పంజాబీలకు మధ్య చిచ్చు పెట్టేందుకు యత్నాలు ప్రారంభించింది. బ్రాహ్మణ క్షత్రియ వివాదాలను పెంచి పోషిస్తోంది. అవినీతి నేత వీరభద్ర సింగ్ ఆధ్వర్యంలోనే మరోసారి ఎన్నికల బరిలోకి దిగింది. హిమాచల్‌లో వెలువడుతున్న ప్రజాభిప్రాయ సర్వేలు కూడా అక్కడ బిజెపి అప్రతిహత విజయం సాధిస్తుందని స్పష్టంగా చెబుతున్నాయి. అక్కడి ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగి వేసారిపోయి ఉన్నారు. బిజెపి కూడా అక్కడ ప్రేమ్ కుమార్ ధుమల్ నాయకత్వంలో ఎన్నికల బరిలోకి దిగింది.

రెండు రాష్ట్రాల్లోనూ తమకు ఓటమి తప్పదని కాంగ్రెస్ పార్టీకి తెలుసు. దానిని భుజాన మోస్తున్న కుహనా సెక్యులర్లకూ తెలుసు. అందుకే వారి అసహనం కట్టలు దాటుతోంది. కళ్లు తెరిచి నిద్రపోయి పగటికలలు కనే వ్యాధి కూడా పెరిగిపోతోంది. ఈ ఎన్నికల ఫలితాల తరువాత కాంగ్రెస్‌లో మార్పు వస్తుందా? ఖచ్చితంగా రాదు. కర్నాటక ఎన్నికల్లో మళ్లీ ఇదే మూడు ముక్కలాట ఆడకపోతే, దాని తాబేదార్లు చెక్క భజన చేయకపోతే నన్ను అడగండి.■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. – స్వామి వివేకానంద




## కశ్మీర్‌లో మధ్యవర్తిగా దినేశ్వర్ శర్మ:

# పరిష్కారం దిశగా ముందడుగు


• సుధా కస్తూరి

జమ్మూ కశ్మీర్‌లో వివిధ వర్గాలతో చర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం మాజీ ఇంటలిజెన్స్ బ్యూరో చీఫ్ దినేశ్వర్ శర్మను నియమించింది. ఈ నిర్ణయం బిజెపి ప్రభుత్వం జమ్మూ కశ్మీర్ విషయంలో అనుసరిస్తున్న స్పష్టమైన విధానంలో మరో కీలకమైన మెట్టు. దినేశ్వర్ శర్మ జమ్మూ కశ్మీర్‌లో చాలా కాలం గడిపిన వ్యక్తి. ఆయనకు రాష్ట్రం విషయంలో పూర్తి అవగాహన ఉంది. నాయకులు, వివిధ పక్షాలతో ఆయనకు సత్సంబంధాలున్నాయి. పరిస్థితుల గురించి ఆయనకు పూర్తిగా తెలుసు. ఇంతవరకూ రాజకీయ నాయకుడినో లేక జర్నలిస్టునో కాకపోతే ప్రొఫెసర్‌నో చర్చలు జరిపేందుకు నియమించే పద్ధతి ఉండేది. దీని వల్ల వారు తమకు తెలిసిన కోణం నుంచే విషయ పరిశీలన చేసేవారు. కానీ శర్మ జమ్మూ కశ్మీర్ విషయంలో లోతైన అవగాహన ఉన్న వ్యక్తి. ఫలితంగా ఆయన విషయాన్ని చూసే దృక్పథం కూడా వేరుగా ఉంటుంది.

నిజానికి జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదం తిరోగమనంలో ఉంది. ఉగ్రవాద నేతలు ఒక్కొక్కరుగా హతం అవుతున్నారు. జమ్మూ లడాఖ్ ప్రాంతాలలో ఈ రోజు ఉగ్రవాదం ఛాయలు కూడా లేవు. కశ్మీర్ డివిజన్‌లోని గురెజ్, లోలాబ్ లోయల్లోనూ స్థానికుల నుంచి ఉగ్రవాదానికి ఎలాంటి మద్దతూ లేదు. కేవలం కశ్మీర్ లోయలోని దక్షిణ భాగంలోని నాలుగైదు జిల్లాల్లో మాత్రమే ఇప్పుడు ఉగ్రవాదానికి ఎంతో కొంత మద్దతు ఉంది. మరో వైపు భద్రతాదళాలపై రాళ్లు విసరడం కూడా దాదాపు ఆగిపోయింది. వేర్పాటువాదులకు పాకిస్థాన్ నుంచి అందుతున్న ఆర్థిక సహాయం కూడా ఆగిపోయింది. జాతీయ దర్యాప్తు బృందం ఇప్పుడు హురియత్ నేలకు పాకిస్థానీ ఐఎస్ఐకి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలను భగ్నం చేసింది. దీంతో హురియత్ నేతలకు దిక్కు తోచడం లేదు. పెద్ద పెద్ద నేతల కుటుంబసభ్యుల చీకటి లావాదేవీలు బట్టబయలు కావడంతో సగటు కశ్మీరీ వారిని అసహ్యించుకుంటున్నాడు. హురియత్ పిలుపునకు సగటు కశ్మీరీ స్పందించడం మానేశాడు. ఇటీవల ప్రముఖ గాయకుడు అద్నాన్ సమీ ఒక సంగీత విభావరి నిర్వహించేందుకు శ్రీనగర్ వచ్చారు. ఆయన సంగీత కార్యక్రమం జరిగితే కశ్మీర్ లోయలో మామూలు పరిస్థితులు ఉన్నాయన్న భావన కలుగుతుందని హురియత్ దానిని బహిష్కరించింది. కానీ హురియత్ నేతల మాటను కశ్మీరీలు వినలేదు. భారీ సంఖ్యలో కశ్మీరీలు ఈ సంగీత విభావరిలో పాల్గొన్నారు. కశ్మీరీ లోయ యువకులు సైన్యంలో చేరేందుకు, పోలీసుల్లో బర్తీ అయ్యేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన పోలీసుల అంత్యక్రియలకు కశ్మీరీలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. వీరంతా హురియత్‌ను లెక్క చేయడం లేదు. మరోవైపు పాకిస్థాన్ నుంచి ఉగ్రవాదులను ఎగుమతి చేయడం కూడా ఇదివరకు లాగా అంత సులభం కాదు. సరిహద్దుల్లో మన సైన్యం దీటైన జవాబు ఇస్తోంది. నియంత్రణ రేఖ వద్ద మన సైన్యం చాలా దృఢంగా వ్యవహరించడంతో పాకిస్థాన్ పన్నాగాలు సఫలం కావడం లేదు.

కాబట్టి ఇదే చర్చల ప్రక్రియ ప్రారంభించడానికి సరైన అదను. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కంపాశన్ (ఆప్యాయత), కమ్యూనికేషన్ (సంవాదం), కో ఎగ్జిస్టెన్స్ (సహజీవనం), కాన్ఫిడెన్స్ బిల్డింగ్ (విశ్వాస నిర్మాణం), కన్సిస్టెన్సీ (స్పష్ట విధానం) ఆధారంగా జమ్మూ కశ్మీర్ విధానం ఉంటుందని స్పష్టం చేశారు. కశ్మీర్ సమస్య భారత్ అంతర్గత సమస్య అన్న స్పష్టమైన సంకేతం వెళ్లేలా కేంద్ర హోంమంత్రి ఈ మధ్యవర్తిని ప్రకటించారు. భారత రాజ్యాంగానికి లోబడి అన్ని అంశాలను అందరితో చర్చిస్తామని స్పష్టం చేశారు. 2010లో మన్మోహన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంటర్ లాక్యూటర్లు (మధ్యవర్తులు) కేవలం పరిస్థితిని చల్లబరిచేందుకు ఏర్పాటయ్యారు. వారి పని కూడా కేవలం కాలహరణం చేయడానికే జరిగింది. రెండేళ్ల తరువాత వారు తమ రిపోర్టును ఇచ్చారు. ఈ మధ్య కాలంలో ముగ్గురు మధ్యవర్తులు– దిలీప్ పాడ్గావ్‌కర్, రాధా కుమార్, ఎం.ఎం.అన్సారీలు బహిరంగంగా కొట్టుకున్నారు. తిట్టుకున్నారు. చాలా విషయాలపై ముగ్గురికీ ఏకాభిప్రాయం కుదరలేదు. రెండేళ్ల తరువాత రిపోర్టు వచ్చాక చూస్తే రిపోర్టు చెప్పిందేమీ లేదు. దీనికి భిన్నంగా ప్రస్తుతం నిర్ణయించిన మధ్యవర్తి నేరుగా హోం మంత్రితో, కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తారు. రాష్ట్రంలోని వివిధ వర్గాలతో చర్చించి, వారి అభిప్రాయాలను తెలియచేస్తారు. ఇంతకు ముందరి కమిటీలో లాగా భేదాభిప్రాయాలకు తావుండదు. కాలయాపన ఈ కమిటీ లక్ష్యం కాదు. దీర్ఘకాలిక యోజనలో భాగంగా ఈ కమిటీ నియామకం జరిగింది. నివేదికలోని అంశాలు అమలుకు నోచుకునే లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గతంలోని కమిటీని దాదాపు 550 సంస్థలు, ప్రతినిధులు కలిశారు. వీరిలో 500కు పైగా సంస్థలు ఆజాదీని కోరలేదు. కానీ నివేదిక వేర్పాటును కోరే యాభై మంది మాటనే జనం మాటగా నివేదికనిచ్చింది. ఈ సారి నివేదిక అలా పక్షపాతపూరితంగా ఉండదు. అంతేకాదు స్పష్టమైన పరిష్కార మార్గాలను సూచిస్తుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకునే అవకాశమే ఉంది తప్ప గతంలో లాగా నివేదిక బుట్టదాఖలయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

హురియత్ తదితర సంస్థలు ఇప్పటికే ఈ నిర్ణయం పట్ల విషం కక్కుతున్నాయి. హురియత్‌ను కలుపుకోకపోతే ఈ మధ్యవర్తి యత్నం విఫలమౌతుందని కుహనా మేధావులు కొందరు శాపనార్థాలు పెడుతున్నారు. వారు గమనించాల్సిన విషయం ఏమిటంటే యూపీఏ పెట్టిన హురియత్ అనుకూల మధ్యవర్తుల కమిటీని కూడా హురియత్ నేతలు బహిష్కరించారు. దాని ముందు ఉగ్రవాదులెవరూ హాజరు కాలేదు. కాబట్టి ఆ ప్రయత్నం గొప్పదని, ఈ ప్రయత్నం పనికిమాలినదని చెప్పడం కూడా పొరబాటే అవుతుంది. లోతుగా ఆలోచించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఏర్పడ్డ ఈ మధ్యవర్తి వ్యవస్థ కశ్మీర్ లోయలో శాంతియుత పరిస్థితులు ఏర్పడేందుకు దోహదం చేస్తుందన్న నమ్మకం కలుగుతోంది. ■




# హామీలు తుంగలో తొక్కడం కాంగ్రెస్ నైజం

● వీరేంద్ర కపూర్

ఉద్యోగ కల్పనకు సంబంధించి హామీని నిలబెట్టుకొనే విషయంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని, ఆ పార్టీకి గుణపాఠం నేర్పాలంటూ గుజరాత్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రజల్ని కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ కోరుతున్నారు. 1952నాటి తొలి లోక్‌సభ ఎన్నికలు మొదలుకొని ఇటీవలి కాలం వరకు ఓటర్లకు తన తండ్రి, నాన్నమ్మ, ముత్తాత ఇస్తూ వచ్చిన హామీలను, వాటిని వారే తుంగలో తొక్కిన వైనాన్నీ ఆయన ఒక్కసారి గుర్తుచేసుకొంటే మంచిది. వాస్తవంలో జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ తమ ఎన్నికల హామీలను నిలబెట్టుకొని ఉంటే పెద్దస్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ కొత్తగా హామీ ఇవ్వాల్సిన అవసరం మోదీకి ఉండేదే కాదు. ఆ నాయకులే తమ హామీలు నెరవేర్చుకొని ఉంటే, దేశం నేడు ఎంతో సుభిక్షంగా ఉండేది. సామ్యవాదం సాధిస్తామంటూ ఉద్ఘోషించిన నెహ్రూ హయాంలోనే మూడోవంతు భారతీయులు దారిద్ర్యరేఖకు దిగువన జీవించారు. ఆయన సుదీర్ఘ పరిపాలన సాగినంతకాలం ఆకలి, పేదరికం దేశాన్ని పట్టిపీడిస్తూనే ఉండటం దురదృష్టకరం.

తరవాత, నెహ్రూ కుమార్తె ఇందిరాగాంధీ వంతు వచ్చింది. పాత కాంగ్రెస్ నాయకులు ఆమెను 'మూగపిల్ల'గా భావించారు. ఆమెకు పెద్దగా గొంతు లేదని, ఆమెను అడ్డుపెట్టుకొని ప్రధాని పదవి కోసం తమ ప్రయత్నాలు తాము సాగించవచ్చునని అనుకొన్నారు. అందుకే ఆమెను తెరపైకి తెచ్చారు. నిజానికి ఆనాటి సిండికేట్ నాయకులు ముక్కుసూటి మనుషులు. వారు తలచిందొకటి, జరిగింది మరొకటి. కొంత కుదురుకున్న తరవాత, పి.ఎన్.హక్సర్, పి.ఎన్.ధార్ వంటి జిత్తులమారి సలహాదారులను ఆమె చేరదీశారు. దరిమిలా తిరుగులేని నాయకురాలిగా ఆవిర్భవించారు. 'గరీబీ హటావో' నినాదంతో ఆమె 1971 ఎన్నికల్లో అద్భుత విజయం సాధించారు. పేదరికం ఈ దేశం నుంచి ఇంకా ఎందుకు తొలగిపోలేదో ఆమె మనవడే చెప్పాలి!

ఇక, రాజీవ్‌గాంధీ సంగతి. కొత్త ఆశలకు ఊపిరిపోస్తూ రాజకీయ రంగప్రవేశం చేసిన ఆయన, 1984 ఎన్నికల్లో విజయం సాధించారు. ఇందిరాగాంధీ దారుణ హత్య అనంతరం దేశంలో తీవ్ర ఉద్రిక్త, ఉద్విగ్న పరిస్థితి ఏర్పడింది. రాజీవ్ నిర్వహించిన ఇందిరాగాంధీ అంత్యక్రియలను, 'నెత్తుటికి బదులు నెత్తురు' అంటూ ఆ సమయంలో ప్రజలు ఊగిపోతున్న దృశ్యాలను ప్రభుత్వ నియంత్రణలోని దూరదర్శన్ అదే పనిగా పదేపదే ప్రసారం చేయడం ద్వారా సానుభూతి పవనాలకు వూపు తెచ్చింది. ముఖ్యంగా అధిక సంఖ్యాక వర్గంలో ఉప్పొంగిన భావావేశం రాజీవ్‌పై ఓట్లవర్షం కురిపించింది. కానీ, బోఫోర్స్ కుంభకోణం కారణంగా ఆయన ప్రభ త్వరలోనే మసకబారింది.

యూపీఏ హయాంలోనే ఇదివరకెన్నడూ లేనంత పెద్దసంఖ్యలో, తీవ్రస్థాయి కుంభకోణాలు చోటుచేసుకున్నాయి. కుంభకోణాలు, అక్రమాల విషయంలో కాంగ్రెస్ పార్టీ తన పాత చరిత్రను తానే తిరగరాసుకొంది. కేంద్రం మొదలు ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల వరకు దాదాపు ప్రతి మంత్రిత్వ శాఖ, విభాగమూ అవినీతికి చిరునామాగా మారింది.

2004 ఎన్నికల నాటి మాట. అవినీతిని, నల్లధనాన్ని కూకటివేళ్లతో పెకలించివేస్తామని ఆ సందర్భంగా తన ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ అందుకు పూర్తిగా భిన్నమైన దారిలో సాగింది. యూపీఏ హయాంలోనే ఇదివరకెన్నడూ లేనంత పెద్దసంఖ్యలో, తీవ్రస్థాయి కుంభకోణాలు చోటుచేసుకున్నాయి. కుంభకోణాలు, అక్రమాల విషయంలో కాంగ్రెస్ పార్టీ తన పాత చరిత్రను తానే తిరగరాసుకొంది. కేంద్రం మొదలు ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల వరకు దాదాపు ప్రతి మంత్రిత్వ శాఖ, విభాగమూ అవినీతికి చిరునామాగా మారింది. ఇక్కడ చాలా పాత విషయం ఒకటి చెప్పుకోవాలి. 1935 నాటి భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి 1936–37లో బ్రిటిష్ ఇండియాలోని 11 ప్రాంతాల్లో (అప్పట్లో వాటిని రాష్ట్రాలు అని కాకుండా ప్రావిన్స్‌లు అనేవారు) ఎన్నికలు జరిగాయి. అవి– మద్రాసు, సెంట్రల్ ప్రావిన్సెస్, బిహార్, ఒడిశా, యునైటెడ్ ప్రావిన్సెస్, బొంబాయి ప్రెసిడెన్సీ, అస్సాం, ఎన్‌డబ్ల్యూఎఫ్‌పీ, బెంగాల్, పంజాబ్, సింధ్... వాటిలో యునైటెడ్ ప్రావిన్సెస్, మద్రాసు, సెంట్రల్ ప్రావిన్సెస్, బొంబాయి, బిహార్, ఒడిశా తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పాటయ్యాయి. ఆ కాంగ్రెస్ మంత్రుల్లో కొందరు అవినీతికి పాల్పడినట్లు వార్తలు రావడంతో ఖిన్నులైన మహాత్మాగాంధీ, కాంగ్రెస్ పార్టీ నుంచి వైదొలగుతానని హెచ్చరించిన విషయాన్ని పాత తరం నాయకులు ఇప్పటికీ గుర్తు చేసుకొంటారు. స్వాతంత్ర్యోద్యమం పతాక స్థాయికి చేరిన సమయమది. దానివల్ల దేశ విముక్తి పోరాటం నీరుగారి పోతుందని భయపడిన ఆనాటి నాయకులు, కాంగ్రెస్‌ను వదలి వెళ్లకుండా మహాత్మాగాంధీకి నచ్చజెప్పారు. అవినీతి విషయంలో అంత కరాఖండీగా ఉండేవారాయన. ఆనాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ ప్రస్థానం ఏ రీతిలో సాగిందో, అవినీతి విషయంలో ఆ పార్టీ ఏ స్థాయి పురోగతి సాధించిందో కళ్లకు కనిపిస్తూనే ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ఓటర్లకు ఇచ్చిన హామీలకు తిలోదకాలు వదలి, సొంతలాభం చూసుకొన్న ఫలితంగానే పరిస్థితి నేడు ఇంతగా దిగజారిపోయిందనడంలో మరోమాట లేదు.

వాస్తవంలో, ఎన్నికల హామీలు అమలులోకి వచ్చిన సందర్భాలు పెద్దగా కనబడవు. పశ్చిమ బంగను 30 ఏళ్లకు పైగా పరిపాలించిన కమ్యూనిస్టులూ అలాంటి హామీలే గుప్పించారు. అయినా నిరుద్యోగాన్ని, పేదరికాన్ని తగ్గించలేక పోయారు. పశ్చిమ దేశాల్లో సైతం ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలు జరుగుతున్న దాఖలాలు లేవు. రష్యా, చైనా వంటి దేశాల్లో సైతం నాయకులు ఇచ్చే హామీలు, సత్వరం అమలులోకి రావడం లేదు. ■



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. – గాంధీ

జనవాణి

# ఉత్త ప్రకటనలే..! నియామకాలేవి..?



ఏనుగుల రాకేష్ రెడ్డి
బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి

టీఆర్ఎస్ అసమర్థ పాలనతో తెలంగాణ వచ్చినా నిరుద్యోగులకు కొలువులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇంటికో ఉద్యోగం అంటూ ఆశ పెట్టి ఓట్లు దండుకున్న కేసీఆర్ నిరుద్యోగుల గోడు పట్టించుకోవడం లేదు. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి కీలక పాత్ర పోషించిన యువతను కేసీఆర్ పూర్తిగా విస్మరిస్తున్నారు.

కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆగస్టు 8, 2014న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్పీఎస్సీ)ను ఏర్పాటు చేశారు. టీఎస్పీఎస్సీ ద్వారా 1,07,000 ఉద్యోగాలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చెప్తే అందరూ సంతోషించారు. కానీ మూడేళ్లు పూర్తయినా టీఎస్పీఎస్సీ ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఉద్యోగాల్లో ఖాళీలను మాత్రం భర్తీ చేయడం లేదు. ప్రభుత్వ శాఖల్లో రెండున్నర లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది 16 వేలు మాత్రమే. సీఎం అసెంబ్లీలో, బయటా త్వరలో ఉద్యోగాలిస్తాం అంటారే కానీ ఆ 'త్వరలో' ఎప్పుడనేది చెప్పరు. అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు దాటినా కేసీఆర్ చెప్పే 'త్వరలో'కు ముహూర్తం కుదరలేదేమో..!?

ఈ రోజు ఏ డిపార్ట్‌మెంట్ చూసినా, ఏ కార్యాలయం చూసినా కొనేళ్ల నుండి ఖాళీలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోయి ఉన్నాయి. రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌కి ఏదైనా పని కోసం వెళ్తే నెలలకు నెలలు సమయం పడుతుంది. ఎందుకని అడిగితే, స్టాఫ్ లేరనే సమాధానం వినిపిస్తుంది. సివిల్ సప్లైస్‌లో, వైద్యారోగ్య శాఖలో, ఉద్యానవన శాఖలో, స్కూళ్లలో, జూనియర్ కాలేజీలలో, డిగ్రీ కాలేజీలలో, యూనివర్సిటీల్లో, అన్ని చోట్ల వేల సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. దీనికి తోడు ఎప్పటికప్పుడు వేల సంఖ్యలో ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. మరి ఆ ఖాళీలను ఎందుకు భర్తీ చేయడం లేదు? ఒక ఎంపీ రాజీనామా చేస్తే ఆరు నెలలలోపు ఎన్నిక జరిపి కొత్త ఎంపీని ఎన్నుకుంటున్నాం.. దురదృష్టవశాత్తూ ఒక ఎమ్మెల్యే చనిపోతే ఆరు నెలలలోపు కొత్త ఎమ్మెల్యేని ఎన్నుకుంటున్నాం. ఉద్యోగాల విషయంలో ఇన్ని వేల సంఖ్యలో ఖాళీలు ఉంటే ఎందుకు భర్తీ చేయడం లేదు..? ప్రతి సంవత్సరం యూపీఎస్సీ వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేసి ఆ ఏడాదిలో ఎప్పుడెప్పుడు ఏ ఏ నోటిఫికేషన్ ఇస్తుంది, ఎప్పుడు ఏ పరీక్ష ఉంటుంది, ఎప్పుడు ఏ ఉద్యోగాలను భర్తీ చేస్తారు వంటి వివరాలను అందజేసి అభ్యర్థులకు స్పష్టత ఇస్తుంది. తాము కూడా అలాంటి క్యాలెండర్‌ను విడుదల చేస్తామని చెప్పిన టీఎస్పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి దానికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.

తెలంగాణ వచ్చిన తరువాత ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరి డీఎస్సీపై 350 ప్రకటనలు చేశారు. కానీ నోటిఫికేషన్ల జాడ లేదు. తీరా నోటిఫికేషన్ జారీ చేసినా అవీ అరకొర పోస్టులకు మాత్రమే. అందులోనూ లోపాలే. నియామకాలపై అభ్యర్థులను ఊరిస్తూ, మభ్యపెట్టడం తప్ప ఖాళీలను భర్తీ చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు. వారికి వయసు పెరిగి పోతుంది. ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు, నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఉద్యోగ ప్రకటనలు కేవలం కోచింగ్ సెంటర్లను బతికించడానికేనా అన్నట్లుగా ఉన్నాయి. రాష్ట్రంలో 5 లక్షల మంది 100 కోట్ల రూపాయలు వెచ్చిస్తూ కోచింగ్ తీసుకుంటున్నారు.


ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా టీఎస్పీఎస్సీ జారీ చేసిన నోటిఫికేషన్లూ నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో కోర్టుల్లో చిక్కుకుంటున్నాయి. అవగాహనారాహిత్యం, అలసత్వం, నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం, అవినీతి.. ఇవన్నీ టీఎస్పీఎస్సీ సభ్యులకు పర్యాయపదాలుగా మారాయి. ప్రశ్న పత్రాలకు, ఇచ్చే కీ కి సంబంధం లేకుండా ఉండడం, ప్రశ్నపత్రాల్లో తప్పులు దొర్లడం వంటివి టీఎస్పీఎస్సీ పని తీరుకు గీటురాయిలా నిలుస్తున్నాయి. తెలుగు పండిట్లను ఇంగ్లీషులో పరీక్షలు రాయమనడం, పీఈటీలకు బి.పెడ్ డిగ్రీ ఉన్నప్పటికీ అదనంగా జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో సర్టిఫికెట్లు కావలనడం తదితర అనవసర నిబంధనల కారణంగా భర్తీలు నిలిచిపోతున్నాయి. టీఎస్పీఎస్సీ కేవలం ఒక రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది.

ఉద్యోగాలపై ఆశతో అభ్యర్థులు కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలు ధారపోస్తున్నారు. కానీ ప్రభుత్వ దృష్టి నియామకాలపై కాకుండా మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, నీటి ప్రాజెకుల్లాంటి కమిషన్లు వచ్చే వాటి పైనే ఉంది. ఉద్యోగాలను భర్తీ చేస్తే మాకు వచ్చేది ఏముందని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా ఉంది.

ఇప్పటికైనా టీఎస్పీఎస్సీ నియామకాలకు సంబంధించి వార్షిక కేలండర్‌ను విడుదల చేయాలి. అనవసరపు నిబంధనల జోలికి పోకుండా నోటిఫికేషన్లు విడుదల చేయాలి. న్యాయపరమైన చిక్కులు లేకుండా ముందస్తు కసరత్తు చేసిన తరువాతే నోటిఫికేషన్లు జారీ చేయాలి. నోటిఫికేషన్లను మభ్యపెట్టే ధోరణిలో కాకుండా వాస్తవికంగా ప్రకటనలు చేయాలి. అవినీతి అక్రమాలకు ఆస్కారం లేకుండా రిక్రూట్‌మెంట్లు పారదర్శకంగా ఉండాలి.

ఇంటికో ఉద్యోగం అని చెప్పి.., అదిగో, ఇదిగో, త్వరలో నోటిఫికేషన్ అని చెప్తూ, రోజుకో ప్రకటనతో ఊరిస్తూ ఎన్నికల ముందు ఏదో జిమ్మిక్కు చేద్దామనుకుంటున్న ఈ ప్రభుత్వంపై తెలంగాణ యువతకు నమ్మకం పోయింది. కాబట్టే ఓయూలో నిరుద్యోగులు రోడెక్కారు. ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఓయూ శతాబ్ది ఉత్సవాల్లో ముఖ్యమంత్రి కనీసం మాట్లాడలేని పరిస్థితి తలెత్తింది. యూనివర్సిటీల్లో అప్రకటిత 30 యాక్టుకు, కేసులకు తెలంగాణ విద్యార్థులు భయపడరు. తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా రాష్ట్రాన్ని సాధించుకున్న విద్యార్థులకు 30 యాక్ట్ లెక్క కాదు. ఉద్యోగాల కోసం ఉద్యమిస్తున్న యువతకు బిజెపి అండగా నిలుస్తుంది. రాజకీయంగా ముందుండి పోరాడుతుంది. ■

ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడం సాధ్యం కాదు. - బార్కం




# కొత్త సచివాలయంపై కేసీఆర్ మొండిపట్టు

• కృష్ణ చైతన్య

సికింద్రాబాద్ బైసన్ పోలో మైదానంలో రూ.500 కోట్ల వ్యయంతో కొత్త సచివాలయాన్ని కట్టి తీరుతామని, ఈ విషయమై కోర్టు, ఇతరత్రా ఎవరెన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవాల్సిన అవసరం తమకు లేదని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు రాష్ట్ర శాసనసభలో వితండవాదన వినిపించారు. ప్రస్తుతం ఉన్న సచివాలయంలో అవసరమైన మార్పులు చేసుకొనే అవకాశాలు ఉండగా, పేద ప్రజల అవసరాలకు సంబంధించిన ప్రాధాన్య అంశాలను విస్మరించి ప్రభుత్వం సచివాలయం పేరుతో ప్రజాధనం వృథా చేయడం తగదని బిజెపి సభ్యులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో నూతన సచివాలయ భవన నిర్మాణంపై ప్రభుత్వ మొండి వైఖరి పట్ల బిజెపి ఎమ్మెల్యేలు డా॥ కె.లక్ష్మన్, జి.కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ నుండి వాకౌట్ చేశారు.

"మీ అంత తెలివి తేటలు మాకు ఉండలేకపోవచ్చు. మీ అంతటి తెలివైన వారం మేము కాలేక పోవచ్చు. కానీ మేము హైదరాబాద్ నగరంలోని పేద ప్రజల అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాం. ఈ విషయంలో మా వ్యక్తిగత ప్రయోజనాలు అంటూ ఏమీ లేవు. మేము ప్రజల అభిప్రాయాలను మాత్రమే వెల్లడిస్తున్నాం. మీరు వినిపించుకోని పక్షంలో ప్రజా క్షేత్రంలో నిలదీయడం మినహా మేమేమి చేయలేం" అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ శాసనసభలో స్పష్టం చేశారు. బైసన్ పోలో అసలు క్రీడామైదానం కాదంటూ సీఎం కేసీఆర్ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నగరంలో వందలాది క్రీడా మైదానాలు నిరుపయోగంగా ఉన్నాయని స్వయంగా సీఎం చెప్పడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ అనేక అంతర్జాతీయ, ఆసియా స్థాయి క్రీడలకు వేదికైందని, కానీ ఇప్పుడు ఒక్కటి కూడా జరగక పోవడానికి ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. బైసన్ పోలో మైదానం డిఫెన్స్ స్థలమే అయినప్పటికీ ప్రస్తుతం స్పోర్ట్స్ గ్రౌండ్‌గా వాడుకుంటున్నామని, ఇలాంటి స్థలాన్ని సచివాలయానికి వినియోగించుకోవద్దని కొందరు క్రీడాకారులు సైతం కోర్టులో వ్యాజ్యాలు వేశారని డా॥ లక్ష్మన్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతోనే క్రీడామైదానాలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేశారు.

కొత్త సచివాలయం నిర్మాణం కోసం ఉద్దేశించిన స్థలం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ భారత క్రికెట్ మాజీ కెప్టెన్ జయసింహ కుమారుడు, ప్రముఖ క్రీడాకారుడు వివేక్ జయసింహతో పాటు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సైతం హై కోర్టులో దావా వేశారని గుర్తు చేశారు. తాను కూడా ఆ మైదానంలో క్రికెట్ ఆడానంటూ.. సభను, రక్షణ మంత్రిత్వ శాఖను కేసీఆర్ తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శలు గుప్పించారు. "మీ ప్రభుత్వం క్రీడలకు బడ్జెట్‌లో ఏ మాత్రం నిధులు కేటాయిస్తుంది, ఏ మాత్రం ప్రోత్సాహం ఇస్తుందన్న అంశాలపై చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం" అని బిజెపి నేత స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన జరిగిన అనంతరం సచివాలయంలోని సగం పైగా సిబ్బంది, కార్యాలయాలు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోయిన తరువాత ఇప్పుడు ఎంతో స్థలం అందుబాటులోకి వస్తుందని, అక్కడ పార్కింగ్ సదుపాయాలు లేని పక్షంలో, భవనాలు సక్రమంగా లేని పక్షంలో అవసరమైన నూతన నిర్మాణాలు చేపట్టవచ్చు గదా అని ప్రశ్నించారు. "ప్రభుత్వం ప్రతిష్ఠకు పోయి ఇటువంటి అనవసరపు నూతన నిర్మాణాల వైపు దృష్టి సారించకుండా ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోవాలని కోరుతుంటే మమ్ములను ఎగతాళి చేసే విధంగా మాట్లాడటం ముఖ్యమంత్రికి తగదు" అని వారించారు. ప్రజల అభిప్రాయానికి భిన్నంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం ఉన్న సచివాలయం అందరికీ ఆమోదయోగ్యమైన స్థలంలోనే ఉందంటూ కొత్త సచివాలయానికి వెచ్చించాలనుకుంటున్న కోట్ల రూపాయలను అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ హాస్టల్లకు స్వంత భవనాలు నిర్మించుకోవచ్చని సూచించారు. పార్కింగ్ లేదనే పేరుతో రూ.500 కోట్లు ఖర్చుచేస్తామనడం సరికాదన్నారు. బైసన్ పోలో మైదానాన్ని రక్షణ శాఖకే ఉంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు బిజెపి సభ్యులు పేర్కొన్నారు. అయితే ప్రజలు తమ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చారని, తమ ఆలోచనల మేరకే కొత్త నిర్మాణాలు చేబడతామని కేసీఆర్ తన నిరంకుశత్వాన్ని బయట పెట్టుకున్నారు.■




నిరుద్యోగ సమస్యపై నవంబర్ 7న బీజేవైఎం నిర్వహించనున్న 'ఛలో అసెంబ్లీ' పోస్టర్‌ను నవంబర్ 3న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా॥ మనోహర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాపారావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, బీజేవైఎం జాతీయ స్పోర్ట్స్ కమిటీ తూటుపల్లి రవి, అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.




# అక్రమార్కుల కోసం షబ్బీర్ అలీ మధ్యవర్తిత్వం

• ప్రవీణ్

కాంగ్రెస్ అవినీతి కార్యకలాపాలు ఎప్పటికప్పుడు కొత్తగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ అవినీతి వ్యవహారం బయట పడడం కలకలం సృష్టిస్తోంది. ఓ సంస్థను వేల కోట్లు ముంచిన నిందితుడికి బెయిల్ ఇప్పించే విషయంలో ఏకంగా సీబీఐ డైరెక్టర్‌కు ముడుపులు ఇప్పించేందుకు షబ్బీర్ అలీ మధ్యవర్తిత్వం వహించినట్టు ఇప్పుడు వెలుగు చూసింది. షబ్బీర్ అలీతోపాటు అప్పటి కాంగ్రెస్ మంత్రి, ప్రస్తుత వైసీపీ నాయకుడు బొత్స సత్య నారాయణ ప్రమేయం కూడా ఈ దందాలో ఉన్నట్టు బయటపడింది. ఇప్పటికే ఈ కుంభకోణంలో పేర్లన్నీ బయటికి వచ్చినప్పటికీ, ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నుంచి తనకేమీ నోటీసులు రాలేదని షబ్బీర్ అలీ బుకాయిస్తున్నారు. ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో మొయిన్ ఖురేషీపై మనీల్యాండరింగ్ కేసులో దాఖలు చేసిన చార్జిషీట్‌లో షబ్బీర్ అలీ బండారం బట్టబయలైంది. తేలు కుట్టిన దొంగల్లా దీనిపై కాంగ్రెస్ నాయకులు నోరు మెదపడం లేదు.

బంగారం దిగుమతుల్లో ఎంఎంటీసీకి రూ.194 కోట్లు నష్టపర్చి సీబీఐ ఉచ్చులో చిక్కుకున్న మినరల్స్ అండ్ మెటల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఎంఎంటీఎస్) జ్యూయలరీస్ అధినేత సుఖేష్ గుప్తాను కేసు నుంచి బయటపడేయడానికి అతని స్నేహితుడు సతీష్ సానాకు అప్పటి కాంగ్రెస్ నేతలు బొత్స సత్యనారాయణ, షబ్బీర్ అలీలు సహకరించారు. సీబీఐ కేసులో అరెస్టయిన సుఖేష్ గుప్తాకు బెయిలు ఇప్పించేందుకు మాంసం వ్యాపారి ఖురేషీ ద్వారా తతంగం నడిపించిన సతీష్ వీరిద్దరి సాయం కోరారు. మొదటిసారి బొత్సతో కలిసి ఢిల్లీకి వెళ్లిన సతీష్ మరో రెండుసార్లు షబ్బీర్ అలీని వెంట తీసుకెళ్లారు.

### మొయిన్ ఖురేషీ ఎవరు?

సీబీఐ డైరెక్టర్ రంజిత్ సిన్హా అధికార దుర్వినియోగం కేసు దర్యాప్తులో మనీలాండ రింగ్‌కు పాల్పడిన మొయిన్ ఖురేషి బయటకొచ్చింది. ఇతని ఢిల్లీ ఈడీ కోర్టులో ప్రాసిక్యూషన్ అభియోగ పత్రం దాఖలు చేసింది. అధికారులను ప్రలోభపెట్టేందుకు ఖురేషి దేశవ్యాప్తంగా ప్రయత్నాలు చేసినట్టు వెలుగు చూసింది. ఈ క్రమంలోనే ఖురేషీ నెట్‌వర్క్ మొత్తాన్ని సీబీఐ ఛేదించింది. ఈడీ సైతం అతని వ్యవహారాలపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపట్టింది. ఖురేషీ బ్లాక్‌బెర్రీ మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, అందులోని ఫోన్ నంబర్లు, మేసేజ్‌లు, కాల్‌డాటాను సేకరించింది.

ఓ సంస్థను వేల కోట్లు ముంచిన నిందితుడికి బెయిల్ ఇప్పించే విషయంలో ఏకంగా సీబీఐ డైరెక్టర్‌కు ముడుపులు ఇప్పించేందుకు షబ్బీర్ అలీ మధ్యవర్తిత్వం వహించినట్టు ఇప్పుడు వెలుగు చూసింది. షబ్బీర్ అలీతోపాటు అప్పటి కాంగ్రెస్ మంత్రి, ప్రస్తుత వైసీపీ నాయకుడు బొత్స సత్య నారాయణ ప్రమేయం కూడా ఈ దందాలో ఉన్నట్టు బయటపడింది. ఇప్పటికే ఈ కుంభకోణంలో పేర్లన్నీ బయటికి వచ్చినప్పటికీ, ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నుంచి తనకేమీ నోటీసులు రాలేదని షబ్బీర్ అలీ బుకాయిస్తున్నారు.

ఖురేషీకి దేశవ్యాప్తంగా అత్యున్నత స్థాయిలో పనిచేస్తున్న అధికారులు, దర్యాప్తు సంస్థల చీఫ్‌లు, ప్రజాప్రతినిధులతో సన్నిహిత సంబంధాలున్నట్లు ఈడీ గుర్తించింది. ప్రభుత్వ అధికారులకు లంచంగా ఇచ్చిన నగదును హవాలా మార్గంలో ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలకు పంపించినట్టు మొబైల్ ఫోన్ ఆధారంగా నిర్ధారించుకున్నది. ఖురేషీతో సంబంధాలున్న వ్యాపారి సతీశ్ సానాను అదుపులోకి తీసుకొని విచారించింది. ఇద్దరి నుంచి ఈడీ సేకరించిన వాంగ్మూలంలో సుఖేశ్‌గుప్తా కోసం కాంగ్రెస్ నేతలు షబ్బీర్ అలీ, ప్రస్తుత వైసీపీ నేత బొత్స సత్యనారాయణ మధ్యవర్తిత్వం జరిపినట్టు తేల్చారు. సీబీఐ కేసులు ఎత్తివేయడం, బెయిల్ ఇప్పించడం కోసం కోనేరు ప్రదీప్, సతీశ్ సానా, అశోక్ జైన్, ముఖుల్ జోషి, అజాహర్ సాబ్, గౌతం నుంచి రూ.11.09 కోట్లను ఖురేషీ వసూలు చేసినట్టు ఈడీ ఆధారాలు సేకరించింది.

ఢిల్లీలోని స్టీఫెన్ కళాశాలలో డిగ్రీ చేసిన ఖురేషీ ఈ విద్యాసంస్థల్లో చదువుకొని ఉన్నతస్థానాల్లో ఉన్నవారితో పరిచయమేర్పర్చుకున్నాడు. సీబీఐతో పాటు అత్యున్నత విచారణ సంస్థల్లో పనిచేస్తున్న తోటి స్నేహితులకు పలు సందర్భాల్లో విందులు, వినోదాలు ఏర్పాటు చేస్తూ, బహుమతులు ఇచ్చాడు. వారితో పైరవీలు చేయించుకొని బాధితుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేయడాన్ని వృత్తిగా మలుచుకొన్నాడు. స్నేహితులకు ఇవ్వాల్సిన డబ్బును విదేశాల్లోని వారి ఖాతాల్లో హవాలా మార్గంలో జమచేసేవాడు.

సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ బదిలీ కోసం రాష్ట్రానికి చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో కీలక నిందితుడైన కోనేరు ప్రసాద్ కుటుంబ సభ్యులు కూడా ఖురేషీని సంప్రదించారు. అందుకు రూ.5.07 కోట్లు ముట్టజెప్పినట్టు ఈడీకి ఇచ్చిన వాగ్మూలంలో కోనేరు ప్రదీప్ పేర్కొన్నాడు. ఇలా పదేండ్లలోనే వందల కోట్లు కూడబెట్టాడు. వివిధరంగాల్లో పెట్టుబడులు పెడుతూ ఈడీ, సీబీఐకి దొరికిపోయాడు.

లాబీయింగ్ ఎక్స్‌పెర్ట్ అయిన ఖురేషీతో సుఖేష్ గుప్తాకు బెయిల్ ఇప్పించడం సాధ్యమవుతుందని షబ్బీర్ అలీ, బొత్స సత్య నారాయణ భావించారు. ఈ విషయంలో ఢిల్లీలోని ఖురేషీ ఫాం హౌజ్‌లో అతన్ని కలిసి బెయిల్ కోసం 2 కోట్ల వరకు ముట్టజెప్పినట్టు తెలుస్తుంది. తీగ లాగితే డొంక కదిలిన చందంగా మొయిన్ ఖురేషీ మనీలాండరింగ్ కేసులో షబ్బీర్ అలీ, బొత్స సత్యనారాయణ వ్యవహారం బయట పడింది. ఈ నేపథ్యంలో షబ్బీర్‌అలీ, బొత్స సత్యనారాయణకు ఉన్న సంబంధాలపై ఆరా తీసిన ఈడీ త్వరలో నోటీసులు జారీచేసి విచారించే అవకాశం ఉంది. ■

అనుభవాలతో పండిన ముఖబింబం పవిత్రమైన స్థలంలోని ప్రమిదలా వెలుగుతుంది. - బైరస్

# బీద, బడుగు వర్గాల బతుకులను ఛిద్రం చేస్తున్న మద్యం మహమ్మారి

ప్రొఫెసర్ యస్.వి.శేషగిరి రావు
బిజెపి జాతీయ నాయకుడు



గతంలో చాలా రాష్ట్రాలు మద్య పానాన్ని నిషేధించటం, దాన్ని అమలు చెయ్యలేక ఎత్తివేయటం అందరికీ తెలిసిన చరిత్రే. మన దేశంలోను, ప్రపంచంలోను వస్తున్న మార్పులను గమనించకుండా ఆ చరిత్రను తవ్వి అవే కారణాలను మళ్లీమళ్లీ వల్లించాల్సిన అవసరం లేదు. 2,200కు పైగా లైసెన్సుడు దుకాణాలతో, 20,000కు పైగా బెల్ట్‌షాపులతో ఈ రోజు తెలంగాణలో మద్యం మహమ్మారి సృష్టిస్తున్న ఆర్థిక, సాంఘిక సంక్షోభాన్ని, అరాచకాన్ని అర్థం చేసుకోవడం, విశ్లేషించడం– ఈ మహమ్మారి నుంచి కుటుంబాలకు, ముఖ్యంగా మన తల్లులకు, ఆడపడుచులకు ఊరట కల్గించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత.

మద్యానికి మన యువత బానిసైపోతున్నది. హైస్కూల్‌లో ఉన్నప్పుడే తాగుడు అలవాటు చేసుకుంటున్నారు. హైదరాబాదు మహానగరంలో స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, విద్యార్థినులు ప్రతిరోజూ 30 వేల మంది బార్లకు పోతున్నారు. క్లాసులు ఎగ్గొడుతున్నారు. ఉస్మానియా యనివర్సిటీలో అధ్యాపకులు, వారి విద్యార్థులు కలిసి రిసార్టులలో మందు పార్టీలు చేసుకుంటున్నారు. ఇదేమి సమాజం? మన యువత ఎటుపోతున్నది?

దక్షిణాది రాష్ట్రాలలో అత్యధికంగా మద్యం మీద ఆదాయం వస్తున్నది తెలంగాణ రాష్ట్రానికే. తమిళనాడు, కేరళలో మద్యం అమ్మకాలు తగ్గుతుండగా ఇక్కడ మాత్రం ప్రభుత్వ ప్రోత్సాహం ద్వారా ఏయేటికాయేడు పెగుతున్నాయి.

అక్టోబర్ 2017 నుంచి అమలులోకి వచ్చిన కొత్త విధానంలో జనాభాను బట్టి దుకాణాల సంఖ్యను నిర్ణయించడమంటే బలవంతంగా, అలవాటులేని వారికి కూడా మద్యం అలవాటు

| జనాభా | దుకాణాలు |
|---|---|
| 50 వేల వరకు | 1262 |
| 50 వేలు– 5 లక్షలు | 444 |
| 5 లక్షలు – 20 లక్షలు | 44 |
| జిహెచ్ఎంసి పరిధిలో | 466 |
| | 2,216 |

చెయ్యడమే.

బెల్ట్‌షాపులేని గ్రామం కాని, బస్తీకానీ లేదు. ఇంజనీరింగ్ కాలేజీల పక్కన ఉన్న దుకాణాలు కూడా బెల్ట్ షాపులుగా మారాయి.

**ఇంకా కొత్త విధానం ప్రకారం...**

- ➢ దుకాణాలలో పర్మిట్ రూమ్‌లను నడుపుకోవచ్చు
- ➢ దుకాణాలను తెరిచి ఉంచే సమయం రాత్రి 10 గం|| నుంటి 11 గం||ల వరకు పొడిగించబడింది. (ఈ నిబంధనను ఎవరు పాటిస్తున్నారు? 12 గం||లు దాటినా దుకాణాలు తెరిచే ఉంటాయి.

మాల్స్, సూపర్ బజార్లలో కూడా మద్యం అమ్మకాలను అనుమతించాలని ప్రభుత్వం భావిస్తున్నదట!

**ప్రభుత్వానికి మద్యం అమ్మకాల ద్వారా ఆదాయం ఎలా వస్తుంది?**

| | |
|---|---|
| 1. | లైసెన్సు ఫీజు |
| 2. | ఎక్సైజ్ డ్యూటీ |
| 3. | వ్యాట్ |
| 4. | సి.యం.ఆర్.ఎఫ్ |
| 5. | ఇతరములు |

మద్యం ఆదాయం ఏటా రూ. 2 వేల కోట్లు పెరుగుతూ వస్తున్నది. ఈ ఏడాదికి ప్రభుత్వాదాయం దాదాపుగా రూ.16 వేల కోట్లుగా ఉండే అవకాశముంది.

మద్యంపై సంపన్న వర్గాలు పెట్టే ఖర్చు రూ.3,000– 4,000 కోట్లు కూడా ఉండదు. రూ.36 వేల కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో బడుగు బలహీన వర్గాలు, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి కుటుంబ పెద్దలు, యువత మద్యానికి తగలేస్తున్నారు. కుటుంబాల నికరాదాయమేదో ఈ దేశంలో ఆర్థిక శాస్త్రవేత్తలు అర్థం చేసుకోకపోవడం, విశ్లేషించకపోవడం దురదృష్టకరం.

**కుటుంబాల నికరాదాయం = కుటుంబాల మొత్తం ఆదాయం – కుటుంబ పెద్ద మద్యానికి పెట్టే ఖర్చు**

బడుగు బలహీన వర్గాలు తమ ఆదాయంలో మద్యానికి పెట్టే ఖర్చు సింహభాగం. జీడీపీ వంటి గణాంకాల ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోవచ్చు కానీ బీద బడుగు వర్గాల ఆర్థిక స్థితి, జీవన ప్రమాణం అర్థంకాదు. ఇంత మొత్తాన్ని ఈ వర్గాలు తాగుడుకై ఖర్చుచేస్తే, దాని ప్రభావం వారి ఆర్థిక, సాంఘిక జీవనంపై ఎలా ఉంటుందో ఊహించడం కష్టమేమీకాదు. తిండి, బట్ట, ఆరోగ్యం, పిల్లల చదువు– కనీస అవసరాల నడ్డి విరిగిపోవడమే. దీన్ని మించిన దోపిడి మరేముంటుంది? నెల మొదటి వారంలోనే మద్యం దుకాణాల టర్నోవర్ ఎక్కువగా ఉండటం దేన్ని సూచిస్తుంది?

ఆర్థికాభివృద్ధి కొరకు ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాల వల్ల పెరుగుతున్న ఆదాయం ఇండ్లకు చేరడం లేదు. మధ్యలోనే మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపులు లాగేసుకుంటున్నాయి. వృద్ధాప్య పెన్షన్లు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి స్కీముల వల్ల బడుగు బలహీన వర్గాలకు కల్పించిన ప్రయోజనాలను కూడా సీసా తన్నుకపోతున్నది. పేద కుటుంబాలు పేదరికంలోనే మిగిలిపోతున్నాయి.

## పేదరికానికి ప్రధాన కారణం మద్యం మహమ్మారే

ఇండియాలో పేదరికానికి ప్రధాన కారణం తాగుడని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తన 2014 రిపోర్టులో స్పష్టంగా పేర్కొంది. కుటుంబాల ఆదాయం ప్రధానంగా పురుషుల మీద ఆధారపడి ఉందని, వారిలో ఎక్కువ మంది తాగుడుకు బానిసలు కావడం వల్ల, కుటుంబాలకు "మిగిలే" ఆదాయాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని ఆ సంస్థ గణాంకాలు చెపుతున్నాయి. 30 శాతం భారతీయులు తాగుతున్నారు. మనది ప్రపంచంలో మూడవ స్థానమట (ప్రథమ

**తెలంగాణ ఏర్పడిన తర్వాత మద్యం ద్వారా ప్రభుత్వాదాయం ఎలా పెరిగింది?**

| సంవత్సరం | మద్యం ఆదాయం |
|---|---|
| 2014-15 | రూ. 10,238 కోట్లు |
| 2015-16 | రూ. 12,200 కోట్లు |
| 2016-17 | రూ. 14,092 కోట్లు |

స్థానంలో రష్యా, ఎస్తోనియాలు). గతంలో మనదేశంలో మద్యం సేవించేవారి సగటు వయస్సు 28 సం॥ కాగా ఇప్పుడది 17 సం॥ కిందికి దిగిందని ఆ నివేదిక చెపుతున్నది. దానర్థం 10-12 ఏండ్ల నుంచే తాగుడుకు అలవాటు పడుతున్నారని కదా!

ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఒఇసిడి) అనే మరొక అంతర్జాతీయ సంస్థ 2015 మేలో పారిస్‌లో విడుదల చేసిన రిపోర్టులో కొన్ని చేదు నిజాలను వెల్లడించింది. 1992-2012 మధ్య 20 సంవత్సరాలలో ఇండియాలో తలసరి తాగుడు 55 శాతం పెరిగింది. తెలంగాణాలో ఈ శాతం 75కు పైనే ఉంటుంది. ఒఇసిడి సెక్రెటరీ జనరల్, ఏంజెల్ గురియా తాగుడును నియంత్రించకపోతే, భారత ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని విశ్లేషించింది.

15-49 సం॥ వయస్సు వారిలో మితిమీరిపోతున్న తాగుడు, పనిగంటలు,

**తెలంగాణ ఏర్పడిన తర్వాత బ్రవరేజస్ కార్పొరేషన్ (టిఎస్‌బిసిఎల్) అమ్మకాలు (అనగా ఉత్పత్తి దారుడికి ముట్టేది)**

| | |
|---|---|
| **2014-15** | **రూ. 10,883 కోట్లు** |
| **2015-16** | **రూ. 12,705 కోట్లు** |
| **2016-17** | **రూ. 14,480 కోట్లు** |

**మద్యంపై ప్రజలు పెట్టే ఖర్చు లెక్కించడం ఎలా?**

**అ) ప్రభుత్వ ఆదాయం**

**ఆ) ఉత్పత్తిదారుల వాటా (బెవరేజస్ కార్పొరేషన్ అమ్మకాలు)**

**ఇ) దుకాణాల, బార్ల నిర్వహణ ఖర్చులు**

**ఈ) దుకాణదారుల లాభాలు**

**ఉ) మామూళ్లు**

**పై పద్దులన్నీ కలిపితే ప్రజలపై పెట్టే ఖర్చు ఎంతో తెలుస్తుంది.**

పనిదినాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఉత్పత్తిరంగం దెబ్బతింటున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక చెపుతున్నది. బెల్టుషాపుల కారణంగా గ్రామగ్రామాన ఉదయం 6 గం॥కే తాగి జోగుతూ, పనుల్లోకి పోకుండా ఇంట్లోనే ఉండిపోయే వారి సంఖ్య తెలంగాణాలో విపరీతంగా పెరిగిపోతున్నది.

### భయంకర వ్యాధులు

2012లో దేశంలో 33 లక్షల మంది తాగుడువల్ల ఉత్పన్నమయ్యే కాలేయ సంబంధ వ్యాధుల వల్ల మరణించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెపుతున్నది. పక్షవాతం, క్షయ, హైపర్‌టెన్షన్, మూర్ఛ సంబంధ మరణాల్లో 10 శాతం వరకు కారణం తాగుడే. ముంబాయిలోని టాటా మెమోరియల్ హాస్పిటల్‌లోని ప్రఖ్యాత క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ పంకజ్ చతుర్వేది మాటలలో "నోటి, ొతీశీజూష్ట్రుతీఎఅఞ, ొవంశీజూష్ట్రుస్త్రబం, కాలేయు, స్థనాల క్యాన్సర్‌కు కూడా తాగుడే ప్రధాన కారణం."

45 ఏండ్ల పురుషులపై 5 సంవత్సరాల పాటు పరిశోధనలు కొనసాగించిన మరొక సంస్థ కోహోర్ట్ (ముంబాయి), మద్యంతో పాటు నమిలే పొగాకు, గుట్కా, సిగరెట్లు కూడా అలవాటైతే ఈ క్యాన్సర్ వల్ల ముప్పు మరింత ఎక్కువవుతుందని పేర్కొంది. హృద్రోగాలకు బలైపోతారని కూడా హెచ్చరించింది.

### రోడ్డు ప్రమాదాలు

అకాల మరణాలను సూచించేొా 7(ఝతీం శీట ొఱటవ ొశీర్) స్కేలు 1-5లో ఇండియా 4 దగ్గర ఉందనే భయంకర సత్యాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎత్తిచూపుతున్నది. 25 శాతం రోడ్డు ప్రమాదాలు కూడా మద్యం సేవించి నడిపేవారి వల్లనేనని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు చెపుతున్నాయి. తప్పతాగి మోటారు వాహనాన్ని నడిపేవాడు ఆత్మాహుతికి సిద్ధపడ్డ ఉగ్రవాది లాంటివాడని గతంలో ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. తెలంగాణాలో మద్యం తాగి వాహనాలు నడిపేవారు ఏటా వందలాది అమాయకుల ప్రాణాలను హరిస్తున్నారు.



పత్తికి రూ.4320 కనీస మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 బోనస్ చెల్లించాలని, ట్రేడర్స్‌ను మిల్లర్స్‌ను రంగంలోకి దింపి కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయించాలని, మధ్య దళారులు తక్కువ ధరకు పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేయడాన్ని నివారించి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జనగాంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.వి.ఎన్.ఎల్.రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డు మార్గానికి దీన్‌దయాళ్ మార్గంగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఐఓఆర్ పాలకమండలి సభ్యుడు అయ్యన్నగారి భూమయ్య, కృష్ణా గోదావరి జలాల రాష్ట్ర కన్వీనర్ రావుల రాంనాథ్, అంజు కుమార్ రెడ్డి, ఆడెపు సుధాకర్, బడిసెల్ శ్రీనివాస్, రచ్చ మల్లేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొరిపెల్లి శ్రావణ్ రెడ్డి, నాయుడి మురళీ, తోట సత్యనారాయణ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారులకు 500 మీటర్ల పరిధిలో మద్యం దుకాణాలుండరాదని గత డిసెంబరులో సుప్రీం కోర్టు ఆదేశించింది. కానీ ఈ ఆదేశం నగరాలలోని రహదారులకు వర్తించదని తర్వాత నీరు గార్చింది. సంపాదించే వయసులో ఒక వ్యక్తి ఈ విధంగా అకాలమరణం పాలైతే ఆ కుటుంబం ఛిద్రమై రోడ్డున పడుతున్నది. మనం రోజూ చుట్టూ చూస్తున్న దృశ్యాలే యివి.

### మహిళల రోదన: ఆర్తనాదాలు

తెలంగాణలో సూర్యాస్తమయం అయితే చాలు, తప్పతాగి వచ్చిన భర్తలు కొట్టే దెబ్బలు, హింస భరించలేక మహిళలు పెట్టే రోదనలతో, ఆర్తనాదంతో లక్షలాది ఇండ్లు ప్రతిరోజూ ప్రతిధ్వనిస్తుంటాయి. తల్లి పడే వ్యథ చూడలేక పిల్లలూ ఏడుస్తుంటారు. ఆ తాగుబోతు, పిల్లల మీద కూడా కనికరం చూపడు. ఈ మహిళలు పడే వేదన, అభం శుభం తెలియని చిన్నారులు పడే మానసిక క్షోభ, మన సభ్య సమాజానికి వినిపించదు. కనిపించదు. ఆ దెబ్బల నొప్పి నుంచి తేరుకోకముందే, తెల్లవారుతుంది. ఆ గాయాలతో ఆ బాధతో ఈ మూగమహిళలు పనుల్లోకి పోవాలి. లేకపోతే పిల్లలకు పిడికెడు మెతుకులుండవు. ఈ మహిళలు ఎవరికి చెప్పుకోగలరు? ఎవరికి ఫిర్యాదు చెయ్యగలరు? భర్త తన సంపాదనంతా తాగుడుకు తగలేస్తున్నా, తన సంపాదనను కూడా హింసించి గుంజుకుపోతున్నా భార్య ఎందుకు భరిస్తున్నదంటే హృదయం లేని ప్రభుత్వం ఈ సమస్యతో మాకేమీ సంబంధం లేదని ముఖం పక్కకు తిప్పుకోవడం వల్లనే. భర్తే సోషల్ సెక్యూరిటీ కాబట్టి, అతను లేకపోతే పిల్లలతో సమాజంలో జీవించడం చాలా కష్టం కాబట్టి, లక్షలాది మహిళలు కన్నీళ్లతో కాపురాలు నెట్టుకొస్తున్నారు. ఈ దుస్థితికి మద్యాన్ని ప్రోత్సహించే తెలంగాణ ప్రభుత్వమే ప్రధాన కారణం.

**2016-17లో కుటుంబాల ఆదాయంలో తాగుడుకు అయిన వ్యయం**

| | |
|---|---|
| ప్రభుత్వ ఆదాయం | రూ. 14,092 కోట్లు |
| బ్రవరేజస్ కార్పొరేషన్ అమ్మకాలు | రూ. 14,480 కోట్లు |
| దుకాణాల నిర్వహణ, లాభాలు, మాముళ్లు | రూ. 7,000 కోట్లు (20%గా పరిగణిస్తే) |
| | రూ. 35,572 కోట్లు |

**2017-18లో కుటుంబాల ఆదాయంలో రూ.40 వేల కోట్లు ఆవిరైపోతుంది**

| | |
|---|---|
| ప్రభుత్వ ఆదాయం | రూ. 15,000 కోట్లకు పైగా |
| బ్రవరేజస్ కార్పొరేషన్ నుండి కొనుగోళ్లు | రూ. 16,000 కోట్లకు పైగా |
| దుకాణాల నిర్వహణ, లాభాలు | రూ. 9,000 కోట్లు షుమారుగా |
| | రూ. 40,000 కోట్లు |

ఎక్సైజ్ ఆదాయం ఆర్థిక వనరనే అమానవీయ ఆలోచనలోంచి ఈ ప్రభుత్వం బయటకు రావాలి. మహిళల జీవితాలు ఛిద్రం కావడం వల్ల వచ్చే ఆదాయం మీద ఆధారపడటాన్ని మించిన నీచత్వం మరొకటి లేదు. ఏ సమాజంలో తల్లులు, ఆడపడుచులు కన్నీరు పెడతారో ఆ సమాజానికి ప్రగతి ఉండదు.

గత సంవత్సరం నవంబరు 11-12 తేదీలలో నేను 24 గంటలు నిరాహారదీక్ష చేసిన తర్వాత సమాజంలోని అనేక వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో మహిళలు పెద్దఎత్తున నిరసనకు దిగారు. ఆవాసాల్లో, బస్తీల్లో, కాలనీల్లో మద్యం షాపులు తెరవడానికి వ్యతిరేకంగా తెలంగాణలో కూడా మహిళలు ఉద్యమానికి దిగుతున్నారు.

రాష్ట్ర బిజెపి శ్రేణులు, మద్యపానాన్ని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ, గ్రామ గ్రామాన, వీధివీధినా పోరాటం చెయ్యాల్సిన సమయం ఆసన్నమైంది. ఆ దిశలో మన సామాజిక కర్తవ్యాన్ని నిర్వహించడానికి నడుం బిగిద్దాం. ■



అక్టోబర్ 25న హైదరాబాద్ కూకట్‌పల్లి డివిజన్‌లోని ఏ.వి.బి.పురంలో బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో సుమారు 250 మందికి ఉచిత కళ్ళ జోళ్లు పంపిణీ చేశారు. భారత మాజీ రాష్ట్రపతి ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి ఈ జోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి విజిత్ వర్మ, నాయకులు మల్లేష్, ఉదయ్, అనిల్ వాసు, నర్సింహా, బాలాచారి, వినయ్, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 31న మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 'దివాలీ మిలన్'లో కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్, ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు, మైనార్టీ మోర్చా నేతలు






నిరుత్సాహపడితే దైవం కూడా వ్యతిరేకిస్తుంది. - ఆచార్య చాణక్యుడు

# కమీషన్ కాకతీయే! తేల్చిచెప్పిన కాగ్

మిషన్ కాకతీయ కాదు.. కమీషన్ కాకతీయ అన్న బిజెపి విమర్శలు నూటికి నూరుపాల్లు నిజమయ్యాయి. ఈ పథకం కింద చేపట్టిన పనులను ఆడిట్ చేసిన కంప్ట్రోలర్ అండ్ అడిట్ జనరల్ కాగ్ అందులో అవినీతి చోటు చేసుకుందని స్పష్టం చేసింది. మిషన్ కాకతీయలో చేసిన పనుల్లో సగం పనికొచ్చేవి కావని తేల్చింది. మిగిలినవాటిలో సగం అంతకుముందే వివిధ పథకాల కింద చేసినవేనని వెల్లడించింది. ఇక పూడికతీతను అంచనాల్లో పేర్కొన్న దానికంటే యాభై శాతానికి పైగా తగ్గించడం అనుమానాలకు తావిస్తోందని వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయపై అధ్యయనం చేసిన కాగ్ ముసాయిదా నివేదికను నీటిపారుదల శాఖకు అందజేసింది. ఆయకట్టుకు సంబంధించి అధికారులు చెప్పిన లెక్కలకు, వాస్తవానికి పొంతనలేదని స్పష్టం చేసింది.

> 
>
> “టీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో ‘నెంబర్ వన్’గా దూసుకుపోతుందని చెప్పడానికి ‘కాగ్’ నివేదికే నిదర్శనం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలలో అవినీతి అక్రమాల ద్వారా కాంట్రాక్టర్లు, టీఆర్ఎస్ కార్యకర్తల జేబులు నింపుతున్నారు. అవినీతికి పాల్పడి వారిని చెప్పుతో కొట్టాలని సీఎం అనేకసార్లు పిలుపునిచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలలో అవినీతి, అక్రమాలు జరిగాయని ‘కాగ్’ నివేదిక స్పష్టం చేసిన నేపథ్యంలో ఎవరిని చెప్పుతో కొట్టాలో ముఖ్యమంత్రే రాష్ట్ర ప్రజలకు తెలపాలి.”
>
> **–డా॥ కె.లక్ష్మణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు**

రైతులకు ఎంత మట్టి సరఫరా చేసింది, చెరువులో ఎంత మట్టి తీసి కట్టకు వినియోగించారన్న వివరాలను నిర్వహించ లేదని, వివరణ అడిగితే పని ఒత్తిడి, సిబ్బంది కొరత అంటూ ఇంజినీర్లు సాకులు చెప్పారని కాగ్ పేర్కొంది. కొన్నిచోట్ల అనూహ్యంగా అంచనాలను పెంచేశారని పేర్కొంది. నమూనాగా పరిశీలించిన పనుల్లో రూ.2.07 కోట్లు ఇలా పెంచేసినట్లు తెలిపింది. గుత్తేదారులు పని పూర్తి చేసే సమయం 12 నెలలకు మించితే ఒక శాతం లేబర్ సెస్ కలపాలని, అయితే మిషన్ కాకతీయలో 3 నుంచి 6 నెలల్లోపు పనులకు కూడా కలిపారంది. దీనివల్ల తాము పరిశీలించిన రూ.96.49 కోట్ల పనుల్లో రూ.96.49 లక్షలు అవసరం లేకపోయినా అంచనాల్లో చేర్చారని, మొత్తంమీద ఖర్చును పరిగణలోకి తీసుకుంటే రూ.24.74 కోట్లు అదనంగా చెల్లించినట్లని తెలిపింది. నిబంధనల ప్రకారం మట్టికట్టకు 8 నుంచి 10 టన్నుల సామర్థ్యం గల పవర్ రోలర్‌ను వినియోగించాలని, కానీ 2 టన్నుల రోలర్‌ను అనుమతించారని కాగ్ పేర్కొంది. నీటిని కొలిచే పరికరాలను ఎక్కడా ఏర్పాటు చేయలేదని పేర్కొంది.

ఇతర పథకాల కింద చేయని పనులకు మిషన్ కాకతీయలో ప్రాధాన్యత ఇవ్వాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నా గతంలో ప్రజల భాగస్వామ్యంతో చెరువుల అభివృద్ధి పథకం, కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన రిపేర్–రెన్యువేషన్–రిస్టోరేషన్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పాటు రాష్ట్ర ప్రణాళికా నిధులతో చెరువులను పునరుద్ధరించారు. అలాంటి చెరువులను కూడా మళ్లీ ప్రాధాన్యతా క్రమంలో మొదటి, రెండో దశలో ఎంపిక చేశారు. గత ఐదేళ్లలో ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదంటూ అధికారులు చెప్పారు కాని వాటిలో కొన్ని 2013లో చేపట్టినవి ఉన్నాయి. వీటికి సంబంధించి నీటిపారుదల శాఖ ఇచ్చిన సమాచారం సరిగా లేదు. గతంలో వేరే పథకాల కింద చేపట్టినా నిధులు సరిపోక అసంపూర్తిగా ఉండిపోయాయని, అందుకే మళ్లీ చేపట్టామంటూ వివరణ ఇచ్చారు. కాని ఇది ఈ పథకం మార్గదర్శకాలకే విరుద్ధం.

> **మొత్తం రూ.96.49 కోట్ల విలువ చేసే పనులను ఆడిట్ చేస్తే ఇందులో రూ.40.25 కోట్లు నిధులతో చేపట్టిన పనులు ప్రాధాన్యత ఉన్నవి కావని తేలింది. ఇక ఈ పథకంలో పునరుద్ధరించిన అన్ని పనులను ఆడిట్ చేస్తే ఇంకెన్ని అవినీతి కథలు, అక్రమ వ్యవహారాలు బయట పడుతాయో ఊహించడం పెద్ద కష్టం కాదు. కాకతీయుల పేరు మీద పెట్టిన ఈ పథకం రైతుల కన్నా కాంట్రాక్టర్లకు, టీఆర్ఎస్ కార్యకర్తలకే ఎక్కువ ఉపయోగపడిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.**

మిషన్ కాకతీయలో గొలుసుకట్టు చెరువులకు ప్రాధాన్యత ఇవ్వాలి. మండలాల వారీగా ఇలాంటి చెరువుల జాబితాను తయారు చేసి పనులు చేపట్టాలి. అయితే 15 డివిజన్లకు గాను 5 డివిజన్లు మాత్రమే ఇలాంటి జాబితాను సిద్ధం చేశాయి. ఆహ్లాదం కోసమంటూ రూ.266.80 కోట్లతో 73 మినీట్యాంకుబండ్ల పనులు చేపట్టారు. వీటిలో రెండింటిని పరిశీలిస్తే ఆక్రమణలు తొలగించకుండానే సుందరీకరణ పనులు చేపట్టినట్లు తేలింది. సుందరీకరణకు కాంట్రాక్టర్లతో ఒప్పందాలు చేసుకున్న తర్వాత సర్వే చేసి ఎఫ్.టి.ఎల్. నిర్ణయించమని నీటిపారుదల శాఖ అధికారులు రెవిన్యూకు లేఖలు రాశారు. అయితే ఇప్పటివరకు ఆక్రమణలను నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆయకట్టుకు అవకాశం లేని, మార్గదర్శకాల ప్రకారం లేని పనులు కూడా ఉన్నాయి. వరంగల్ అర్బన్‌లోని భద్రకాళి చెరువును రూ.2.2 కోట్లతో చేపట్టారు. దీనికి ఎలాంటి ఆయకట్టు లేదు. కానీ మిషన్ కాకతీయ కింద చేపట్టారు. ఆక్రమణలకు గురికాకుండా చూసేందుకు ఈ పనులు చేపట్టామని అధికారులు చెప్పారు. కాని ఇది మిషన్ కాకతీయ లక్ష్యం కాదు. మిషన్ కాకతీయ పనుల్లో 27 శాతం ప్రాధాన్యత లేనివే. ఇవి పథకం లక్ష్యాలకు తగ్గట్లుగా లేవు. మొత్తం రూ.96.49 కోట్ల విలువ చేసే పనులను ఆడిట్ చేస్తే ఇందులో రూ.40.25 కోట్లు (41.71 శాతం) నిధులతో చేపట్టిన పనులు ప్రాధాన్యత ఉన్నవి కావని తేలింది. ఇక ఈ పథకంలో పునరుద్ధరించిన అన్ని పనులను ఆడిట్ చేస్తే ఇంకెన్ని అవినీతి కథలు, అక్రమ వ్యవహారాలు బయట పడుతాయో ఊహించడం పెద్ద కష్టం కాదు. కాకతీయుల పేరు మీద పెట్టిన ఈ పథకం రైతుల కన్నా కాంట్రాక్టర్లకు, టీఆర్ఎస్ కార్యకర్తలకే ఎక్కువ ఉపయోగపడిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**–జనసందేశ్ ప్రతినిధి**

# హైదరాబాద్‌ను రక్షిద్దాం




హైదరాబాద్‌ను పట్టిపీడిస్తున్న సమస్యల నుంచి రక్షించాలని కోరుతూ ట్యాంక్‌బండ్‌పైనున్న లవ్ హైదరాబాద్ పాయింట్ వద్ద అక్టోబర్ 21న బిజెపి సేవ్ హైదరాబాద్ సంతకాల సేకరణ చేపట్టింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు, బిజెపి శాసనసభ పక్షనేత జి.కిషన్ రెడ్డి, శాసనమండలి పక్షనేత ఎన్.రాంచందర్ రావు, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు బిజెపి నేతలు, కార్యకర్తలు, నగరవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.■

# గమనిక

పాఠకుల సౌలభ్యం కోసం జనసందేశ్ పక్ష పత్రిక ఈ-మ్యాగజైన్ రూపంలోనూ అందుబాటులోకి వచ్చింది. **http://www.bjptelangana.org/** వెబ్‌సైట్‌లో లాగిన్ అయి జనసందేశ్(ఈ-బుక్) ట్యాబ్‌ను ప్రెస్ చేస్తే గత 10 సంచికలకు సంబంధించిన తేదీలు కనిపిస్తాయి. కావాల్సిన సంచికను ఎంచుకొని క్లిక్ చేస్తే ఈ-మ్యాగజైన్ తెరుచుకుంటుంది. అవసరమైతే పాఠకులు ఈ ఈ-మ్యాగజైన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తర్వాత కూడా చదువుకోచ్చు.

-ఎడిటర్

# అసెంబ్లీకి పాదయాత్ర




అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరుతూ బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అక్టోబర్ 27న తొలిరోజు అసెంబ్లీకి పాదయాత్రగా వచ్చారు. బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్ రాం విగ్రహం నుంచి అసెంబ్లీ వరకు ఈ పాదయాత్ర సాగింది. ఈ యాత్రలో టీడీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పంటలను ప్రదర్శించారు.■

# ఉట్కూరు సర్పంచ్ విడుదల



టీఆర్ఎస్ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుల్లో అరెస్టయి అక్టోబర్ 30న విడుదలైన ఉట్కూరు బిజెపి సర్పంచ్ భాస్కర్ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్‌ను కలిశారు. నైతిక మద్దతు, న్యాయ సహాయం అందించిన డా॥ కె.లక్ష్మణ్, రాష్ట్ర పార్టీకి భాస్కర్, మహబూబ్‌నగర్ బిజెపి నేతలు ధన్యవాదాలు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా ఉట్కూరు గ్రామంలో గణేశ్ శోభాయాత్ర సందర్భంగా రేగిన ఘర్షణల్లో పోలీసులు కుట్రపూరితంగా భాస్కర్‌పై పీడీ యాక్టు కింద జైలులో పెట్టారు. ప్రజల మద్దతుతో బిజెపి పోరాటం ఫలించి భాస్కర్ బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యారు.■



కిరీటాన్ని ధరించే శిరస్సు సుఖానికి దూరమవుతుంది. - షేక్‌స్పియర్